ఈనాడు
విశాఖపట్నం
గురువారం 24 అక్టోబరు 2024
సిటీ 5



## కిక్కిరిసిన రైళ్లలో ఉక్కిరిబిక్కిరి



తుపాను నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం విశాఖకు వచ్చిన ప్రతి రైలు కిక్కిరిసి వెళ్లింది. సాధారణ బోగీల్లో ప్రయాణికుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. తక్కువ సంఖ్యలో ఉన్న ఆ బోగీల్లో కాలుపెట్టేందుకు కూడా వీలు లేని పరిస్థితి. గమ్య స్థానాలకు వెళ్లే క్రమంలో చివరికి మరుగుదొడ్లలోనూ నిలబడి కొందరు ప్రయాణించారు. భువనేశ్వర్-బెంగళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో పరిస్థితిని చిత్రాల్లో చూడొచ్చు. – ఈనాడు, విశాఖపట్నం

## 24,25,26,27 తేదీల్లో పలు రైళ్ల రద్దు



రైల్వే స్టేషన్, న్యూస్‌టుడే: 'దానా' తుపాను కారణంగా పలు రైళ్లను రద్దు చేసినట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈనెల 24న ఎస్ఎంవీటీ బెంగళూర్-హౌవ్‌డా(22888) హమ్‌సఫర్, భువనేశ్వర్-సీఎస్‌టీ ముంబయి(11020) కోణార్క్, భువనేశ్వర్- చెన్నై సెంట్రల్(12830), హైదరాబాద్-షాలిమార్(18046) ఈస్ట్‌కోస్టు.., 25న చెన్నై సెంట్రల్-భువనేశ్వర్ (12829), భువనేశ్వర్-విశాఖ (20841) వందేభారత్, భువనేశ్వర్-సికింద్రాబాద్ (17015) విశాఖ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్- కేఎస్ఆర్ బెంగళూర్(17015) ప్రశాంతి, భువనేశ్వర్-రామేశ్వరం(20896), పూరీ-యశ్వంత్‌పూర్(22883) గరీబ్‌రథ్‌ను రద్దు చేశారు. 26న పూరీ-గాంధీధామ్ (22974), సికింద్రాబాద్-సిల్చార్ (12513), యశ్వంత్‌పూర్-పూరీ (22884) గరీబ్‌రథ్, మంగళూర్ సెంట్రల్- సంత్రాగచ్చి (22852), ఎస్ఎంవీ బెంగళూర్-కామాఖ్య(12551), 27న రామేశ్వరం-భువనేశ్వర్ (20895), వాస్కోడిగామా-షాలిమార్ (18048) అమరావతి, 29న మాల్దా టౌన్-సికింద్రాబాద్ (03430) రైళ్లను రద్దు చేశారు. రద్దు చేసిన రైళ్ల సమాచారం ప్రయాణికులకు చేరవేయడానికి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్లలో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశారు.

## ఇది ఆ దైవమే ఇచ్చిన తీర్పు!

**వైకాపా ప్రభుత్వ హయాంలో ఎన్ని విమర్శలు వచ్చినా శారదా పీఠానికి కారుచౌకగా కట్టబెట్టిన భూములు.. ఎట్టకేలకు మళ్లీ ప్రభుత్వం చేతికొచ్చాయి.**

ఈనాడు, విశాఖపట్నం

- ★ శారదాపీఠానికి భూకేటాయింపులు రద్దు
- ★ వైకాపా హయాంలో కారుచౌకగా కొట్టేసిన వైనం
- ★ వెనక్కి తీసుకున్న కూటమి పాలకులు

నాడు కేటాయించిన 15 ఎకరాలను వెనక్కి తీసుకునే అంశానికి బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. వైకాపా హయాంలో 'రాజగురువు' తరహా హోదా పొందిన శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అడిగిందే తడవుగా నాడు జగన్ ఈ భూములు కేటాయించారు. తొలుత వేద విద్యకు భూములు ఇవ్వాలని కోరి ఆ తర్వాత ఆదాయ అవసరాలకు కేటాయించాలని అప్పట్లో లేఖ రాయడం తీవ్ర చర్చనీయాంశమైంది. అడిగిందే తడవుగా ఆగమేఘాలపై దస్త్రాలు కదిలాయి. అయితే..కూటమి ప్రభుత్వం రాకతో కథ మారింది.

### ఇక్కడే ఎందుకంటే...



**శారదా పీఠానికి కేటాయించిన ఈ భూములు చాలా కీలకమైన ప్రాంతంలో ఉన్నాయి. ప్రసిద్ధ ఎర్రమట్టి దిబ్బలకు సమీపంలో ఉన్నాయి. అంతే కాదు..ఈ కొండపైనుంచి చూస్తే సాగర తీర అందాలు ఆకట్టుకుంటాయి. విశాఖ-భోగాపురం రహదారికి అతి సమీపంలో ఉన్నందున ఈ భూములను కేటాయించినట్లు సమాచారం.**





**అధికారులు ప్రతిపాదించిన ధరకన్నా:** భీమిలికి అతి సమీపంలో కొత్తవలస వద్ద విలువైన 15 ఎకరాలు నాటి వైకాపా ప్రభుత్వం కేటాయించింది. ఇక్కడ ఎకరా రూ.25 కోట్లు పలుకుతుంది. అలాంటి చోట ఎకరం రూ.లక్షకే కట్టబెట్టారు. అధికారులు చెప్పిన ధరకన్నా అతి తక్కుకే ఇచ్చేశారు..





**2021లో** అప్పటి సీఎం జగన్ చినముషిడివాడలోని శారదాపీఠానికి వచ్చారు. ఆ సమయంలో భూకేటాయింపులకు సంబంధించిన అంశం సీఎం దృష్టికి తీసుకువెళ్లగా.. భూమి కేటాయించేలా అధికారులను మౌఖికంగా ఆదేశించారు. ఆ తర్వాత ఈ ప్రక్రియ ఊపందుకుంది. పీఠం అనుకున్నది జరిగింది.

↑ కేటాయించిన భూమి ఇదే



**వీఎంఆర్‌డీఏ అత్యుత్సాహం »** శారదా పీఠానికి గత ప్రభుత్వం పూర్తిగా దాసోహమైందనే విమర్శలు వెల్లువెత్తాయి. ఎందుకంటే... కొత్తవలసలో స్థలం కేటాయించడంతో పాటు వ్యూహాత్మక ఆలోచనతో ఉదారంగా రోడ్డు సదుపాయం కూడా కల్పించారు. భూ కేటాయింపు ఆలోచన ప్రాథమిక దశలో ఉండగానే రోడ్డు కోసం కూడా ప్రణాళిక చేశారు. కొత్తవలస కొండ మీద పీఠానికి స్థలం కేటాయించినా అక్కడ ఎటువంటి అభివృద్ధి లేదు. అయినప్పటికీ విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)ను తెరమీదికి తెచ్చి ఘాట్ రోడ్డు నిర్మించారు. ఇందుకు సుమారు రూ.2 కోట్ల ప్రజాధనం ఖర్చు చేశారు. నేరుగా శారదా పీఠానికి రోడ్డు వేస్తే విమర్శలు వస్తాయని అదే కొండ మీద వీఎంఆర్‌డీఏకు 50 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. అక్కడికి వెళ్లేందుకే ఈ రోడ్డంటూ వాయువేగంగా నిర్మించేశారు. కొండ కింద నుంచి పైకి 1.20 కిలోమీటర్ల ఘాట్ రోడ్డును 40 అడుగుల వెడల్పుతో పూర్తి చేశారు.

## రేపు నీటి సరఫరాకు అంతరాయం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-3 పరిధి 24, 26 వార్డుల్లో శుక్రవారం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని జీవీఎంసీ నీటి సరఫరా కార్యనిర్వాహక ఇంజినీరు టీవీఎల్ సుధాకర్ తెలిపారు. సీతమ్మధార, టీపీటీకాలనీలో 400 ఎంఎం పైపులైను దెబ్బతినడంతో సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేయనున్నట్లు వివరించారు. 26న యథావిధిగా నీటి సరఫరా ఉంటుందన్నారు. టీపీటీ కాలనీ, పీఅండ్‌టీ కాలనీ, నక్కవానిపాలెం, గాంధీనగర్, చైతన్యనగర్, క్రాంతినగర్, శారద పాఠశాల ప్రాంతం, 26వ వార్డు రామకృష్ణనగర్, లలితానగర్, శంకమఠం ప్రధాన రహదారి, లలితానగర్, మంగళవీధి ప్రాంతాల్లో శుక్రవారం నీటి సరఫరా ఉండదని, ట్యాంకర్ల ద్వారా అందజేస్తామని పేర్కొన్నారు.

## నితీష్, రిక్కీభుయ్‌లకు అభినందనలు



నితీష్‌కుమార్‌రెడ్డి




రిక్కీభుయ్

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ఆస్ట్రేలియాలో పర్యటించే భారత ఏ జట్టుకు ఆంధ్రా నుంచి నితీష్‌కుమార్ రెడ్డి, రిక్కీభుయ్‌లు ఎంపిక కావడం అభినందనీయమని ఏసీఏ కార్యదర్శి సానా సతీష్‌బాబు తెలిపారు. పదిహేను మందితో కూడిన జట్టును పురుషుల సెలక్షన్ కమిటీ ఎంపిక చేయగా వీరిద్దరు స్థానం సంపాదించడం గర్వకారణమన్నారు. ఆస్ట్రేలియా-ఎ జట్టుతో మన జట్టు రెండు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడుతుందన్నారు. అనంతరం పెర్త్‌లో టీంఇండియా ఆటగాళ్లతో కలిసి ప్రాక్టీస్ మ్యాచ్ ఆడుతుందని పేర్కొన్నారు.

## మహాసాగరాల్లో మరో చరిత్రకు శ్రీకారం!!

న్యూస్‌టుడే, సింధియా

**సముద్రం ఒడ్డున ఒంటరిగా నిలబడి అంతెత్తున ఎగసిపడే అలల్ని చూస్తేనే... హృదయాంతరాల్లో ఏదో తెలియని భయం కలుగుతుంది. అలాంటి సముద్ర అలలపై తెరచాప బోటు సాయంతో ఇద్దరు మహిళలు రోజుల తరబడి సాగే సాహస యాత్రకు శ్రీకారం చుట్టారంటే.. వారి ధైర్యసాహసాలు మెచ్చుకోవాలి.**



తెరచాప బోటు ఐఎన్ఎస్ తరణి

- ★ తెరచాప బోటుపై మహిళా అధికారుల ప్రయాణం
- ★ 40 వేల కి.మీ. 'నావికా సాగర పరిక్రమ-2' యాత్ర ఆరంభం

భారత నౌకాదళానికి చెందిన ఇద్దరు మహిళా లెఫ్టినెంట్ కమాండర్లు రూపా, దిల్నా సాహస యాత్రను ప్రారంభించారు. 'నావికా సాగర పరిక్రమ-2' పేరిట 21,600 నాటికల్ మైళ్ల (40 వేల కి.మీ) మేర ప్రయాణించనున్నారు. ఇటీవల గోవాలోని 'ఐఎన్ఎస్ మండోవి'లో నిర్వహించిన కార్యక్రమంలో భారత నౌకాదళం అడ్మిరల్ దినేష్ త్రిపాఠి పాల్గొని... సాహస యాత్రకు జెండా ఊపారు.

**» ముందస్తు సన్నద్ధం:** పుదుచ్చేరికి చెందిన ఎ.రూపా 2017లో, కేరళకు చెందిన కె.దిల్నా 2014లో భారత నౌకాదళంలో మహిళా అధికారులుగా చేరారు. వారిద్దరూ ఎంతో కఠినమైన శిక్షణ పూర్తి చేసి, మొక్కవోని దీక్షతో అనేక లక్ష్యాలు సాధించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సముద్రంలో తెరచాప సెయిలింగ్‌లోనూ ప్రతిభ చూపుతున్నారు. సముద్ర యానంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు ముందస్తు శిక్షణ తీసుకుని.. యాత్రకు బయలుదేరారు.



యాత్ర వివరాలు తెలిపే మ్యాప్ వద్ద రూపా, దిల్నా

**» ఇదీ ప్రణాళిక:** 'భారత నౌకాదళం నారీశక్తి- సాగర పరిక్రమ-2' ద్వారా ఈ మహిళా అధికారిణులు తొలుత గోవా నుంచి ఆస్ట్రేలియాలోని ఫ్రెమాంటిల్ తీరానికి చేరుకుంటారు. అక్కడ నుంచి న్యూజిలాండ్‌లోని లిటిల్‌టన్ పోర్టుకు వెళ్తారు. ఆ పోర్టు నుంచి ఫాక్‌లాండ్‌లోని స్టాన్లీ పోర్టుకు, అక్కడ నుంచి దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్ తీరానికి వెళ్లనున్నారు. తిరుగు ప్రయాణంలో కేప్‌టౌన్ నుంచి గోవా తీరానికి చేరుకోవడంతో యాత్ర ముగుస్తుంది.

**'ఐఎన్ఎస్‌వీ-తరణి' తోడుగా:** ఇద్దరు మహిళలు చేపట్టిన యాత్రకు భారత నౌకాదళానికి చెందిన 'ఐఎన్ఎస్‌వీ-తరణి' తెరచాప బోటును సమకూర్చారు. ఈ బోటు అక్వారియస్ షిప్‌యార్డు లిమిటెడ్‌లో నిర్మితమైంది. ఫిబ్రవరి 18, 2017లో భారత నౌకాదళం సర్వీసులో చేరింది. ఈ వెసల్ నావికా సాగర పరిక్రమ-1 యాత్రలోనూ భాగస్వామ్యమైంది. అప్పట్లో గోవా నుంచి రియో, పోర్టు లూయిస్‌కు సాహస యాత్ర సాగింది. అత్యంత శక్తివంతమైన, సామర్థ్యం గల నావిగేషన్, భద్రత, కమ్యూనికేషన్ పరికరాల అమరికతో యాత్రను విజయవంతం చేయడానికి 'ఐఎన్ఎస్- తరణి' ఉపకరిస్తుందని చెబుతున్నారు.

## భద్రతపై దృష్టి.. డ్రోన్ సృష్టి!!

- ★ 'డ్రోన్ సదస్సు'లో గీతం వర్సిటీకి తృతీయ బహుమతి
- ★ సెంటర్ ఫర్ అటానమస్ సిస్టమ్స్‌లో సాంకేతిక అభివృద్ధి

ఈనాడు, విశాఖపట్నం

దర్శనీయ ప్రదేశాలు, ప్రముఖుల నివాసాలు, దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు... ప్రస్తుతం ఇలా అన్నిచోట్ల భద్రత కీలకంగా మారింది. సిబ్బంది ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే ప్రమాదం లేకపోలేదు. దీనికి పరిష్కారంగా డ్రోన్ ద్వారా భద్రత చర్యలు పర్యవేక్షించొచ్చు. డ్రోన్‌కు కెమెరా అమర్చి అపరిచిత వ్యక్తుల కదలికలు తెలుసుకోవచ్చు. గీతం విశ్వవిద్యాలయానికి చెందిన సెంటర్ ఫర్ అటానమస్ సిస్టమ్స్ (సీఏఎస్) అధ్యయన కేంద్రం ఆచార్యులు, విద్యార్థులు ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దారు.



**అమరావతిలో మంగళవారం జరిగిన డ్రోన్ సదస్సు సందర్భంగా నిర్వహించిన హ్యాకథాన్‌లో కేటగిరీ-4లో తృతీయ బహుమతి సాధించారు.**

**» నౌకాదళంతో ఎంవోయూ:** గతంలో కుదుర్చుకున్న ఎంవోయూ మేరకు సీఏఎస్.. భారత నౌకాదళానికి ఒక ప్రాజెక్టును అభివృద్ధి చేసింది. కృత్రిమమేధ సహకారంతో వ్యక్తుల సమాచారాన్ని అందించే సాంకేతిక పరిజ్ఞానం రూపొందించింది. ఈ ప్రాజెక్టును విశాఖలోని 'ఐఎన్ఎస్ కళింగ'లో అమలు చేస్తున్నారు. దీని వల్ల రోజుకు 70 పని గంటలు ఆదా అవుతున్నాయి. ప్రస్తుతం సముద్ర గర్భంలో వాతావరణాన్ని, జీవరాశుల పరిస్థితులను తెలుసుకునేందుకు, అత్యవసర సమయాల్లో మందులు చేరవేసేందుకు, బహిరంగ ప్రదేశాల్లో భద్రత చర్యల పర్యవేక్షణ, ఎరువుల పిచికారీ తదితరాలకు డ్రోన్ల అభివృద్ధిపై అధ్యయనం చేస్తున్నారు.

**» ప్రాజెక్టు ప్రత్యేకతలు:** డ్రోన్‌కు అమర్చిన కెమెరా కృత్రిమ మేధ సహాయంతో పనిచేస్తుంది. భద్రతా వలయంలోకి అపరిచిత వ్యక్తులు, వాహనాలు ప్రవేశిస్తే ముఖ సాంకేతికత ఆధారంగా గుర్తించి వెంటనే అధికారులను అప్రమత్తం చేస్తుంది. వారి చిత్రాలను తీయడంతోపాటు అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా వారు ఎక్కడున్నారో కూడా వివరాలు తెలియజేస్తుంది. ఉగ్రవాదులు, అపరిచిత వ్యక్తులు ఆయుధాలు ధరించి దాడులకు దిగే ప్రమాదాన్ని గుర్తించి, సమాచారం అందిస్తుంది. ఎక్కడైనా గొడవలు జరిగితే భద్రతా సిబ్బందికి వివరాలు చేరవేస్తుంది. దీన్ని వినియోగిస్తే ఒక కి.మీ. పరిధిలో భద్రత పర్యవేక్షణకు నెలకు 500 పని గంటలు ఆదా అవుతాయని విద్యార్థులు చెబుతున్నారు.



ఇటీవల గీతం వర్సిటీకి వచ్చిన కేంద్ర మంత్రి జయంత్ చౌధరికి డ్రోన్ సాంకేతికతను వివరిస్తూ...

### పోటీల్లో ముగ్గురు విద్యార్థులు

పోటీల్లో బీటెక్ సీఎస్ఈ తృతీయ సంవత్సరం విద్యార్థులు కె.జోష్వా, టి.మేఘన, ఈఈసీఈ చివరి సంవత్సరం విద్యార్థి సి.సాయిరామ్ పాల్గొన్నారు. సీఏఎస్ అధ్యయన కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ పి.భరణి చంద్రకుమార్ ఆధ్వర్యంలో డ్రోన్ సాంకేతికతను రూపొందించారు. గీతం ఇన్‌ఛార్జి వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు బుధవారం విజేతలను అభినందించారు.

### బహుమతితో ప్రోత్సాహం

గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో రెండేళ్ల క్రితం సీఏఎస్ అధ్యయన కేంద్రం ప్రారంభమైంది. నాటి నుంచి పలు నూతన ప్రాజెక్టులపై దృష్టి సారిస్తున్నాం. భద్రతా విభాగాలకు మేం రూపొందించిన డ్రోన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. డ్రోన్ సదస్సులో అవార్డు రావడంతో ఎంతో ప్రోత్సాహం లభించింది.

– ప్రొఫెసర్ పి.భరణి చంద్ర కుమార్, డైరెక్టర్, సీఏఎస్ అధ్యయన కేంద్రం

## నేడు జడ్పీ సాధారణ సమావేశం

### ఈ సారైనా ప్రజా సమస్యలపై చర్చ జరిగేనా?



వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్ (జడ్పీ) సాధారణ సమావేశాలు తూతూమంత్రంగా నిర్వహిస్తూ ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు చర్చించేందుకు అజెండాలు సిద్ధం చేస్తున్నప్పటికీ కేవలం రెండు మూడు అంశాలకే సమావేశాలు పరిమితమై ముగుస్తున్నాయి. సభ్యులందరికీ మాట్లాడే అవకాశం రావడం లేదు. ఉమ్మడి జిల్లా పరిధిలోని విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులంతా సమావేశంలో పాల్గొంటున్నారు. ఇక్కడ లేవనెత్తే అంశాలకు అక్కడికక్కడే పరిష్కారాలు కనుగొనే అవకాశం ఉంది. అయినప్పటికీ ఆ దిశగా అడుగులు ముందుకు సాగడం లేదు.

★ ఈ నేపథ్యంలో మూడు నెలల విరామం తర్వాత గురువారం జడ్పీ సాధారణ సమావేశం జరగనున్నది. ఉదయం 10.30గంటకు జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశంలో వ్యవసాయం, విద్య, వైద్యం తదితర పది శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు అజెండా సైతం సిద్ధం చేశారు. జిల్లాకు చెందిన మంత్రి అనిత తోపాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్పీటీసీలు హాజరవుతున్నట్లు ఇప్పటికే అధికారులకు సమాచారం అందింది. మూడు జిల్లాల నుంచి అధికారులు సైతం సమావేశానికి హాజరవుతున్నారు.

★ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండోసారి జడ్పీ సాధారణ సమావేశం జరుగుతోంది. ఉదయం 10.30గంటలకు సమావేశం ప్రారంభం కాగానే గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, చర్యల నివేదికపై చర్చిస్తారు. తదుపరి అజెండాలోకి వెళతారు. ఈసమావేశంలోనైనా కీలక అంశాలపై, ప్రజా సమస్యలపై సమగ్ర చర్చ జరుగుతుందో లేదో చూడాలి.

## ఆస్తిపన్ను పాట్లు.. అన్నీఇన్నీ కావు..!

### విధింపు..బదలాయించడంలో ఇబ్బందులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఆస్తి పన్ను సమస్యలపై నగరవాసుల నుంచి జీవీఎంసీకి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం **'ఆస్తి నిజం.. అధికారుల నిస్తేజం' శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమవడంతో** చాలా మంది బాధితులు బాధలను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.





**» తండ్రి పేరుతో ఉంటే మార్చడం లేదు:** మా తాతల నుంచి సంక్రమించిన ఆస్తిని ముగ్గురు అన్నదమ్ములం పంచుకున్నాం. నా వాటాగా వచ్చిన 90 గజాల స్థలంలో భవనం ఉండేది. దానికి ఆస్తి పన్ను మా తండ్రి పేరిట ఉంది. ఆయన 1990లో మృతి చెందారు. ఇటీవల ఆ భవనం కూలిపోవడంతో చదును చేసి ఖాళీ స్థలంపై పన్ను విధించాలని కోరుతున్నా జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడంలేదు. నా పేరిట ఆస్తి లేదని, ఇప్పటికే పన్ను ఉండటంతో ఖాళీ స్థలం పన్ను వేయడం కుదరదని చెబుతున్నారు.

– పి.శ్రీనివాసరావు, యల్లపువానిపాలెం

**» 22ఏ నిషేధిత జాబితాలో ఉంచేశారు...:** మా స్థలాన్ని 22ఏ నిషేధిత జాబితాలో ఉంచారు. దీంతో దానికి ఆస్తి పన్ను విధించడంలేదు. ఎన్నిసార్లు తిరిగినా అధికారులు పట్టించుకోవడం లేదు. వీఎంఆర్‌డీఏ వేసిన ప్లాట్లకు కూడా ఆస్తి పన్ను వేయడంలేదు. నిషేధిత జాబితాలో ఉందని చెబుతున్నారు. ఒక రకంగా ప్రజలను ప్రభుత్వమే మోసం చేస్తోంది.

– ఎం.రామారావు, పెందుర్తి

**» పట్టా లేదని నిరాకరిస్తున్నారు..:** ముప్పై ఏళ్ల క్రితం ఇంటి స్థలం కొనుగోలు చేసి నా భార్య పేరుపై పన్ను వేయించా. ఆమె 20 ఏళ్ల క్రితం మృతి చెందారు. ఇప్పుడు ఆస్తి పన్ను మార్చాలని కోరుతున్నా జీవీఎంసీ రెవెన్యూ సిబ్బంది పట్టించుకోవడం లేదు. విద్యుత్తు మీటరు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, మరణ ధ్రువీకరణపత్రం ఉన్నా, పట్టా లేకపోవడంతో ససేమిరా అంటున్నారు. పట్టా కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా ప్రయోజనం కనిపించడం లేదు.

– ఎం.వెంకటరమణ, కంచరపాలెం

**» లింక్ డాక్యుమెంట్లు కావాలంటున్నారు..:** ఇరవై ఏళ్ల నుంచి ఇంటికి పట్టా ఉన్నా ఆస్తి పన్ను విధించడం లేదు. లింకు డాక్యుమెంట్లు కావాలని జీవీఎంసీ సిబ్బంది చెబుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన పట్టాకు లింకు డాక్యుమెంటు ఎలా వస్తుందో అర్థం కావడంలేదు. ఎన్నిసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదు.– ప్రవీణ్‌కుమార్, గాంధీనగర్, మాధవధార

**» పాత యజమాని పేరునే:** పాత యజమాని పేరుతోనే 20 ఏళ్ల నుంచి ఆస్తి పన్ను చెల్లిస్తున్నాం. పేరు మార్చాలని కోరితే పట్టా కావాలని అడుగుతున్నారు. గృహం కొనుగోలు చేసినప్పుడు మాకు పట్టా ఇవ్వలేదు. కేవలం పేపర్లు మాత్రమే రాసుకున్నాం. రిజిస్ట్రేషన్ కావడంలేదు. ఆస్తి పన్ను మారడంలేదు. – శ్రావ్య, బర్మా క్యాంపు

**» ఇల్లు విక్రయించడానికి ఇబ్బందులు:** తండ్రి ఇచ్చిన ఇంటిని విక్రయించుకుని గుంటూరు వెళ్లిపోవడానికి ప్రయత్నిస్తున్నా. కొనుగోలు చేయడానికి వచ్చిన వారు ఆస్తి పన్ను బదలాయింపు జరుగుతుందా లేదా అని ఆరా తీస్తున్నారు. తండ్రి పేరిట ఆస్తి పన్ను ఉంది. దాన్ని మార్చాలని అధికారులను సంప్రదిస్తే తండ్రి మా పేరిట ఆస్తి రాసిచ్చినట్లు ఆధారాలను కోరుతున్నారు. దీంతో ఇంటిని ఎవరూ కొనుగోలు చేయడం లేదు.

– డి.ప్రసన్నకుమార్, ఎంవీపీకాలనీ

**» పట్టా అసలైందేనా అంటున్నారు...:** ప్రభుత్వం మంజూరు చేసిన పట్టా ఉన్నా, ఆస్తి పన్ను విధించడం లేదు. మా పట్టా ప్రభుత్వం ఇచ్చిందా లేదా తయారు చేయించిందా అని సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన పట్టాను అనుమానిస్తుంటే ఎవరికి చెప్పుకోవాలో తెలియడంలేదు.

– జె.బెహరా, గాజువాక








## తీరంలో...'మజాకా'

హీరో సందీప్ కిషన్ నటిస్తున్న సినిమా చిత్రీకరణ బుధవారం ఆర్‌కే బీచ్‌లో జరిగింది. త్రినాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో రావురమేష్, అజయ్ నటిస్తున్నారు. వీరిపై చిత్రీకరించిన పలు సన్నివేశాలను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. – ఈనాడు, విశాఖపట్నం

## పంచారామాలకు ఆర్టీసీ బస్సులు


గాజువాక డిపోలో సిబ్బందితో మాట్లాడుతున్న అప్పలనాయుడు

సింధియా, న్యూస్‌టుడే : కార్తిక మాసంలో ప్రతి ఆదివారం విశాఖ నగరం నుంచి పంచారామాల సందర్శనకు రాష్ట్ర ప్రజా రవాణా సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక సర్వీసులు నడుపుతామని జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. బుధవారం ఆయన గాజువాక డిపోను సందర్శించి మాట్లాడారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు ద్వారకా బస్‌స్టేషన్ నుంచి బయలుదేరే సర్వీసు ద్వారా మరుసటి రోజు (సోమవారం) అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట ఆలయాల సందర్శన పూర్తి చేయొచ్చని తెలిపారు. నవంబరు 3, 10, 17, 24న సర్వీసులు ఉంటాయన్నారు. ఒక్కరికి సూపర్ లగ్జరీ ఛార్జీ రూ.2150, అల్ట్రా డీలక్స్‌లో రూ.2100, ఇంద్రలో రూ.2600గా నిర్ణయించామని, ఆన్‌లైన్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ★ లంబసింగి పర్యటనకు వెళ్లే వారి కోసం ప్రతి శని, ఆదివారాల్లో తెల్లవారుజామున 3 గంటలకు ద్వారకా బస్‌స్టేషన్‌లో బస్సులు బయలుదేరుతాయన్నారు. రాజంగి డ్యామ్, కొత్తపల్లి జలపాతాలు, మోదమాంబ ఆలయం, పాడేరు, కాఫీ తోటలు సందర్శనకు వీలుంటుందన్నారు. ఒక్కరికి ఛార్జీ అల్ట్రా డీలక్స్‌లో రూ.800, ఎక్స్‌ప్రెస్‌లో రూ.650గా నిర్ణయించామన్నారు. ★ ధారమతం సందర్శనకు ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం 7 గంటలకు ద్వారకా బస్‌స్టేషన్ నుంచి బస్సులు ఉంటాయన్నారు. శివాలయం, ధారమతం జలపాతాలు, అల్లూరి సీతారామ రాజు మ్యూజియం, బొజ్జన్నకొండ చూసే వీలుంటుందన్నారు. ఒక్కరికి ఛార్జీ సూపర్ లగ్జరీలో రూ.650, అల్ట్రా డీలక్స్‌లో రూ.550గా ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 99592 25602, 90522 27083, 99592 25594, 91001 09731 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## పీరియాడికల్ థ్రిల్లర్‌గా 'క' సినిమా


మాట్లాడుతున్న హీరో కిరణ్ అబ్బవరం

డాబాగార్డెన్స్ (అల్లిపురం), న్యూస్‌టుడే: పాన్ ఇండియా సినిమాగా 'క'ను రూపొందించినట్లు హీరో అబ్బవరం కిరణ్ అన్నారు. డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో బుధవారం చిత్ర యూనిట్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. హీరో కిరణ్ మాట్లాడుతూ పీరియాడికల్ థ్రిల్లర్‌గా తీసిన ఈ సినిమా ఈనెల 31న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. నయన్ సారిక, తన్వీరామ్ హీరోయిన్లుగా నటించారని చెప్పారు. విశాఖతో తనకు ఎంతో అనుబంధం ఉందని, ఎస్.ఆర్. కల్యాణమండం సినిమా కథను ఇక్కడి ఆర్.కె.బీచ్‌లో రాసినట్లు తెలిపారు. 'క' సినిమాకు ఎందుకు ఆ పేరు పెట్టామనేది చివరలో చెబుతామన్నారు. గోపాలకృష్ణరెడ్డి మంచి అభిరుచి గల నిర్మాత అన్నారు. కర్ణాటకలో, రామోజీ ఫిల్మ్ సిటీలో ఈ సినిమా చిత్రీకరణ చేశామని, ఇందులో జాతర పాట ప్రేక్షులకు మంచి అనుభూతి ఇస్తుందని పేర్కొన్నారు.

## సైబర్ భద్రతపై అవగాహన

సింధియా, న్యూస్‌టుడే : తూర్పు నౌకాదళం పరిధి అన్ని నేవల్ యూనిట్లలో సైబర్ భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు బుధవారం నేవీ వర్గాలు తెలిపాయి. 'జాతీయ సైబర్ భద్రత అవగాహన మాసం-2024' నేపథ్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నాయి. సైబర్ రెడ్ ఫోర్స్, సేఫ్ గార్డింగ్, డిజిటల్ సీస్ వంటి అంశాలపై నిపుణులు సూచనలు చేస్తున్నారని స్పష్టం చేశాయి. సైబర్ పీస్ ఫౌండేషన్ సహకారం అందిస్తున్నట్టు వెల్లడించాయి.

# మార్పు.. మంచివైపే

ఏయూలో సత్ఫలితాలిస్తున్న ముఖ హాజరు
అన్ని అంశాల్లోనూ సంస్కరణలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే

'పెద్ద సార్లు పాఠాలు చెప్పరు.. విద్యార్థులు తరగతులకు రారు.. వసతి గృహాల్లో బయటివారు తిష్ఠవేస్తుంటారు.' గతంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పరిస్థితి ఇలాగే ఉండేది. అయితే వీసీగా ఆచార్య జి.శశిభూషణరావు బాధ్యతలు చేపట్టాక అకడమిక్‌లో మంచి మార్పులు తీసుకువచ్చారు. ప్రతీ ఆచార్యుడు తప్పని సరిగా తరగతులకు వెళ్లాల్సిందే. పెద్ద సార్లు పాఠాలు బోధించాల్సిందే. విద్యార్థులు తరగతులకు రావాల్సిందే. దీంతోపాటు పలు సంస్కరణ అమలుతో విశ్వవిద్యాలయానికి మంచి పూర్వవైభవానికి కృషిచేస్తున్నారు.

### ఆలస్యమైతే ఆబ్సెంటే...

ముఖ హాజరు (ఫేషియల్ అటెండెన్స్) ఏర్పాటు చేశాక స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. తొలుత ఇంజినీరింగ్ కళాశాలలోని వివిధ విభాగాల ఏర్పాటు చేశాక మంచి ఫలితాలు రావడంతో అన్ని విభాగాల్లోనూ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వారికి కేటాయించిన సమయానికి మించి ఎవరు వచ్చినా వారికి ఆరోజు ఆబ్సెంట్ మార్కు పడుతుంది. దీంతో ఆచార్యులు, ఉద్యోగులతో పాటు, విద్యార్థులు సకాలంలో వస్తున్నారు.


ముఖ హాజరు యంత్రం..

### ఆకస్మిక తనిఖీలు...

ఏయూలో అన్ని విభాగాలు తనిఖీలు చేయడానికి ఐదు కమిటీలను నియమించారు. ఒక్కొక్క కమిటీలో ఐదుగురు సభ్యులు ఉంటున్నారు. వీరు కూడా విభాగాలు తెరుచుకోవాల్సిన సమయంలో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. తరగతి గదుల్లో వేసే అటెండెన్స్‌తో పాటు ముఖ అటెండెన్స్‌ను బేరీజు వేసుకొంటున్నారు.

### సీసీ కెమెరాలు వచ్చాక...

గతంలో విద్యార్థులు తమకు నచ్చిన తరగతులకు వచ్చి మిగిలిన సమయం వ్యక్తిగత అవసరాలు చూసుకునే వారు. కొందరు ఆచార్యులు కూడా తమ ఛాంబర్లలో కూర్చొని పరిశోధక విద్యార్థులతో పాఠ్యాంశాల బోధన చేయించే వారు. ఇప్పుడు కొన్ని విభాగాల్లో సీసీ కెమేరాలు కూడా వినియోగించడంతో సీనియర్ ఆచార్యులు సైతం తరగతులకు వెళుతున్నారు. పాఠాలు బోధిస్తున్నారు. విద్యార్థులు తరగతి గదిలో ఉంటున్నారు.

### ఇంకొన్ని సంస్కరణలు..

★ విద్యార్థులు తరగతులకు హాజరైనప్పుడు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు తీసుకు రావాల్సిందే. అదే విధంగా చొక్కాలు వేసుకొని రావాలి. టీ షర్టులతో వస్తే అనుమతించడం లేదు. ఎవరైనా తొలిసారి వస్తే హెచ్చరించి విడిచి పెడుతున్నారు. రెండు లేదా మూడోసారి వస్తే మాత్రం ఆబ్సెంట్ వేస్తున్నారు.


ముఖ హాజరుకు వచ్చిన విద్యార్థినులు

★ ఆల్కహాల్, డ్రగ్స్, ర్యాగింగ్, పొగాకు ఉత్పత్తులు నిషేధించారు. వీటిని వినియోగించే విద్యార్థులపై చర్యలు తీసుకోవడానికి ఉపక్రమించారు. ప్రతి వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీలు చేపడుతుండడంతో నాన్ బోర్డర్లు పలాయనం చిత్తగిస్తున్నారు.

### మార్పు తీసుకువచ్చాం...



ఫేస్ అటెండెన్స్ డివైజ్‌లు ఏర్పాటు చేసిన తర్వాత ఏయూలో అన్ని విభాగాల్లో మార్పు వచ్చింది. పెద్దసార్లు పాఠాలు బోధించరు అన్న అపవాదు తప్పింది. విద్యార్థులు, పరిశోధకులు సమయానికి తరగతులకు, ల్యాబ్‌లకు హాజరవుతున్నారు. త్వరలో ఆల్కహాల్, డ్రగ్స్, ర్యాగింగ్, టొబాకో ఉత్పత్తుల వల్ల కలిగే దుష్పరిణామాలు వివరిస్తూ బోర్డులు ఏర్పాటు చేస్తాం.
– ఆచార్య ఎస్.కిశోర్‌బాబు, రెక్టార్, ఆంధ్రవిశ్వవిద్యాలయం

## 'గంగాభవాని ప్యానెల్'దే విజయం

### ప్రశాంతంగా నర్సుల సంఘం ఎన్నిక

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం (ఏపీజీఎన్ఎ) ఉమ్మడి విశాఖ జిల్లా కమిటీ ఎన్నిక బుధవారం ప్రశాంతంగా ముగిసింది. కేజీహెచ్ ఆవరణలోని నర్సుల క్లోక్‌రూమ్‌లో ఉదయం 8గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్నిక అధికారి, సహకారశాఖ సహాయ రిజిస్ట్రార్ బి.శ్రీనివాస్ ప్రక్రియకు పరిశీలించారు. ఉషారాణి, గంగాభవాని ప్యానళ్లకు చెందిన అభ్యర్థులు కేజీహెచ్ వద్ద భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి ఓటర్లను ఆకట్టుకొనే ప్రయత్నం చేశారు. చివరి నిమిషం వరకు ముమ్మరంగా ప్రచారం చేశారు. అధ్యక్ష పదవితో పాటు ఉపాధ్యక్ష, కోశాధికారి, అయిదు కార్యవర్గ సభ్యుల పదవులకు ఇద్దరేసి చొప్పున 16 మంది, కార్యదర్శి పదవికి ముగ్గురు చొప్పున మొత్తం 19 మంది ఎన్నికల బరిలో నిలిచారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ఆసుపత్రుల్లో శాశ్వత ప్రాతిపదికన పనిచేస్తున్న నర్సులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.


ఓటు హక్కు వినియోగించుకుంటున్న నర్సులు

★ మొత్తం 555 మంది ఓటర్లు ఉండగా, మొదటి రెండు గంటల వ్యవధిలో 50 మంది ఓటేశారు. మధ్యాహ్నం 12గంటల సమయానికి 257 మంది, పోలింగ్ ముగిసే సమయానికి 94శాతం అంటే 521 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం 5.30గంటల సమయంలో పోలైన ఓట్లను లెక్కించే ప్రక్రియను ప్రారంభించారు.


విజేతలు వీరే

★ ఉత్కంఠ భరితంగా జరిగిన ఎన్నికలో గంగాభవాని ప్యానెల్ విజయం సాధించింది. ఓట్ల లెక్కింపు అనంతరం విజేతల పేర్లను ఎన్నికల అధికారి శ్రీనివాస్ ప్రకటించారు. అధ్యక్షురాలిగా టి.గంగాభవాని, ఉపాధ్యక్షురాలిగా ఎం.ఇందిర, కార్యదర్శిగా జి.వి.ఎస్.వరలక్ష్మి, కోశాధికారిగా ముద్దరాజు వంశీ, కార్యవర్గ సభ్యులుగా ఎస్.మెహర్ శాంతి, వియ్యపు వినీల, దాసరి లిల్లీగ్రేస్, ఎస్.గంగాగౌరి, పి.పద్మజ ఎన్నికయ్యారు.

## కూర్మన్నపాలెంలో స్థల వివాదం

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : కూర్మన్నపాలెంలో ఓ స్థలానికి సంబంధించి బుధవారం ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తడంతో దువ్వాడ పోలీసులు రంగంలోకి దిగి శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఆ వివరాలు.. స్థానిక సర్వే నంబరు 60/3లోని 2.27 ఎకరాల జిరాయితీ స్థలం తమకే చెందుతుందని ఆయా వర్గాలు వాదిస్తున్నాయి. ఆ స్థలం చుట్టూ తాము ఏర్పాటు చేసిన రక్షణ కంచెను కె.రాజేంద్రప్రసాద్(చోటు), కె.లక్ష్మి, వై.శారద, వి.కృష్ణతో పాటు మరికొందరు తొలగించి, అక్కడి కాపలాదారులను భయభ్రాంతులకు గురి చేశారని కె.అశోక్‌బాబు ఆగస్టు 4న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ అంశాన్ని పోలీసులు ప్రి లిటిగేషన్ కౌన్సిలింగ్ ఫోరమ్‌కు (పీఎల్‌సీఎఫ్) నివేదించారు. కేసు విచారణలో ఉండగా మళ్లీ బుధవారం రాజేంద్రప్రసాద్ మరో 20 మంది కలిసి జేసీబీ తీసుకొచ్చి రక్షణ రేకులు తొలగించేందుకు ప్రయత్నించారని అశోక్‌బాబు పేర్కొన్నారు. అయితే ఆ స్థలంలో ప్లాట్లు కొనుగోలు చేశామని, వాటిని స్వాధీనం చేసుకునేందుకు వెళ్తుంటే అశోక్‌బాబు అడ్డుపతున్నారని రాజేంద్రప్రసాద్ వర్గం చెబుతుంది.



వివాదాస్పద స్థలం ఇదే..

## అంతర్జాతీయ పోటీలకు అర్హత



సాగర్‌నగర్, న్యూస్‌టుడే: చైనాలో ఈనెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరగనున్న ప్రపంచకప్ 'డ్రాగన్ బోటు-2024' పోటీల్లో సాంకేతిక అధికారిగా బాధ్యతలు నిర్వర్తించేందుకు కయాకింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు, జలక్రీడల నిపుణుడు **బి.బలరామ్‌నాయుడు** అర్హత సాధించారు. ఈ మేరకు సంబంధిత వివరాల్ని బుధవారం ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రపంచస్థాయి పోటీల్లో భారతదేశం తరపున ఈయన ప్రాతినిధ్యం వహిస్తుండడం ప్రశంసనీయమని సహచర నిపుణులు అభిప్రాయపడ్డారు. జలక్రీడల్లో (వాటర్ స్పోర్ట్స్) విజయం సాధించి భారతదేశం పేరు ప్రఖ్యాతులను మరింత ఇనుమడింపజేసేలా నాయుడు చేస్తున్న కృషిని వారు అభినందించారు.

## జాతీయ టీటీ పోటీలకు అంపైర్‌గా శర్మ



విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్(టీటీ) పోటీలకు అంపైర్‌గా ఎల్ఐసీ ఉద్యోగి **డి.వి.ఎస్.వై. శర్మ** నియమితులయ్యారు. పోటీలు గురువారం నుంచి హరియాణాలో ప్రారంభమవుతాయి. శర్మ ప్రస్తుతం ఏపీ టేబుల్ టెన్నిస్ సంఘం ఉపాధ్యక్షుడిగా, జిల్లా సంఘం కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. అలాగే ఎల్ఐసీ ఆలిండియా క్రీడా ప్రమోషన్ బోర్డులో సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఆయన ఎంపికపై ఎల్ఐసీ అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

## ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

కరాస, న్యూస్‌టుడే : రాష్ట్రీయ ఏక్ పర్వ్, ఏక్ భారత్, శ్రేష్ఠభారత్ కళా ఉత్సవం-2024 వేడుకలు బుధవారం 104 ఏరియా శ్రీవిజయనగర్ కేంద్రీయ విద్యాలయం-2లో ముగిశాయి. హైదరాబాద్ రీజియన్ పరిధి ఆంధ్ర, తెలంగాణకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులు, 70 మంది ఉపాధ్యాయులు హాజరైనట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ అంశాల్లో ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కేవీ ప్రధానాచార్యులు సీహెచ్.శ్రీనివాసులు మాట్లాడుతూ... ఇక్కడి పోటీల్లో ప్రతిభ చూపిన వారు నవంబరు 11న హైదరాబాద్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామచంద్రరావు, ఇందిర, బాలాజీ, రామ్‌భూపాల్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బృందగానం చేస్తున్న కేవీ విద్యార్థులు

## ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు: కలెక్టర్


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఆనందపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూములను పరిరక్షించడం మనందరి కర్తవ్యమని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. బుధవారం ఆనందపురం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో భీమిలి నియోజకవర్గ పరిధిలోని రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆక్రమణలకు గురైన సర్కారు భూములను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖ మహానగరానికి ఉన్న ప్రాముఖ్యత దృష్ట్యా భవిష్యత్తులో పారిశ్రామిక, ఐటీ పరిశ్రమలు రానున్న తరుణంలో క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది రెవెన్యూ దస్త్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీఆర్వో నుంచి కలెక్టరు వరకు అందరూ నిబద్ధతతో పనిచేయాలని, నిజాయతీగా ఉన్నప్పుడే వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. దస్త్రాల తారుమారు తదితర తప్పిదాలు ఎవరు చేసినా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. మ్యుటేషన్ ప్రక్రియ, పట్టాదారు పాసు పుస్తకాల జారీలో జాగ్రత్తలు తీసుకోవాలని, రెవెన్యూ పరమైన విషయాల్లో ఏదైనా తప్పు జరిగినట్లు తెలిస్తే వెంటనే స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, ప్రత్యేక ఉప కలెక్టర్లు, తహసీల్దార్లు, సర్వే అధికారులు పాల్గొన్నారు.

## యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
### స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్ బ్రాంచ్ - 09551

సెక్టార్-5, ఉక్కునగరం, స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530031.
ఫోన్: 0891-2546811/812. ఇ-మెయిల్ : ubin0809551@unionbankofindia.bank

**సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూలు 6(2)/8(6) క్రింద అమ్మకం గురించి (30 రోజుల నోటీసు) తెలియచేస్తూ ఋణగ్రహీతకు నోటీసు**

టు:
(1). శ్రీ పర్వతనేని శ్రీనివాస్ (అభ్యర్థి - ప్రాపర్టీ ఓవర్ డ్రాఫ్ట్), డి.నెం. 9-1-229, సిబిఎమ్ కాంపౌండ్, రామాటాకీస్, విశాఖపట్నం-530003, (2). శ్రీమతి పర్వతనేని శారద (చిరునామా-01) (సహ-అభ్యర్థి -ప్రాపర్టీ ఓవర్ డ్రాఫ్ట్), డి.నెం. 9-1-229, సిబిఎమ్ కాంపౌండ్, రామాటాకీస్, విశాఖపట్నం-530003, (3). శ్రీమతి పర్వతనేని శారద (చిరునామా-02)(సహ అభ్యర్థి - ప్రాపర్టీ ఓవర్ డ్రాఫ్ట్), డి.నెం. 9-42-24, ఎస్‌బిఐ అడ్మిన్ ఆఫీసు రోడ్డు, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం-530003, (4). M/s. శ్రీ శ్రీనివాస ఎగ్జిమ్ ఎంటర్‌ప్రైజెస్ (చిరునామా-01) (ప్రొప్రయిటర్: శ్రీ పర్వతనేని శ్రీనివాస్), ప్లాట్ నెం. 1, కొత్త ఆటోనగర్, కానూరు గ్రామం, విశాఖపట్నం-520007, (5). శ్రీ పర్వతనేని శ్రీనివాస్ (ప్రొప్రయిటర్: M/s. శ్రీ శ్రీనివాస ఎగ్జిమ్ ఎంటర్‌ప్రైజెస్, డి.నెం. 9-1-229, సిబిఎమ్ కాంపౌండ్, రామాటాకీస్, విశాఖపట్నం-530003.

డియర్ సార్/మేడమ్,

**విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెల్లించవలసిన బకాయి వసూలు కొరకు M/s. శ్రీ శ్రీనివాస ఎగ్జిమ్ ఎంటర్‌ప్రైజెస్ ప్రొప్రయిటర్: శ్రీ పర్వతనేని శ్రీనివాస్‌కు చెందిన ఆస్తులు అమ్మకం.**

బ్యాంకు వారికి చెల్లించవలసిన బకాయి మొత్తములను నోటీసులో తెలిపిన నిర్ణీతకాలంలోగా చెల్లించవలసినదిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క 13(2) సెక్షన్ క్రింద **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్ బ్రాంచ్,** విశాఖపట్నం సెక్యూర్డ్ క్రెడిటార్ వారు మీకు డిమాండ్ నోటీసు తేది **17.02.2024**న జారీచేసినారు. అయినప్పటికీ మీరు సదరు నోటీసులో సూచించిన నిర్ణీత కాలంలోగా బకాయి మొత్తము చెల్లించుటలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు-2002 యొక్క 8వ రూలుతో కూడిన సదరు చట్టం 13(4) సెక్షన్ క్రింద స్థిర సెక్యూర్డ్ ఆస్తులను అధీకృత అధికారి గారు ఆస్తిని తేది **28.05.2024** న స్వాధీన పరుచుకున్నారు.

సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీన పరుచుకున్న తరువాత కూడా మీరు బ్యాంకు యొక్క బకాయి మొత్తము చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు స్వీకరణ తేదీ నుండి 30 రోజులు తరువాత బహిరంగ ఇ-వేలం నిర్వహించుట ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో దిగువ తెలిపిన ఆస్తులను విక్రయించవలసిన అవసరం ఉంటుంది. ఇ-వేలం తేదీ మరియు సమయంతో పాటు ఆస్తి యొక్క రిజర్వుధర మరియు ఇ-వేలం నిర్వహించు సర్వీస్ ప్రొవైడర్ వివరములు మీకు విడిగా తెలియజేయబడతాయి. కాబట్టి, అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా మీరు బ్యాంకు వారికి చెల్లించవలసిన బకాయి మొత్తముతో పాటు దానిపై తదుపరి వడ్డీ, బ్యాంకు వారికి సంభవించిన ఖర్చులు, ఛార్జీలు మరియు వ్యయాలు చెల్లించినచో, ఆస్తి అమ్మకంపైన తదుపరి చర్యలు చేపట్టబడవు మరియు సదరు చట్టం 13(8) సెక్షన్ పరిధిలో మీ తనఖా ఆస్తులను మీరు విడిపించుకోవచ్చును.

**షెడ్యూలు ఆస్తి వివరములు**

**తనఖా పెట్టిన ఆస్తి: (పెదగంట్యాడ ఎస్ఆర్ఒ, డాక్యుమెంట్ నెం. 535/2009 ప్రకారం M/s. శ్రీ శ్రీనివాస ఎగ్జిమ్ ఎంటర్‌ప్రైజెస్ ప్రొప్రయిటర్: శ్రీ పర్వతనేని శ్రీనివాస్ పేరున గల ఆస్తి).** విశాఖపట్నం, గాజువాక మండలం, వడ్లపూడి గ్రామంలో సర్వే నెం. 60 భాగం మరియు పకీర్‌తాకియా గ్రామంలో సర్వే నెం. 34 భాగం, సమీప డి.నెం.31-47-94, ఇండస్ట్రియల్ పార్కు, బ్లాక్-ఇ నందు మొత్తం 4143.79 చ॥మీ॥ లేదా 4955.97 చ॥గ॥ విస్తీర్ణం గల **ప్లాట్ నెం. 2-B. స్థలానికి హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం.3-A, **దక్షిణం:** ప్రైవేట్ భూమి, **పడమర:** ప్లాట్ నెం.2-A, **ఉత్తరం:** 18 మీ. వెడల్పు రోడ్డు.

**తేది: 07.10.2024, స్థలం: విశాఖపట్నం** — **సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**




శ్రీకాకుళం రోడ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

## తుపాను హెచ్చరికలతో వాల్తేరు రైల్వే అప్రమత్తం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: దానా తుపాను హెచ్చరికలను దృష్టిలో ఉంచుకొని వాల్తేర్ డివిజన్‌లో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. రైల్వే వంతెనలు, పట్టాలు, సిగ్నలింగ్, టెలికమ్యూనికేషన్ వ్యవస్థలపై నిరంతరం నిఘా ఉంచామన్నారు. అదనపు కంట్రోల్ రూమ్‌లు, విపత్తు నిర్వహణ విభాగాన్ని అందుబాటులో ఉంచామన్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి వైద్య సిబ్బందితో కూడిన అంబులెన్స్‌లు, సివిల్ డిఫెన్స్ సిబ్బంది స్కౌట్, గైడ్స్ క్యాడెట్లను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. శ్రీకాకుళం రోడ్ స్టేషన్‌తో పాటు పలు చోట్ల తీసుకున్న ముందస్తు చర్యలను బుధవారం డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, ఇతర సీనియర్ అధికారుల బృందం పరిశీలించింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

**హెల్ప్‌లైన్ నెంబర్లు:** ★ విశాఖ: 0891-2746330, 2744619, 87126 41255, 77807 87054 ★ విజయనగరం: 08922-221202, 87126 41260 ★ శ్రీకాకుళం రోడ్: 08942-286213, 286245

### చికెన్ ధరలు
(కిలోకి - రూ.లలో)

| | వెన్‌కాబ్ | బ్యాగ్ |
|---|---|---|
| ఫారం గేటు | 115 | 110 |
| లైవ్ | 137 | 130 |
| డ్రెస్డ్ | 199 | 230 |
| స్కిన్‌లెస్ | 226 | 240 |

## PUBLIC CAUTION NOTICE

General public are hereby informed that one of my client's intends to purchase the below mentioned schedule property from M/s Pace Sea Foods Private Limited, represented by its Managing Director, who acquired the same under two registered sale deeds i) dated 20.04.1998, registered as document No.876/1998, ii) dated 20.04.1998, registered as document No.877/1998, both are registered in the office of the Sub-Registrar, Bheemunipatnam, from M/s Deejay Aquaculture and Fisheries Private Limited, represented by its Managing Director Mr. David Jonathan Lobo, S/o. F.X.Lobo.

Anyone having any right, title, interest or any objections with regard to the above sale transaction may notify the same to the address given below in writing with relevant documentary proof, within **THREE** days from the date of this publication, failing which it would be construed that the property is free from all claims and encumbrances and my client will proceed with the sale transaction and subsequent objections are not binding on my client.

**SCHEDULE**

ITEM NO.1 (COVERED BY DOCUMENT NO.877/1998)
All that vacant site measuring an extent of 4743.2 sq.yards or 3965.931 sq.mts or Ac.0.98 cents covered by Survey Number 349/12 part, 349/5 & 6, 349/7 situated in Thimmapuram village, Hamlet of Kapulauppada village, Bheemunipatnam Mandal, Bheemunipatnam Sub-District, Visakhapatnam district and the property bounded as follows:

(i) Property covered by S.No.349/12 part measuring Ac.0.35 cents or 1694 sq.yards or 1416.404 sq.mts vacant site and bounded by:
EAST: Bay of Bengal, SOUTH: Dry Land of Buddala Appanna, Buddala Appala Swamy, etc., in S.No.349/13, WEST: Beach Road leading to Bheemunipatnam to Visakhapatnam, NORTH: Land belongs to Buddala Guraiah, Polanna, Appanna, Etc., in S.No. 349/8

(ii) Property covered by S.No.349/5 & 6 measuring Ac.0.27 cents or 1306.8 sq.yards or 1092.654 sq.mts vacant site and bounded by:
EAST : Bay of Bengal, SOUTH: Land of Buddala Gurraiah, Polanna, etc., in S.No 349/7&8 WEST: Beach Road leading to Bheemunipatnam to Visakhapatnam NORTH:Land sold by Buddala Appalanaidu and others & Royal Hatchery

(iii) Property covered by S.No.349/7 measuring Ac.0.36 cents or 1742.4 sq.yards or 1456.87 sq.mts vacant site and bounded by:
EAST: Bay of Bengal, SOUTH: Land of Buddala Gurraiah, Polanna, etc., in S.No 349/7, WEST: Land belongs to Buddala Appalanaidu and Buddala Appaiah in S.No.349/5 & 6, NORTH: Land belongs to Buddala Appalanaidu and Buddala Appaiah in S.No.349/5 & 6

ITEM NO.2 (COVERED BY DOCUMENT NO.876/1998)
(i) Property covered by S.No.349/8 & 13 part measuring 1790.8 sq.yards or 1497.341 sq.mts vacant site and bounded by:
EAST: Bay of Bengal SOUTH: Land of Buddala Gaddivadu in S.No.349/7, WEST: Beach Road leading to Bheemunipatnam to Visakhapatnam, NORTH: Land belongs to Buddala Gurraiah, China Appadu, etc, in S.No.349/7 dry land

ii) Property covered by S.No.349/13 part measuring Ac.0.31 cents or 1500.4 sq.yards or 1254.529 sq.mts vacant site and bounded by:
EAST : Bay of Bengal SOUTH: Dry land sold by Buddala Appala Swamy & others previously to others WEST : Beach Road leading to Bheemunipatnam to Visakhapatnam, NORTH: Land belongs to Buddala Gaddivadu @ Appanna in S.No.349/12

**SOMANCHI JAGANNADHAM, Advocate.**
D.No. 48-8-5/2, Flat No.202, First Floor, Surya Mahal, Dwarakanagar, Visakhapatnam-530016, **Phone: 92466 58575, 94404 58575**

# పెందుర్తి

**తెరపై ఈనాడు**
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్
స్క్రీన్-1 - దేవర
స్క్రీన్-2 - విశ్వం

## మర్యాదపూర్వక కలయిక

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండల తహసీల్దారుగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బి.చిన్నికృష్ణను బుధవారం మండల తెదేపా నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. అనకాపల్లి పార్లమెంటు తెలుగు యువత అధ్యక్షుడు పీవీజీకుమార్ రాజు, మండల తెదేపా కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ గండి దేముదు తదితరులు తహసీల్దారుకు పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. మండలంలో అపరిష్కృత సమస్యలు చాలా ఉన్నాయని వాటిని పరిష్కరించాలని కోరారు.

## బ్రాహ్మణుల నియామకంపై హర్షం

పెందుర్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దేవాలయాల పాలక వర్గాల్లో బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన ఇద్దరిని సభ్యులుగా అవకాశం కల్పించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించడంపై ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు వడ్డాది ఉదయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బ్రాహ్మణులకు ప్రభుత్వం పెద్దపీట వేయడం శుభ సూచకమన్నారు. సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM

పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

– న్యూస్‌టుడే, పెందుర్తి

సమస్య: జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్ ఏ-జోన్‌లోని 15డి/1/3, సీ-2 జోన్‌లోని 18ఎ/1 స్తంభాలకు ఉన్న వీధి దీపాలు గత కొన్నాళ్లుగా వెలగడం లేదు. రాత్రివేళ చీకట్లో స్థానికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.
– పి.వి.శర్మ, ఏ-జోన్, ఎ.అమ్మతల్లి సీ-2 జోన్

సమాధానం: మీ ప్రాంతాల్లో వెలగని వీధి దీపాలకు త్వరలోనే మరమ్మతు చేయించి వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – శివరామ్ ప్రసాద్, ఏఈ, 97వ వార్డు

# వృత్తి శిక్షణ.. భవిష్యత్తుకు రక్షణ

**పాఠశాల స్థాయి నుంచి కొనసాగుతున్న ఇంటర్న్‌షిప్**

వేపగుంట, న్యూస్‌టుడే: పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు స్వశక్తిపై నిలబడేలా జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రభుత్వ బడుల్లో సరికొత్త చదువులను నేర్పిస్తున్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు వృత్తి విద్యను నేర్పిస్తే భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడే అవకాశం ఉంది. 2017లో తెదేపా ప్రభుత్వ హయాంలో దీన్ని ప్రవేశపెట్టినప్పటికీ గత వైకాపా ప్రభుత్వం దీనిపై పెద్దగా దృష్టి సారించకపోవడంతో తూతూమంత్రంగానే పాఠశాలల్లో వృత్తి విద్య కోర్సులు కొనసాగించారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ కల్పించాలని ప్రణాళికలు రచించింది. ఇంటర్న్‌షిప్ పేరుతో పలు రంగాల్లో సంబంధిత కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు.

**ఏదో ఒక అంశంలో నైపుణ్యం పొందాలనే..**

2017లో అప్పటి తెదేపా ప్రభుత్వం ప్రయోగాత్మకంగా రాష్ట్ర వ్యాప్తంగా 50 పాఠశాలల్లో ఈ శిక్షణను ప్రారంభించింది. ప్రతి విద్యార్థి ఏదో ఒక అంశంలో నైపుణ్యం పొంది ఉండాలన్న సంకల్పంతో అడుగులు ముందుకు వేస్తుంది. దీనిలో భాగంగా పాఠశాలలో వృత్తి విద్యను అందిస్తూ 12 రోజుల పాటు ఇంటర్న్‌షిప్ అందించేలా ఏర్పాట్లు చేసింది. దీంతో విద్యార్థులు మరింత ఉత్సాహంగా వృత్తి విద్యను నేర్చుకునేందుకు ముందుకొస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఏడాది నుంచి ఈ కోర్సులను రాష్ట్రవ్యాప్తంగా మరికొన్ని పాఠశాలల్లో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంది. ప్రస్తుతం విశాఖ జిల్లాలోని 19 పాఠశాలల్లో ఇంటర్న్‌షిప్ పేరుతో పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు.



విద్యార్థుల శిక్షణను పరిశీలిస్తున్న సమన్వయకర్త కాలేషావలి

**9, 10, 11, 12 తరగతుల విద్యార్థులకు..**

వృత్తివిద్యను బోధించడం కోసం కేటాయించిన పాఠశాలల్లో రెండు ప్రయోగశాలలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాల స్థాయిలో 9, 10, కళాశాల స్థాయిలో 11, 12 తరగతుల విద్యార్థులకు ప్రస్తుతం వృత్తి విద్య శిక్షణను అందిస్తున్నారు. వీరికి ఒకరోజు వార్షిక పరీక్ష నిర్వహిస్తారు. 70 మార్కులకు ప్రాక్టికల్స్, 30 మార్కులు థియరీ ఉంటుంది. ఇందులో ఉత్తీర్ణులైన వారికి ధ్రువపత్రం అందించనున్నారు. వాటితో కంపెనీల్లో ఉపాధి పొందడానికి ఆస్కారం ఉంటుంది.

**చాలా ప్రయోజనకరం..**

పాఠశాల స్థాయి నుంచే వృత్తి శిక్షణ ఇవ్వడం విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరం. ఇక్కడ పొందిన శిక్షణతో చిన్నచిన్న వర్క్‌షాపుల్లో ఉపాధి పొంది జీవితాన్ని బంగారుమయంగా మార్చుకునే అవకాశం ఉంది. దీనిపై తామూ విద్యార్థులకు పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తున్నాం. నిత్యం ఈ శిక్షణపై పర్యవేక్షణ చేస్తూ శిక్షకులకు తగు సూచనలు చేస్తున్నాం.
– కె.కాలేషావలి, వృత్తి విద్య శిక్షణ జిల్లా సమన్వయకర్త

**ఇప్పటివరకు ఐదు బ్యాచ్‌లకు..**



చింతలగ్రహారం పాఠశాల నుంచి ఇప్పటికి ఐదు బ్యాచ్‌లను ఇంటర్న్‌షిప్‌నకు పంపించి శిక్షణ అందించాం. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా 12 రోజులు శిక్షణను పొందారు. వారికి తెలియని విషయాలను ప్రాథమిక అంశాలను వర్క్‌షాపులో నేర్చుకున్నారు. మా పాఠశాలలో ఎలక్ట్రానిక్స్, ఫుడ్‌ప్రాసెసింగ్ కోర్సులలో శిక్షణ అందిస్తున్నాం.
– బురడ ప్రశాంతి, వృత్తివిద్య శిక్షకురాలు, చింతలగ్రహారం జెడ్పీ పాఠశాల

## దిష్టిబొమ్మల్లా కంపోస్టు తయారీ బిన్లు

**దర్పణం**




చెత్తతో ఎరువును తయారు చేసి వాటితో మొక్కలు పెంచడమే లక్ష్యంగా జీవీఎంసీ ప్రారంభించిన డ్రమ్ కంపోస్టు ప్రాజెక్టు మూలకు చేరింది. ప్రతీ కాలనీలో ఒకటి, రెండు డ్రమ్ కంపోస్టు బిన్లను ఏర్పాటు చేసి కాలనీవాసులు తడిచెత్తను అందులో వేసి బాగా కుళ్లిన తరువాత ఎరువుగా తయారు చేయడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. వీటిని ప్రజలు సక్రమంగా వినియోగించకపోవడంతో ఎక్కడికక్కడ దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. స్వచ్ఛ సర్వేక్షణ్ బృందాలు వచ్చినపుడు ప్రజారోగ్య విభాగం అధికారులు ఈ డ్రమ్ములను శుభ్రం చేసి ఎరువును తయారు చేస్తున్నట్టు చూపించడం, వారు వెళ్లిన తర్వాత ఆ ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్టు తయారవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మొక్కలు పెంచేవారితో సమన్వయం చేసుకుని ఈ డ్రమ్ కంపోస్టు బిన్లను వినియోగించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, వేపగుంట

## కమనీయం.. నరహరి నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య కల్యాణోత్సవం బుధవారం సింహగిరిపై కమనీయంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

**అ వీ ఇ వీ**

### నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం



పెందుర్తి, న్యూస్‌టుడే: పులగవానిపాలెం 33/11కేవీ ఉప కేంద్రం పరిధిలోని 11 కేవీ దుర్గానగర్ ఫీడర్‌పై నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, సూర్యానగర్, మర్రిచెట్ల కాలనీ, నల్ల క్వారీ, సాయిదివ్య లేఅవుట్, వికలాంగుల కాలనీ, కుమ్మరి కాలనీ, తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని తెలియజేశారు.

**పరవాడ మండలంలో..**

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలంలోని పలు గ్రామాలకు గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశపాత్రునిపాలెం, ఎస్సీకాలనీ, శేషాద్రినగర్, స్నేహపురికాలనీ, పి.భోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ తదితర ప్రాంతాలకు సరఫరా ఉండదని వెల్లడించారు.

### విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు

పెందుర్తి, న్యూస్‌టుడే: స్థానిక శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులకు బుధవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపల్ తారకేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో క్లోవ్ దంత వైద్యశాల వైద్యురాలు డాక్టర్ ఆరతి సుబ్రహ్మణ్యం, డాక్టర్ కృష్ణచైతన్య పాల్గొని విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. దంత సంరక్షణపై అవగాహన కల్పించారు.

### జోన్-8 ఈఈగా చిరంజీవులు



వేపగుంట, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-8 ఇంజినీరింగ్ విభాగం ఈఈగా ఎస్.చిరంజీవులు బుధవారం విధుల్లో చేరారు. ఇటీవల నిర్వహించిన బదిలీల్లో భాగంగా జోన్-7 నుంచి ఈయన ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఈఈ రత్నాకర్‌రెడ్డి యూజీడీ ప్రాజెక్టు విభాగానికి బదిలీ అయ్యారు.

## ఖాతాదారుల అభివృద్ధే లక్ష్యంగా సేవలు

సబ్బవరం, న్యూస్‌టుడే: ఖాతాదారుల అభివృద్ధే లక్ష్యంగా తమ బ్యాంక్ పని చేస్తోందని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సీబీఐ) జనరల్ మేనేజర్ ఎస్. నాయక్ అన్నారు. సబ్బవరంలో బ్యాంక్ నూతన శాఖను బుధవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్. నాయక్ మాట్లాడుతూ సెంట్రల్ బ్యాంక్ ప్రారంభించి 114 ఏళ్లు కావస్తోందన్నారు. రూ.6 వేల కోట్ల టర్నోవర్‌తో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా 4500 శాఖలు, అనుబంధంగా 20,500 టచ్ పాయింట్లు ఉన్నాయన్నారు. ఖాతాదారులకు అన్ని రకాల సేవలు అందించడంతో పాటు వివిధ రకాల రుణాలు కూడా ఇస్తున్నామన్నారు. రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసిన నాణేలను కొంతమంది తిరస్కరించడం జరుగుతోందని, తప్పుడు మాధ్యమాల్లో వచ్చే ఇలాంటి ప్రకటనలు నమ్మవద్దని సూచించారు. రూ.5, రూ.10 నాణేలను ఎవరూ తిరస్కరించవద్దని కోరారు. ఈ సందర్భంగా ఖాతాదారులు తమ ఖాతాల నుంచి ఉపసంహరించిన మొత్తానికి రూ.10 నాణేలను అందించారు. రీజనల్ మేనేజర్లు మూర్తి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న సీబీఐ జనరల్ మేనేజర్ ఎస్.నాయక్

## అధునాతన పద్ధతులతో అధిక దిగుబడి

దేవాడ(పరవాడ), న్యూస్‌టుడే: రైతులంతా అధునాతన పద్ధతుల్లో వ్యవసాయం చేసి పెట్టుబడులు తగ్గించుకుని మంచి దిగుబడి సాధించాలని విశాఖ అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ సూపర్‌వైజర్ ఎం.ధనలక్ష్మి, పెదగంట్యాడ ఏవో శశికళ పేర్కొన్నారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధి దేవాడలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులు పండిస్తున్న వరి సాగును పరిశీలించారు. పంట పొట్టదశలో ఉందని సరైన సస్య రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం రైతులు పలు సమస్యలను అధికారులకు వివరించారు. రాయితీపై విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, రైతు భరోసా సొమ్ము ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. అన్ని పథకాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వార్డు తెదేపా అధ్యక్షుడు పాల అచ్చిల నాయుడు, దేవాడ పశువైద్యాధికారి రాజేశ్, నాయకులు పాల నగేశ్, చుక్క వెంకన్న, కాకి నారాయణ, రేలంగి అప్పారావు, అత్తిలి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



దేవాడలో వరి పంటను పరిశీస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు

## జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో వ్యర్థాల తొలగింపు



కాలనీలోని రహదారిపై చెత్తను తొలగించి శుభ్రం చేసిన దృశ్యం

**ఈనాడు కథనానికి స్పందన**

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం గొర్లెవానిపాలెం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో పేరుకుపోయిన వ్యర్థాలను ఎట్టకేలకు బుధవారం తొలగించారు. గత కొద్దిరోజులుగా కాలనీలోని రహదారుల వెంబడి పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయి పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. విష పురుగుల సంచారం పెరిగింది. ఇటీవల కురిసిన వర్షాలకు వ్యర్థాలు కుళ్లి తీవ్ర దుర్వాసన రావడంతో పాటు దోమల బెడదతో కాలనీవాసులు ఇక్కట్లు పడేవారు. ఇక్కడి సమస్యపై 'క్షీణించిన పారిశుధ్యం' శీర్షికతో ఈ నెల 15న 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి ఈవో పీఆర్డీ ధర్మారావు, పంచాయతీ అధికారులు స్పందించారు. పేరుకుపోయిన చెత్తను యంత్రాలతో తొలగించి డంపింగ్ యార్డుకు తరలించారు. రహదారులను శుభ్రం చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రైళ్లు లేక.. దిక్కుతోచక..!

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: దానా తుపాను కారణంగా హావ్‌డా, షాలిమార్, భువనేశ్వర్ వైపు వెళ్లే రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. దీంతో పాటు పలు రైళ్ల రాకపోకల్లో తీవ్ర అంతరాయం ఏర్పడి ఆలస్యంగా నడుస్తున్నాయి. బుధవారం నుంచి రైళ్లు రద్దయినప్పటికీ అంతకు ముందు బయలుదేరినవి ఒక్కొక్కటిగా విశాఖ చేరుకుంటున్నాయి. అయితే కనెక్టింగ్ రైళ్లు లేకపోవడంతో పెద్దఎత్తున ప్రయాణికులు రైలు నిలయంలో పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గమ్యస్థానానికి చేరే దారి తెలియక ఆందోళన చెంతున్నారు. నిరీక్షిస్తున్న వారితో స్టేషన్ పరిసరాలు రద్దీగా మారాయి. మరో పక్క అరకొరగా నడుస్తున్న రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి.



రైళ్ల రద్దుతో స్టేషన్‌లో పడిగాపులు

## మద్యం మత్తులో పోలీసులపై దౌర్జన్యం

గాజువాక, న్యూస్‌టుడే : అతిగా మద్యం తాగిన వ్యక్తి... పోలీసులపై దౌర్జన్యం చేసి, చేతి వేలు కొరికేసిన ఘటన బుధవారం రాత్రి విశాఖపట్నం గాజువాకలో చోటు చేసుకుంది. ఆ వివరాలు.. గాజువాక రాజీవ్‌మార్గ్ కూడలి వద్ద పోలీసులు డ్రంకన్ డ్రైవ్ కేసులు రాస్తున్నారు. హోమ్‌గార్డు ప్రసాద్, మొబైల్ కానిస్టేబుల్ రాజశేఖర్ ఆల్కామీటర్లతో తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో అతిగా మద్యం తాగి బైక్‌పై వస్తున్న అమర్‌నగర్‌కు చెందిన ఆర్.శ్రీను(30)ను ఆపి తనిఖీ చేసేందుకు ప్రయత్నించారు. తననే అడ్డుకుంటారా..? అంటూ శ్రీను గొడవ చేశాడు. అంతటితో ఆగకుండా కానిస్టేబుల్ రాజశేఖర్ చేతి వేలిని కొరికేశాడు. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని నిందితుడిని గాజువాక పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.



ట్రాఫిక్ సిబ్బందితో వాదిస్తున్న శ్రీను



కానిస్టేబుల్ వేలిపై గాయం

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ఉపాధ్యాయులతో అర్హత సాధించిన విద్యార్థినులు

వేపగుంట, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు వేపగుంట జెడ్పీ పాఠశాల విద్యార్థినులు నలుగురు ఎంపికయ్యారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఈనెల 21న నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన 10వ తరగతి బాలికలు లావణ్య, గంగోత్రి, 9, 8వ తరగతుల విద్యార్థినులు ధరణి, గౌరి పాల్గొని ప్రతిభ చూపారు. దీంతో ఈనెల 27, 28, 29 తేదీల్లో కడపలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరిని ఎంపిక చేసినట్లు ప్రధాన, వ్యాయామ ఉపాధ్యాయులు మహేశ్వరరావు, వెంకటరావు, యామిని తెలిపారు. ఎంపికైన బాలికలను బుధవారం పాఠశాలలో అభినందించారు.

## పడకేసిన దీపాలు.. పట్టించుకోని అధికారులు

దేశపాత్రునిపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: వందలాది భారీ వాహనాలతో నిత్యం రద్దీగా ఉండే రహదారిలోని హైమాస్టు వీధి దీపాలు రాత్రుళ్లు వెలగక చీకటి కమ్మేయడంతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి విష పురుగులు, కుక్కల బెడద ఎక్కువగా ఉండటంతో పాటు తరచూ ప్రమాదాలబారిన పడుతున్నామని భయాందోళన చెందుతున్నారు. జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెం రైల్వే వంతెన కూడలి, బైక్ మెకానిక్ షెడ్ ప్రాంతాల్లో హైమాస్టు దీపాలు పడకేశాయి. చాలారోజుల నుంచి వెలగకపోయినా పట్టించుకునే వారే కరవయ్యారని స్థానికులు వాపోతున్నారు. రాత్రయితే అంధకారం రాజ్యమేలుతోందని, తరచూ ప్రమాదాల బారిన పడుతున్నామని పాదచారులు, సైకిళ్లపై వెళ్లే వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి దీపాలను బాగుచేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.





దేశపాత్రునిపాలెం రైల్వే వంతెన కూడలిలో, మెకానిక్ షెడ్ వద్ద మరమ్మతులకు గురైన హైమాస్టు దీపాలు

## తప్పుల సవరణకు అవకాశం

సబ్బవరం, న్యూస్‌టుడే: రీసర్వేలో నమోదైన తప్పులను సవరించుకునేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు రైతులకు చక్కని అవకాశమని సబ్బవరం తహసీల్దారు బి.చిన్నికృష్ణ అన్నారు. గొట్టివాడలో బుధవారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారుల చుట్టూ పదేపదే తిరగకుండా గ్రామంలోనే దరఖాస్తులు స్వీకరించి తప్పులను సవరించే కార్యక్రమం జరుగుతుందన్నారు. గొట్టివాడ గ్రామంలో మొత్తం భూమి 663.87 ఎకరాలు ఉండగా దీంట్లో 192.06 ఎకరాలు బంజరు భూమిగా నమోదయ్యిందన్నారు. జిరాయితీ భూమి 471.81 ఎకరాలుగా గుర్తించామన్నారు. భూ ఖాతా నెంబర్లు 603 ఉన్నాయన్నారు. 3285 మందికి ఎల్‌పీఎంలు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్లు ఎల్.అప్పారావు, వీఎల్ మాతాప్రసాద్, మోహన్, రామఅప్పారావు, బి.రాంబాబు, వీఆర్వో కె.వాత్సల్య, సర్పంచి సాలాపు మీన, బొండా సత్యారావు, సాలాపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దారు చిన్నికృష్ణ

## పరవాడలో 131 అర్జీలు



రెవెన్యూ సభలో పాల్గొన్న అధికారులు, నాయకులు, గ్రామస్థులు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సామాజిక భవనం వద్ద బుధవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ సురేశ్‌నాయుడు, రీసర్వే డీటీ సురేశ్, మండల సర్వేయర్ శ్రీనివాస్ పాల్గొని భూ సమస్యలపై రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. పరవాడ రెవెన్యూలోని భూముల హద్దులు, పేర్లు తప్పుగా పడ్డాయని వాటిని సరి చేయడంతో పాటు గెడ్డవాగులు, ప్రభుత్వ భూములు, పంట కాలువలు, కొండల ఆక్రమణలను అడ్డుకోవాలని పలువురు ఫిర్యాదు చేశారు. మొత్తం 131 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పైలా వెంకటపద్మలక్ష్మి, సర్పంచి సిరిపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, మాజీ సర్పంచి చుక్క రాముబాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## సామాన్యుడికి భారంగా నిత్యావసరాల ధరలు

సుజాతనగర్(పెందుర్తి), న్యూస్‌టుడే: రాష్ట్రంలో నిత్యావసరాల ధరలు సామాన్యుడికి భారంగా మారాయని సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలపై బుధవారం సుజాతనగర్ కూడలిలో ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు రాయితీలు కల్పించడంలో మునిగిపోయి సామాన్యులను గాలికొదిలేశారని ఆరోపించారు. తక్షణమే ధరల నియంత్రణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యుడు వై.రాంబాబు, సభ్యులు రాము, దుర్గారావు, రామారావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.



సుజాతనగర్ కూడలిలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

# నరకానికి నకళ్లు..

**అధ్వానంగా గ్రామీణ రహదారులు**



సబ్బవరం - నరవ రహదారిలో ప్రమాదకర గుంతలు

సబ్బవరం, న్యూస్‌టుడే: కొన్నేళ్ల క్రితం నిర్మించిన రహదారులు నిర్వహణ లేక అధ్వానంగా తయారయ్యాయి. గుంత పక్కన గుంత ఏర్పడి నరకానికి నకళ్లుగా మారాయి. సబ్బవరం మండలంలోని గ్రామీణ ప్రాంతాల రోడ్లు శిథిలమై ప్రయాణికులకు పగలే చుక్కలు చూపిస్తున్నాయి. సబ్బవరం - నరవ, సబ్బవరం - అంతకాపల్లి, అమృతపురం రోడ్లలో అడుగడుగునా భారీ గుంతలు ఏర్పడటంతో పరిసర గ్రామాల ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. వంగలి రామాలయం వద్దనున్న గుంతల్లో వర్షపు నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. మరో గత్యంతరం లేక ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నామని పెట్రో, మారిటైం యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బురద కారణంగా తరచూ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. గొట్టివాడ నుంచి వంగలిని కలిపే రోడ్డు మరీ దారుణంగా తయారైంది. వర్షం కురిసినప్పుడల్లా సమీపంలోని సూదికొండ పైనుంచి వచ్చే వరద నేరుగా ఈ రహదారి మీదుగా ప్రవహించడంతో కోతకు గురవుతోంది. అధికారులు వెంటనే స్పందించి రహదారులకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



వంగలిలో రోడ్డుపై నిలిచిన నీరు

## శారదాపీఠం భూముల్లో అక్రమాలు అన్నీ ఇన్నీ కావు

### రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

ఈనాడు డిజిటల్, అమరావతి: శారదాపీఠం భూముల్లో సాగిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఎకరం రూ.20 కోట్ల ధర పలికే భూమిని కేవలం రూ.లక్ష చొప్పున 15 ఎకరాలను అప్పనంగా కట్టబెట్టారని వివరించారు. వెలగపూడిలోని సచివాలయంలో ఆయన బుధవారం మాట్లాడారు. 'సాంస్కృతిక కళాశాల ఏర్పాటు పేరుతో భూములను తీసుకుని వాటిని శారదా పీఠానికి మళ్లించుకునేందుకు అక్రమాలు చేశారు. వాటిని గుర్తించడం కారణంగా కేటాయింపు రద్దు చేశాం. ఎర్రమట్టి దిబ్బలను సైతం గత పాలకులు కొల్లగొట్టారు. అక్రమాల న్నింటిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటాం' అని స్పష్టం చేశారు.

### పట్టాలపై గంజాయి సేవనం..

## రైలు ఢీకొని ఇద్దరు విద్యార్థుల మృతి



కిరణ్‌కుమార్ యాసిన్

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టాలపై కూర్చుని గంజాయి తీసుకుంటుండగా.. రైలు దూసుకురావడంతో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. కదిరి రైల్వే పోలీసులు కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా పీలేరుకు చెందిన ఇంటర్ సెకండియర్ విద్యార్థి కిరణ్‌కుమార్ (18), అదే పట్టణానికి చెందిన ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి యాసిన్ (17) మంగళవారం రాత్రి చిత్తూరు మార్గంలోని రైల్వే ట్రాక్‌పైకి వెళ్లి గంజాయి తీసుకోవడం మొదలుపెట్టారు. అదే సమయంలో నాగర్‌కోయిల్ నుంచి ముంబయి వెళ్లే రైలు వీరిపై నుంచి దూసుకెళ్లింది. గంజాయి మత్తులో రైలు వస్తున్న విషయాన్ని వారు గమనించకపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. లోకో పైలట్ అందించిన సమాచారంతో సిబ్బంది అక్కడికి వెళ్లి చూడగా యాసిన్ చనిపోయి కనిపించాడు. కొన ఊపిరితో ఉన్న కిరణ్‌కుమార్‌ను తిరుపతి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కన్నుమూశాడు. ఇద్దరూ గంజాయికి అలవాటు పడ్డారని, వారి వద్ద గంజాయి పొట్లాలు దొరికాయని రైల్వే పోలీసులు తెలిపారు.

## విద్యాసాగర్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

ఈనాడు, అమరావతి: ముంబయి సినీనటి కాదంబరి జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసులో విజయవాడ కోర్టు ఈ నెల 23 వరకు రిమాండ్ విధించడాన్ని సవాల్ చేస్తూ వైకాపా నేత కుక్కల విద్యాసాగర్ దాఖలు చేసిన వ్యాజ్యంలో బుధవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పును రిజర్వు చేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి ప్రకటించారు. సాధ్యమైనంత త్వరలో నిర్ణయాన్ని వెల్లడిస్తామన్నారు.



### ఇతరులు బాధపడతారని క్షమాపణ చెప్పొద్దు

మీరు తప్పు చేసినప్పుడే క్షమాపణ చెప్పండి. మీ కోసం తీసుకోవాల్సిన నిర్ణయాలను ఎదుటివారు బాధపడతారన్న ఆలోచనతో మాత్రం క్షమాపణ చెప్పకండి. అది వారి సమస్యే తప్ప మీది కాదు. మీరేదైనా కొత్తగా ప్రయత్నించి విఫలమైనప్పుడు, మీరేం కోరుకుంటున్నారో చెప్పినప్పుడు, మీ అభిప్రాయాన్ని వెల్లడించినప్పుడు, కుటుంబంతో గడపడానికి పనికి దూరంగా ఉండాల్సి వచ్చినప్పుడు మీరు తప్పు చేసినట్టు కాదు. ఆ సందర్భాల్లో ఎవ్వరికీ క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదు.

– డేనియల్ ఆరోన్, రచయిత

# స్వామి అడుగులకు మడుగులు!

- భూముల కేటాయింపులో ఉల్లంఘనలు
- ట్రస్టీ పేరుతో అభ్యర్థన.. ఉత్తరాధికారి పేరుతో కేటాయింపులు
- నాటి వైకాపా పాలనలో సర్వం మాయ

ఈనాడు-అమరావతి, విశాఖపట్నం: వివాదాస్పద పీఠాధిపతి స్వరూపానందేంద్రకు చెందిన శారదా పీఠానికి నాటి వైకాపా ప్రభుత్వం అడుగడుగునా వత్తాసు పలికింది. రూ.225 కోట్ల విలువచేసే 15 ఎకరాలను ఉల్లంఘించి రూ.15 లక్షలకు కట్టబెట్టారు. ఒకసారి ఉత్తరాధికారి, మరోసారి ట్రస్టీ పేరుతో వ్యవహారాలు నడిపి గందరగోళానికి తెరతీశారు. అధ్యక్షుని ఒకరి పేరుతో రాగా.. కేటాయింపు మరొకరి పేరున జరిగింది. గత జులై 15న ముఖ్యమంత్రి చంద్రబాబు 'సహజ వనరుల దోపిడీ' పేరుతో విడుదల చేసిన శ్వేతపత్రంలో శారదా పీఠానికి కేటాయించిన భూముల వ్యవహారంపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. తదుపరి చర్యల్లో భాగంగా కలెక్టర్ నుంచి అందిన నివేదికపై మంత్రివర్గంలో చర్చించి ఎన్డీయే ప్రభుత్వం రద్దుచేసింది. భూముల కేటాయింపులో విశాఖ జిల్లా అధికార యంత్రాంగం గుర్తించిన ప్రధాన ఉల్లంఘనలు ఇవీ..

★ నిబంధనల ప్రకారం ట్రస్టు నిర్వాహకులు, పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పేరున కాకుండా పీఠం ఉత్తరాధికారి పేరున ఆ భూములు బదలాయించకూడదు.

★ తొలుత 2.9.2021న పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి 15 ఎకరాలు కావాలని అభ్యర్థించారు. శాశ్వత బదలాయింపు కోసం ఉత్తరాధికారి పేరున పారం-29లో వివరాలు పూర్తిచేసి సమర్పించాల్సి ఉన్నా.. అవేమీ చేయలేదు.

★ అప్పటి ప్రభుత్వం స్వాత్మానందేంద్ర అభ్యర్థన మేరకు 24.10.2021లో భూముల బదలాయింపు జీఓ 571 ఇచ్చేసింది. ఆ తర్వాత పీఠం ట్రస్టీ చాగంటి ప్రకాశరావు పారం-29లో వివరాలు నింపి దరఖాస్తు చేశారు.

★ 29.11.2021న శారదా పీఠం ట్రస్టీ పేరున భూమిని బదలాయిస్తూ జీఓ 343ను ఇచ్చింది. వాస్తవానికి పారం-29 ఎవరు సమర్పిస్తారో వారి పేరున బదలాయించాలి. ఇక్కడ ట్రస్టీ చేయడంతో ఆయన పేరున జీఓ ఇచ్చారు. మొదట ఉత్తరాధికారి పేరున ఒక జీఓ ఇచ్చి, ట్రస్టీ పేరున మరొకటి విడుదల చేశారు.

★ తర్వాత భూముల్లో నిర్మాణాలు చేపట్టేందుకు వీలుగా, సర్వే నంబర్లు మార్చి ఇవ్వాలని శారదా పీఠం ట్రస్టీ అప్పటి రెవెన్యూ ఉన్నతాధికారులకు లేఖ రాశారు.

★ వెంటనే రెండు సర్వే నంబర్లలో ఉన్న భూములను ఒకే సర్వే నంబరు కింద మార్చి సవరించిన ఉత్తర్వులను ట్రస్టీ పేరున ఇచ్చారు. శాశ్వత బదలాయింపు ఉత్తర్వుల్లో స్వాత్మానందేంద్ర సరస్వతి పేరున ఇచ్చిన దాన్నికూడా మార్చారు. 8.2.2022న నాటి ప్రభుత్వం 343 బదలాయింపు ఉత్తర్వులను సవరించి కొత్తగా శారదా పీఠం ఉత్తరాధికారి పేరున జీఓ 64ను కొత్తగా ఇచ్చింది. ఇలా ఒక్కోసారి ఒక్కొక్కరి పేరున నచ్చినట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి.

★ 20.11.2023న అత్యాధునిక, ట్రస్టు అవసరాల కోసం ఈ భూమిని ఆదాయ వనరుగా మార్చుకునేందుకు ప్రయత్నించారు. అందు కోసం అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పీఠం ఉత్తరాధికారి లేఖ రాశారు. వర్షించే వారు మనవాడైతే అన్నీ వస్తాయన్నట్లుగా ఆ లేఖ రాయి చేశారు.

★ ఆ ప్రతిపాదించిన స్థలంలో మాట్ రోడ్డు నిర్మించేశారు. ప్రస్తుతం ఒక బోరు, షెడ్డు ఉంది.



## డ్రైవింగ్ లైసెన్స్‌లో అవయవదానం వివరాలు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: డ్రైవింగ్ లైసెన్స్‌లో డ్రైవర్ వివరాలతో పాటు సామాజిక అంశాలకు కొత్తగా ప్రాధాన్యం ఇచ్చారు. డ్రైవర్ పేరు, చిరునామా, పుట్టిన తేదీ, అర్హత పొందిన వాహనం స్వభావం వివరాలతో పాటు అవయవదానం చేయడానికి సిద్ధంగా ఉన్నారా? అనే విషయాన్ని ఇటీవల ముద్రించారు. వీటితో పాటు డ్రైవర్ రక్త గ్రూప్, అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్, అర్హత పొందిన వాహనాల చిత్రాలను ముద్రించారు. దీనివల్ల ప్రమాదం జరిగిన సమయంలో సమాచారం ఇవ్వడానికి ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు.

# రాజ్యలక్ష్మి దాతృత్వం ఆదర్శప్రాయం

- సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బ్యాంకులో దాచుకున్న రూ.61 లక్షల నగదును తన మరణానంతరం సామాజిక, స్వచ్ఛంద సేవా సంస్థలకు దానం చేసిన జీఎస్టీ విశ్రాంత సూపరింటెండెంట్ శిష్టా రాజ్యలక్ష్మి దాతృత్వం అందరికీ ఆదర్శప్రాయమని సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. గుంటూరు కన్నావారితోటలోని జీఎస్టీ భవన్‌లో నరసింహారెడ్డి చేతుల మీదుగా వివిధ సేవా సంస్థలకు బుధవారం చెక్కులు అందజేశారు. నరసింహారెడ్డి మాట్లాడుతూ రాజ్యలక్ష్మి ఆదర్శ నిర్ణయం ఐదరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె భౌతికంగా లేనప్పటికీ, తన దాతృత్వం ద్వారా అందరికీ మార్గదర్శిగా మిగిలిపోతారన్నారు. అనంతరం రాజ్యలక్ష్మి రాసిన వీలునామా ప్రకారం అమ్మ ఛారిటబుల్ ట్రస్టుకు రూ.15 లక్షలు, శిర్డీ సాయి సేవా ట్రస్టుకు రూ.10 లక్షలు, శిష్టా రాజ్యలక్ష్మి పేరుతో ఏర్పాటైన మెమోరియల్ ట్రస్టుకు రూ.36 లక్షలు (చెక్కుల రూపంలో) రాజ్యలక్ష్మి తల్లి



అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి అయ్యన్నరాజుకు రూ.15 లక్షల చెక్కు అందిస్తున్న జీఎస్టీ కమిషనర్ నరసింహారెడ్డి, సావిత్రమ్మ తదితరులు

సావిత్రమ్మ సమక్షంలో ఆయా సంస్థల ప్రతినిధులు అయ్యన్నరాజు, దేవరశెట్టి సురేష్, చిట్టే వెంకటలక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో రాజ్యలక్ష్మి సోదరుడు రామకృష్ణ, ఐఆర్ఎస్ అధికారులు బి.లక్ష్మీనారాయణ, వి.వెంకటేశ్వరరావు, మనోజ్‌కుమార్, కమల్ సీనా, రవికుమార్, నాగరాజు, జీఎస్టీ అధికారులు సీహెచ్. వెంకటేశ్వరరావు, గాదె శ్రీనివాసరెడ్డి, సీహెచ్. ఈశ్వర్, ఏ.సుబ్బారావు, మార్తి, పింఛనర్ల సంఘం అధ్యక్షుడు వివేకానంద, పీవీ సత్యనారాయణ, గుమ్మడి సీతారామయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు: మంత్రి సవిత


ఈనాడు, అమరావతి: త్వరలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత తెలిపారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీని రీయింబర్స్‌మెంట్ చేయనున్నట్లు వెల్లడించారు. ట్రెండ్‌కు తగ్గట్టుగా నేత కార్మికులకు శిక్షణ ఇచ్చి మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. మంగళగిరిలోని చేనేత కార్యాలయంలో బుధవారం వివిధ జిల్లాల డీడీలు, ఏడీలతో ఆమె సమీక్ష నిర్వహించారు. 'చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందించేందుకు కసరత్తు ప్రారంభించాం. చీరాలలో నూతనంగా టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేస్తాం' అని పేర్కొన్నారు.

## రేపటి నుంచి మంత్రి లోకేశ్ అమెరికా పర్యటన

### జార్జియాలో ఐటీ సర్వ్ సినర్జీ సదస్సులో కీలక ప్రసంగం

ఈనాడు డిజిటల్, అమరావతి: విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం నుంచి వచ్చే నెల 1 వరకు అమెరికాలో పర్యటించనున్నారు. ఆయా తేదీల్లో పలు సంస్థల ప్రతినిధులతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకు గల అనుకూలతలపై చర్చిస్తారు. ఇందులో భాగంగా శాన్‌ఫ్రాన్సిస్కోలో ఒరాకిల్ సంస్థ ప్రతినిధులు, పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలతో 25న సమావేశమవుతారు. పత్ర సినర్జీస్, బోసన్, స్పాన్‌ఐఓ, ఛారిటీ, ఎడోబ్, స్పేలర్, జనరల్ అటామిక్స్ సంస్థల ప్రతినిధులు, భారత కాన్సుల్ జనరల్‌తో 26న భేటీ అవుతారు. ఆస్టిన్‌లో పలు కంపెనీల ప్రతినిధులతో 27న, రెడ్‌మండ్‌లో మైక్రోసాఫ్ట్ ప్రతినిధులతో 28న భేటీ కానున్నారు. 29న అమెజాన్ సహా పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశం కావడంతోపాటు ఐటీ సర్వ్ సినర్జీ సదస్సులో కీలక ప్రసంగం చేయనున్నారు. ఈ నెల 30న కూడా వివిధ కంపెనీల ప్రతినిధులతో భేటీ అవుతారు. 31న జార్జియాలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. న్యూయార్క్‌లో పెట్టుబడిదారులతో నవంబరు 1న సమావేశమవుతారు.

### పొట్లా కాదు వంకాయే!



శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం సవరడ్డపనస గ్రామానికి చెందిన బీటీ విశ్వప్రసాద్ ఇంటి ఆవరణలోని ఓ వంగ మొక్కు అడుగున్నర పొడవైన కాయ కాసింది. కేరళకు చెందిన ఓ రైతు దేశీయ కూరగాయల సాగు చేస్తున్నట్లు విశ్వప్రసాద్ యూట్యూబ్‌లో చూసి తెలుసుకున్నారు. ఆయన నుంచి 'ఇల్లీకుంబన్ ఎగ్ ప్లాంట్' రకం విత్తనాలు కొని, పోస్టులో తెప్పించుకున్నారు. వాటిని సేంద్రియ విధానంలో పెంచగా పొడవైన కాయ కాసింది. కేరళకు చెందిన ఈ రకం వంగ సాధారణంగానే పొడవైన కాయలు కాస్తుందని ఉద్యాన అధికారిణి మంగమ్మ తెలిపారు. – న్యూస్‌టుడే, సారవకోట

## వైకాపా హయాంలో.. రౌడీలను పెంచి పోషించారు

### మాజీ మంత్రి పీతల సుజాత

ఈనాడు డిజిటల్, అమరావతి: వైకాపా హయాంలో గంజాయి సాగును నియంత్రించకపోగా, రౌడీమూకలను పెంచి పోషించారని మాజీ మంత్రి పీతల సుజాత విమర్శించారు. అందుకే రాష్ట్రంలో ప్రస్తుతం హత్యాచారాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం పచ్చక మత్తు పదార్థాల అమ్మకం, వినియోగంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉక్కుపాదం మోపుతున్నారని స్పష్టం చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు.

## విశాఖ ఉక్కులో వీఆర్ఎస్ ప్రతిపాదన విరమించుకోవాలి: సీపీఎం

ఈనాడు, అమరావతి: విశాఖ ఉక్కు కర్మాగారంలో స్వచ్ఛంద పదవీ విరమణ ప్రతిపాదనను విరమించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. "విశాఖ ఉక్కు కర్మాగారంలో 'సెయిల్' పేరుతో ఉద్యోగులకు వీఆర్ఎస్ ఇచ్చి సాగనంపడాన్ని వ్యతిరేకిస్తున్నాం. ఉద్యోగులందరూ వీఆర్ఎస్ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకించాలి. కార్మికుల పోరాట ఫలితంగా రెండో బ్లాస్ట్‌ఫర్నేస్ తెరుస్తున్న సమయంలో ఈ చర్య ఉత్పత్తిని దెబ్బకొడుతుంది. 'సెయిల్'లో విలీనం చేయకుండా వీఆర్ఎస్‌ను ప్రవేశపెట్టడాన్ని కార్మికులు ప్రతిఘటించాలి" అని సూచించారు.

## బీఆర్టీఎస్ పనులకు వీడని గ్రహణం

### అసంపూర్తి నిర్మాణాలతో సింహాచలం కారిడార్‌లో అవస్థలు

సింహాచలం, న్యూస్‌టుడే

సింహాచలం బీఆర్టీఎస్ కారిడార్ పనులు కొన్ని చోట్ల అసంపూర్తిగా వదిలేయడంతో ప్రయాణికులు, స్థానికులు, భక్తులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కొత్తగా నిర్మించిన ఈ రోడ్డు అతుకుల బొంతలా ఉందని విమర్శలున్నాయి. రోడ్డుకిరువైపులా నిర్మించిన డక్టులపై పలకలు ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డుకు సమాంతరంగా ఉన్న బోగీ కాలువల్లో వాహనాలు, పాదచారులు పడిపోయే ప్రమాదం లేకపోలేదు. చింతచెట్టు ప్రాంతంలో నుంచి తొలిపావంచా వరకు రోడ్డు బాగా పల్లంగా ఉండడంతో వాహనాల అదుపుతప్పి ప్రయాణిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇప్పటికే ఒకరు మరణించగా మరో చిన్నారికి కాలు విరిగింది. ఆర్టీసీ బస్‌స్టాండు, గాంధీనగర్ కూడలి, పాత అడివివరం కూడలి వద్ద రోడ్డు ప్రమాదకరంగా మారింది.

★ ఏడాది పూర్తవుతున్నా అసంపూర్తి పనులే..కొన్నేళ్లుగా కదలిక లేని సింహాచలం బీఆర్టీఎస్ విస్తరణ పనులను గత ఏడాది నవంబరులో జీవీఎంసీ ప్రారంభించారు. ఏడాది కావస్తున్నా ఇప్పటికీ పనులు నూరు శాతం పూర్తి చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. విస్తరణ పూర్తి చేసి తారు వేసినప్పటికీ రోడ్డు నాణ్యతపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.





### నిధుల లేమితో పనుల్లో జాప్యం

బీఆర్టీఎస్ రహదారి విస్తరణ పనులు పూర్తి చేయడానికి నిధుల విడుదలలో జాప్యం వల్లే అసంపూర్తిగా నిలిచిపోయినట్లు తెలుస్తోంది. గత వైకాపా ప్రభుత్వంలో గుత్తేదారుకు పనులు అప్పగించారు. అప్పట్లో నిధులు సక్రమంగా విడుదల చేయకుండానే హడావుడిగా పనులు చేయించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే గుత్తేదారు పనులు పూర్తి చేయకుండా చేతులెత్తేసినట్లు ప్రచారం జరుగుతోంది. మిగిలిన పనులు వీలైనంత త్వరగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


★ ఈ రోడ్డుపై విభాగినులు నిర్మించినా అనుసంధాన కూడళ్ల వద్ద తారు వేయకుండా వదిలేయడంతో రోడ్డు దాటే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. తొలిపావంచా సమీపంలో దేవస్థానం గ్యారేజీ, సింహాచలం ఆర్టీసీ బస్‌స్టాండు, పాత అడివివరం సమీప రావిచెట్టు ప్రాంతాల్లో రహదారి అసంపూర్తిగా వదిలేయడంతో గుంతలతో ప్రమాదకరంగా మారింది.

★ కాపుదిబ్బ నుంచి తొలిపావంచా వరకు డక్టులపై పలకలు లేకపోవడంతో రాత్రివేళ ఆవాంఛనీయ ఘటనలు జరిగే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాపుదిబ్బ నుంచి ఇరువైపులా రహదారి పూర్తి పల్లంగా ఉండడంతో వేగ నిరోధకాలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

★ చందనోత్సవం, గిరి ప్రదక్షిణ ఉత్సవాల పేరుతో అధికారులు గుత్తేదారును పరుగులు పెట్టించి పాత గోశాల నుంచి పాత అడివివరం వరకు బీటీ రహదారిని నిర్మించారు. ఆదరాబాదరాగా పనులు చేయడంతో ఎక్కడికక్కడ ఎగుడు దిగుడుగా, పలుచోట్ల అతుకులతో కనిపిస్తోంది.



తొలిపావంచా సమీపంలో డక్టులపై పలకలు లేకుండా ఇలా..




ఆర్టీసీ బస్‌స్టాండ్ వద్ద రహదారి దుస్థితి

## అత్యాచారయత్నం కేసులో మూడేళ్ల జైలు

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: మానసిక దివ్యాంగ బాలికపై అత్యాచార యత్నం కేసులో యువకుడికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.30 వేల జరిమానా విధిస్తూ పోక్సో న్యాయస్థానం ప్రత్యేక న్యాయమూర్తి జి.ఆనంది తీర్పునిచ్చారు. నిందితుడు చెల్లించే జరిమానా నుంచి బాధితురాలికి నష్టపరిహారంగా ఇవ్వాలని ఆదేశించారు. పోక్సో న్యాయస్థానం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ తెలిపిన వివరాలివీ ఉన్నాయి.. ఉమ్మడి విశాఖ జిల్లా (ప్రస్తుతం అనకాపల్లి జిల్లా) రోలుగుంట మండలం, జె.పి.అగ్రహారానికి చెందిన కాకర దాసు(25) వృత్తిరీత్యా మోటారు మెకానిక్. అదే ప్రాంతానికి చెందిన దంపతులకు మానసిక దివ్యాంగురాలైన కుమార్తె(16) ఉంది. 2014 జులై 7న కాకరదాసు బాలికను మభ్యపెట్టి తన ఇంటికి తీసుకెళ్లి అత్యాచారం చేయబోయాడు. ఈలోపు అతని కుటుంబ సభ్యులు రావడం చూసి బాలికను విడిచిపెట్టాడు. ఇంటికి వెళ్లిన బాలిక కడుపు నొప్పి రావడంతో ఏడవడం ప్రారంభించింది. ఆమె అమ్మమ్మ ఆరా తీయగా జరిగిన విషయాన్ని సంజ్ఞలతో తెలిపింది. ఈ మేరకు బాధితురాలి కుటుంబ సభ్యులు రోలుగుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడ్ని పోక్సో న్యాయస్థానంలో హాజరుపరిచారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి పైవిధంగా శిక్ష విధించారు.

## అనుకోని ప్రమాదం.. తీసింది ప్రాణం..!

అక్కిరెడ్డిపాలెం(నాతయ్యపాలెం), న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందారు. గాజువాక పోలీసులు వివరాల ప్రకారం.. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ గ్రామానికి చెందిన కొండ్రి వెంకటనాయుడు(54) భవాని పూజల్లో పాల్గొనేందుకు గాజువాక జోగవానిపాలెంలో ఉంటున్న అల్లుడు వై.వెంకటేశ్(35) ఇంటికి వచ్చారు. వారిద్దరూ బుధవారం సాయంత్రం స్కూటీపై ఎన్ఏడీ వైపు వెళ్తున్నారు. స్కూటీ ముందు భాగంలో నూనె డబ్బా ఉంది. షీలానగర్ తాటి వంతెన వద్దకు చేరుకునే సరికి.. స్కూటీ హ్యాండిల్ తిరిగిపోయి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. వాహనంపై ఉన్న ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. భవానీ మాల ధరించి ఉన్న వెంకటేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెనుక సీట్లో కూర్చున్న వెంకటనాయుడు తలకు తీవ్ర గాయమవ్వడంతో ఘటనా స్థలిలోనే మృతి చెందారు. సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వెంకటేశ్‌ను సమీప ఆసుపత్రికి తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వెంకటనాయుడు (పాతచిత్రం)

## ఈవీఎం గోదాముల తనిఖీ



విజిటర్స్ బుక్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: నగర శివారు పెదగదిలి లోని ఈవీఎం (ఎల క్ట్రానిక్ ఓటింగ్ మిషన్) గోదాము లను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. నెల వారీ తనిఖీల్లో భాగంగా గోదాము లను సందర్శించిన ఆయన సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి వేసి ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రతా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం సందర్శకుల రిజిస్టర్‌లో సంతకం చేశారు. తహసీల్దార్ పాలకొండ, ఎన్నికల విభాగ అధికారులు పాల్గొన్నారు.

## నేడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాక

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి గురువారం నగరానికి రానున్నారు. వందేభారత్ రైలులో రాత్రికి నగరానికి చేరుకుని గవర్నర్ బంగ్లాలో బస చేయనున్నారు. 25న ఉదయం 9.30 గంటలకు జిల్లా తెదేపా కార్యాలయంలో జరిగే సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి కలెక్టరేట్‌లో జరిగే సమీక్షకు హాజరవుతారు. రాత్రి 10 గంటల రైలులో తిరుగు ప్రయాణమవుతారు.

## ఏపీ పర్యావరణ అంచనాల కమిటీ సభ్యునిగా ఆచార్య గిరిజాశంకర్



ఆచార్య జి.గిరిజాశంకర్‌ను అభినందిస్తున్న ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు తదితరులు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.గిరిజాశంకర్ ఆంధ్రప్రదేశ్ పర్యావరణ అంచనాల కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ ఆయనను నామినేట్ చేసింది. మూడు సంవత్సరాల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆయనను వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## చీటీల పేరిట టోకరా



పోలీసుస్టేషన్ ప్రాంగణంలో బాధితులు

తగరపువలస, న్యూస్‌టుడే: చీటీల పేరిట ప్రజల నుంచి భారీగా నగదు వసూలు చేసి చేతులెత్తేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు భీమిలి సీఐ సుధాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివీ.. తగరపువలసకు చెందిన వంగపండు రోజా (43), భర్త శ్రీనివాసరావు(49) లక్ష్మీదా, తదితర స్థలాల పేరిట భీమిలి మండలం చిప్పాడ, పరిసర గ్రామాలకు చెందిన పలువురిని నమ్మించి సుమారు రూ.1.36 కోట్లు వసూలు చేశారు. మూడేళ్లుగా చీటీలు కట్టినవారికి వీరి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. అనుమానంతో నిర్వాహకులను పలుమార్లు ప్రశ్నించినా వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో బాధితులు ఆశ్రయించారు. చిప్పాడకు చెందిన బాధితులు కొసన సత్యవతి, మరికొందరు మహిళలు బుధవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ప్రజలను మోసగించిన వారిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

## నగరంలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

### రూ.4 కోట్ల మేర అనధికారిక సిగరెట్ నిల్వల స్వాధీనం



సిగరెట్లను పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎస్పీ కె.శ్రీనివాసరావు


మాధవధార, న్యూస్‌టుడే: ఎలాంటి బిల్లులు లేకుండా బిహార్ నుంచి విశాఖ నగరానికి పెద్ద మొత్తంలో చేరవేసిన వివిధ రకాల బ్రాండ్ల సిగరెట్లను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. సంబంధిత విభాగం ఎస్పీ కె.శ్రీనివాసరావు తెలిపిన మేరకు వివరాలివీ.. చోడవరం వరహాలనాయుడు అనే వ్యక్తి మాధవధార వుడాకాలనీలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని ఎటువంటి అనుమతులు లేకుండా గోదాముగా నడుపుతున్నారు. బిహార్ రాష్ట్రం పట్నాలోని ఐటీసీ కెమికల్స్ సంస్థ నుంచి ఎలాంటి బిల్లులు లేకుండా అనధికారికంగా రెండు వ్యాన్లలో సిగరెట్ బాక్సుల లోడు తీసుకొచ్చారు. దీనిపై విజిలెన్స్ అధికారులకు అందిన సమాచారం మేరకు సంబంధిత గోదాములో సోదాలు చేశారు. ఈ తనిఖీల్లో వీటిని అనధికారికంగా తీసుకువచ్చినట్లు గుర్తించి సీజ్ చేశారు. ఇందులో ఎనిమిది రకాల బ్రాండ్ సిగరెట్ బాక్సులున్నాయి. సీజ్ చేసిన రెండు వ్యాన్లతో కలుపుకొని వీటి విలువ రూ.4,34,20,920. ఇందులో వాహనాల విలువ రూ.30లక్షలుగా లెక్కించి పన్నుల శాఖకు అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో డీఎస్పీ ఎస్.మురళీకృష్ణ, సీఐ సి.హెచ్.తిరుపతిరావు, వాణిజ్యపన్నుల శాఖాధికారిణి రేవతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



సీజ్ చేసిన వాహనం

## వివాహిత ఆత్మహత్య

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన న్యూపోర్టు పోలీసుస్టేషన్ పరిధి భానోజీతోటలో చోటు చేసుకుంది. బుధవారం సీఐ దాలిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మాజీ కౌన్సిలర్ లంక అల రెండో కుమార్తె మల్లిక(38)కు 2005లో రజక్ అనే వ్యక్తితో వివాహమైంది. వారికి ముగ్గురు పిల్లలు. కుటుంబ గొడవల నేపథ్యంలో భార్యాభర్తలిద్దరూ కొన్నేళ్ల కిందటే విడిపోయారు. ప్రస్తుతం మల్లిక తన పిల్లలతో కలిసి భానోజీతోటలో తల్లి వద్ద ఉంటోంది. మల్లికకు కణితివానిపాలెం ఓల్డ్‌టౌన్‌కు చెందిన గణేశ్‌తో పరిచయం ఉండడంతో, వారిద్దరూ చనువుగా ఉంటున్నారు. మంగళవారం రాత్రి మల్లిక తన తల్లి, ఇతర కుటుంబ సభ్యులు పెదపాలెం నుంచి ఆటోలో గాజువాక బయలుదేరారు. ఇంతలో మల్లిక చరవాణికి గణేశ్ చరవాణి నుంచి మెసేజ్ వచ్చింది. వెంటనే ఆమె దిగమంటున్నా జగ్గుసెంటరు వద్ద ఆటో దిగిపోయింది. ఆ తర్వాత ఇంటికి వెళ్లి గదిలో ఫ్యాన్ హుక్కుకు చీరతో ఉరేసుకుంది. గాజువాక వెళ్లిన తల్లి.. ఇంటికొచ్చి చూసే సరికి కుమార్తె విగతజీవిగా కనిపించింది. తన కుమార్తె ఆత్మహత్యకు కారణాలు తెలియడం లేదని, విచారణ జరిపి న్యాయం చేయాలని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యూపోర్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మల్లిక (పాతచిత్రం)

# భీమిలి

## సినిమాలు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్ – జనక అయితే గనక
రాములమ్మ– దేవర
తాతా – వేట్టయాన్ ది హంటర్
సప్తగిరి– విశ్వం, చోటుమహరాజ్
(వెల్లంకి) – వేట్టయాన్ ది హంటర్

## రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: 33/11కేవీ సింహాచలం తొలిపావంచా ఉప కేంద్రం పరిధిలోని 11కేవీ ఆర్టీసీ కాంప్లెక్సు ఫీడర్‌పై నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల ఆయా సమయాల్లో ఫీడర్ పరిధిలోని గోశాల లేఅవుట్, ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతం, టీవీ టవర్ కాలనీ, ప్రియాగార్డెన్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని తెలియజేశారు.

## ఎండాడ, న్యూస్‌టుడే

సమస్య: పెద రుషికొండ పోలమాంబ ఆలయ పరిసరాల్లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది.
– వి.అప్పన్న, రుషికొండ

సమాధానం: వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటాం. – కిషోర్, ఆరోగ్య అధికారి

సమస్య: పెద రుషికొండ పరిధి ప్రభుత్వ పాఠశాల పరిసరాల్లో వీధి దీపాలు వెలగక ఇక్కట్లకు గురవుతున్నాం. – స్థానికులు, పెద రుషికొండ

సమాధానం: వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపడతాం. – సురేష్, విద్యుత్ ఏఈ

## మేమున్నాం.. మీకు తోడుగా

80086 11711, 99122 22247

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

సమస్య: పీఎంపాలెం పరిధి రెండో బస్‌స్టాప్ పరిసరాల్లో మురుగు కాలువలు కంపుకొడుతున్నాయి. – స్థానికులు, పీఎంపాలెం

సమాధానం: సంబంధిత ప్రాంతాల్లో కాలువల శుభ్రతకు చర్యలు తీసుకుంటాం.
– సింహాచలం, జోన్–2 కమిషనర్

## అవీ ఇవీ

### బాలిక అప్పగింత

గోపాలపట్నం, న్యూస్‌టుడే : తల్లిదండ్రులు మందలించారన్న కోపంతో ఇంటి నుంచి వచ్చేసిన బాలికను పోలీసులు తిరిగి అప్పగించారు. ఆ వివరాలు.... సింహాచలం ప్రాంతానికి చెందిన బాలిక(17) తరచూ చరవాణిలో రీల్స్ చూస్తుందని తల్లిదండ్రులు మందలించారు. దాంతో ఈనెల 20న బాలిక ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఆందోళన చెందిన తల్లిదండ్రులు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. సీఐ సురేశ్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. చరవాణి సిగ్నల్స్ ఆధారంగా బాలిక నగరంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి, తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్సైలు రామకృష్ణ, అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

### అధికారి మారగానే అక్రమ నిర్మాణాల కొనసాగింపు

ఆనందపురం, న్యూస్‌టుడే: రామవరం పంచాయతీ జీఎస్.అగ్రహారం గ్రామానికి ఆనుకుని ఉన్న కొండ పోరంబోకు భూమిలో 6 నెలల కిందట కొందరు అక్రమ నిర్మాణానికి ఉపక్రమించారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు అప్పటి తహసీల్దార్ పనులు నిలిపివేశారు. ఆయన బదిలీ కాగానే మళ్లీ పనులు చేపట్టారు. స్థానిక రెవెన్యూ అధికారికి తెలిసినా పట్టించుకోవడం లేదని బుధవారం గ్రామస్థులు మళ్లీ ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ వద్ద ప్రస్తావించగా వెంటనే ఆ పనులు నిలిపివేసి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు.

### అయ్యప్ప స్వాముల అన్నప్రసాదం

పద్మనాభం, న్యూస్‌టుడే: మండలంలోని మద్ది గ్రామంలో శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి సేవా పీఠంలో బుధవారం నిత్యాన్నదానం ప్రారంభమైంది. సేవా పీఠం అధ్యక్షుడు కె.రాంబాబు మాట్లాడుతూ నవంబరు 3వ తేదీ వరకు మాలధార స్వాములందరికీ అన్నప్రసాదం అందిస్తామన్నారు.

### కొలిక్కి వచ్చిన మెట్ల మార్గం సమస్య

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: సింహాచలం దేవస్థానం ప్రహరి నిర్మాణంలో భాగంగా వెంకోజీపాలెం దరి మెట్ల మార్గం సమస్య దాదాపుగా కొలిక్కి వచ్చింది. వెంకోజీపాలెం సీఎంఆర్ ఫంక్షన్ హాలు ఎదురుగా సింహాచలం దేవస్థానానికి చెందిన కొండవాలులో సుమారు 100కి పైగా కుటుంబాలు నివాసముంటున్నాయి. వీరంతా రాకపోకలు సాగించేందుకు వీలుగా జీవీఎంసీ గతంలో మెట్ల మార్గం నిర్మించింది. అయితే ఇటీవల సింహాచలం దేవస్థానం అధికారులు ఎలాంటి ఆక్రమణలు జరగకుండా ప్రహరీ నిర్మాణం చేపట్టారు. మెట్ల మార్గం మూసేస్తున్నారంటూ వదంతులు రావటంతో స్థానికులు స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన అధికారులతో మాట్లాడి మెట్ల మార్గం ఉంచాలని కోరారు. అయితే ప్రహరీకి ఆనుకుని ప్రైవేటు స్థలానికి చెందిన వ్యక్తులు బుధవారం ఉదయం మెట్ల మార్గం మూసి వేస్తే, పక్కనే ఉన్న స్థలంలో మెట్లను నిర్మిస్తామని చెప్పటంతో స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో సమాచారం అందుకున్న దేవస్థానానికి చెందిన అధికారులు వచ్చి మెట్ల మార్గం అలాగే ఉంచుతామని నివాసులకు హామీ ఇచ్చారు. ప్రైవేటు స్థలం యజమానితో చర్చించి, మెట్ల మార్గం విషయమై ఎలాంటి నిర్ణయం వద్దని చెప్పటంతో స్థానికులు శాంతించారు.

### నర్సుల సంఘం ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలకు సంబంధించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాలతో కేజీహెచ్ వద్ద ఎన్నికలు జరిగే ప్రాంతంలో పోలీసులు బందోబస్తు ఉన్నారు. ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన వారిని మాత్రమే లోపలికి పంపించారు.

## కోలాటం... వనితల్లో ఉత్సాహం



### అన్ని వర్గాల వారిలోనూ పెరుగుతున్న ఆసక్తి

ఎండాడ, న్యూస్‌టుడే

ఎన్నో కళలు కనుమరుగవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు, యువత కోలాటంపై ఆసక్తి పెంచుకోవడం ఇటీవల చర్చనీయాంశమవుతోంది. వయస్సుతో సంబంధం లేకుండా వీరు బృందాలుగా ఏర్పడి పండగలు, శుభకార్యాల్లో ప్రదర్శనలిస్తూ ఆకట్టుకుంటున్నారు. జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈ కళను నేర్చుకుంటున్న వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. పాశ్చాత్య దేశాల సంస్కృతి, సంప్రదాయాలకు అందరూ ఆకర్షితులు అవుతున్న తరుణంలో ఇలాంటి కళలపై ఆసక్తి పెరగడం శుభపరిణామమని పలువురు నిపుణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు, కళలకు పూర్వ వైభవాన్ని తీసుకువచ్చి నేటి తరానికి వాటిని పరిచయం చేయాలని వారు సూచిస్తున్నారు.



### కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో..



కోలాటం నేర్చుకోవడం చాలా ఉత్సాహాన్నిస్తోంది. మూడు నెలల పాటు సాయంత్రం వేళ దీన్ని అభ్యసించా. ఇంటి పనులు ముందుగానే చక్కదిద్దుకుని నిత్యం సాధనకు వచ్చేదాన్ని. కుటుంబ సభ్యులు కూడా ప్రోత్సహించారు. దీనివల్ల అందరితో కలిసి మెలిసి మెలగడం అలవాటైంది.
– ఎన్. అరుణ

### కళలు నేర్చుకోవడం అవసరం



సామాజిక మాధ్యమాల్లో చూసి పిచ్చి గంతులు వేసే కన్నా.. ఇలాంటి కళలు నేర్చుకోవడం ఎంతో ఉత్తమం. మేము ఇటీవల స్థానిక పైడితల్లమ్మ, మొగదారమ్మ అమ్మవారి ఉత్సవాల్లో కోలాటం ప్రదర్శించాం. సభికులు, అతిథులు మెచ్చుకోవడంతో మాలో మరింత ఉత్సాహం పెరిగింది. – లలిత

### ఆరోగ్యంగా ఉంటున్నాం..

కోలాటం ఆడడం వల్ల మానసికోల్లాసంతో పాటు శరీరానికి ఓ వ్యాయామంలా ఉన్నందున ఆరోగ్యంగా ఉంటున్నాం. దీనివల్ల సమయపాలన తదితర మంచి లక్షణాలు అలవడతాయి. యువత కోలాటం నేర్చుకోవడం ఎంతో అవసరం. ఎప్పుడూ చరవాణులతో తీరిక లేకుండా గడిపే కన్నా ఇలాంటి వాటిపై ఆసక్తి పెంచుకోవడం ఉత్తమం. – అపర్ణ

### ఎందరో ముందుకొస్తున్నారు..



గతంతో పోలిస్తే ఇప్పుడు కోలాటంపై ఆసక్తి పెరిగింది. అన్ని వయస్సుల వారు కోలాటం నేర్చుకునేందుకు ముందుకొస్తున్నారు. గతంలో నేను అన్నమాచార్య సంకీర్తనలు నేర్పించేదాన్ని. మహిళలు కోలాటంపై ఆసక్తి చూపడంతో ఇది కూడా నేర్పుతున్నా. ఏడాదిలో నాలుగు బృందాలకు నేర్పించా. అందరిలోనూ దీనిపై బాగా ఆసక్తి ఉన్నందున త్వరగా నేర్చుకుంటున్నారు. - డి.శాంతి, సాగర్‌నగర్

## రుషికొండ ఈ-పోలీసింగ్ కేంద్రం తెరుస్తాం: సీపీ



పీఎంపాలెంలోని నార్త్‌జోన్ ఏసీపీ కార్యాలయంలో సీపీ శంఖబ్రత బాగ్చీ

పీఎంపాలెం, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డులో పర్యాటక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని చిన రుషికొండ కూడలిలో కొంత కాలంగా మూసి వేసిన ఈ-పోలీసింగ్ కేంద్రాన్ని తిరిగి తెరవనున్నట్లు నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా బుధవారం రాత్రి పీఎంపాలెంలోని నార్త్‌జోన్ ఏసీపీ కార్యాలయానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా జోన్ పరిధిలోని ఆయా పోలీసు స్టేషన్లకు సంబంధించి నమోదవుతున్న కేసులు, వాటి పరిష్కారం తదితర దస్త్రాలను రాత్రి 12 గంటల వరకు పరిశీలించారు. ముఖ్యంగా మధురవాడ ప్రాంతాల్లో గంజాయి, పోక్సో, చోరీలు, ఆత్మహత్యలు తదితర కేసులు పెరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై నార్త్‌జోన్ ఏసీపీ ఎస్.అప్పలరాజుకు సూచించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కారుషెడ్డు కూడలి, డీమార్ట్ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రించే దిశగా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బీచ్ రోడ్డు, పనోరమహిల్స్ ప్రాంతాల్లో ద్విచక్రవాహన రేసింగ్‌లపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందన్నారు. పోలీసు స్టేషన్లలో తరచూ మరమ్మతులకు గురవుతున్న వాహనాల పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. త్వరలో పరిష్కారం కాగలదని ఆశిస్తున్నామన్నారు. కొన్ని చోట్ల మద్యం దుకాణాల ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ సమస్య తమ పరిధిలో లేకపోవడంతో కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లాలని వారికి సూచిస్తున్నామన్నారు. పీఎంపాలెం, పద్మనాభం, ఆనందపురం, భీమిలి ప్రాంతాలకు చెందిన సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## తగరపువలసలో ఎల్‌జీ షోరూం ప్రారంభం

తగరపువలస, న్యూస్‌టుడే: ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ నూతన షోరూంను తగరపువలసలో బుధవారం ఏర్పాటు చేశారు. ఆ సంస్థ రీజనల్ మేనేజర్ కె.వి.కృష్ణాజీ ముఖ్యఅతిథిగా హాజరై దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన అన్ని రకాల అధునాతన ఎలక్ట్రానిక్స్ వస్తువులు అందించేందుకు కొత్తగా ఈ అవుట్‌లెట్ ఏర్పాటు చేశామన్నారు. ఎల్‌జీ వాషింగ్ మెషీన్లు, టీవీలు, రిఫ్రిజరేటర్లు తదితర వస్తువులన్నీ ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి కొనుగోలుపైనా స్క్రాచ్ కార్డులు, ఆఫర్లు ప్రటించామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



రిబ్బన్ కత్తిరించి ప్రారంభిస్తున్న రీజనల్ మేనేజర్ కృష్ణాజీ

## వృత్తి విద్యాకోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : విశాలాక్షినగర్ పరిధిలోని దయాల్బాగ్ విద్యాకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ వృత్తివిద్యాకోర్సులకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోర్సుల సమన్వయకర్త దక్షిణామూర్తి తెలిపారు. డ్రస్ డిజైనింగ్ అండ్ టైలరింగ్, టెక్స్‌టైల్ డిజైనింగ్ అండ్ ప్రింటింగ్, కటింగ్ అండ్ సూయింగ్, బ్లాక్ ప్రింటింగ్, ఆఫీస్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్, మోటారు మెకానిజమ్ (2 వీలర్, ఫోర్ వీలర్) కోర్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు విశాలాక్షినగర్ కైలాసగిరి కూడలి దగ్గరలో గల విద్యాకేంద్రంలో సంప్రదించవచ్చన్నారు.

## ఘనంగా మరిడిమాంబ ఉత్సవాలు



భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలో శ్రీమరిడిమాంబ అమ్మవారి ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ప్రతీ రెండేళ్లకోసారి ఈ వేడుకలు జరుగుతాయి. ఈసారి దేవాలయ ధర్మకర్త గాడు అప్పలనాయుడు, నాగవంశం సామాజిక వర్గ సంఘాధ్యక్షుడు కంటుభుక్త ముత్యాలరావు ఆధ్వర్యంలో దేవాలయం వద్ద ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాల్లో అమ్మవారికి భక్తులు మొక్కులు సమర్పించుకున్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితర నాయకులతోపాటు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

## కమనీయం.. నరహరి నిత్య కల్యాణం



విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య కల్యాణోత్సవం బుధవారం సింహగిరిపై కమనీయంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు భక్తులను ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.

## అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



చిప్పాడ(తగరపువలస), న్యూస్‌టుడే: భీమిలి మండలం చిప్పాడ గ్రామదేవత సుత్తమ్మతల్లిని ఆ గ్రామస్థులు వివిధ రకాల పూలతో బుధవారం ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

## బాలల సంరక్షణ కేంద్రానికి సాయం

తగరపువలస, న్యూస్‌టుడే: దీపావళి పండగ సందర్భంగా నగరంలోని డిజైర్ సొసైటీ హెచ్ఐవీ బాలల సంరక్షణ కేంద్రానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, శారద దంపతులు బుధవారం ఆర్థికసాయం చేశారు. బాలలకు దీపావళి సామగ్రి కొనుగోలు కోసం ఆ సంస్థ ప్రతినిధికి రూ.10వేల చెక్కును అందించారు.



డిజైర్ సొసైటీ బాలునికి, ఆ సంస్థ ప్రతినిధికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే గంటా దంపతులు

## మధ్యాహ్న భోజన పథకం పరిశీలన



విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం తింటున్న జిల్లా కోఆర్డినేటర్ జె.ఎస్.శాస్త్రి

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుతెన్నులను ఈ పథకం జిల్లా కోఆర్డినేటర్ జె.ఎస్.శాస్త్రి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థులకు ఈ భోజనాన్ని అందిస్తోందన్నారు. ఉపాధ్యాయులు సైతం ఈ భోజనం రుచి చూసి సలహాలు అందివ్వాలని కోరారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎ.జయప్రద, ప్రధానోపాధ్యాయుడు పి.రమణ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: అండర్-19 రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సింహాచలంలోని మహాత్మా జ్యోతిబా పులే ఏపీ బీసీ గురుకుల విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ అప్పారావు, పీడీ దుర్గాప్రసాద్ తెలిపారు. గురుకులంలో జరిగిన ఎంపిక పోటీల్లో వేచలపు మధు, ఎస్.జైవర్ధన్, బి.రోహిత్‌కుమార్, కె.జయవర్ధన్, టి.అభిషేక్, పి.రమేశ్, జె.సాగర్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు. రాష్ట్ర స్థాయిలోనూ సత్తా చాటాలని ఆకాంక్షించారు.

## పంచగ్రామాల సమస్య పరిష్కరించాలంటూ వినతి



ఎంపీ శ్రీభరత్‌కు భూ సమస్య వివరిస్తున్న సంఘం ప్రతినిధులు

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: సింహాచలం దేవస్థానం పంచగ్రామాల భూసమస్య పరిష్కారానికి సహకరించాలని కోరుతూ సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం, పంచగ్రామాల కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులు విశాఖ ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఆయనను కలిసి సమస్య వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో చర్చించి ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి టి.వి.కృష్ణంరాజు, ఉపాధ్యక్షుడు ప్రతాప్, సభ్యులు శంకర్రావు, హనుమంతరావు, కృష్ణారావు, రాము, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం..



క్రీడాకారులతో ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, తదితరులు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఏయూ జిమ్నాజియంలో మహిళల ఇంటర్ కాలేజియేట్ కమ్ యూనివర్సిటీ ఎంపికలను బుధవారం ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్, బ్యూటిఫికేషన్ డీన్ ఆచార్య ధనరాజ్, కబడ్డీ కోచ్ డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ వి.ఎస్.కృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ జి.వెంకటేశ్వరరావు, డాక్టర్ సి.హెచ్.సత్యనారాయణ పాల్గొన్నారు.

## చేతి పంపు ప్రారంభం

పీఎంపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ ఆరోవార్డు గాయత్రీనగర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో కొత్తగా వేసిన చేతి పంపును వార్డు తెదేపా, జనసేన అధ్యక్షుడు డి.శ్రీనివాస్, జి.సంతోష్‌నాయుడు, జిల్లా పార్లమెంటరీ తెలుగు యువత ఉపాధ్యక్షుడు గరే గురునాథ్ తదితరులు బుధవారం ప్రారంభించారు. కాలనీలో కొన్ని బ్లాకులకు సంబంధించి నివాసితులు చాలా కాలంగా చేతి పంపు లేక నీటి కోసం ఇబ్బందులు పడతున్నారు. ఈ క్రమంలో కూటమి నాయకులు చొరవ చూపడంతో జీవీఎంసీ ఆధ్వర్యంలో బోరు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డి సత్యనారాయణ, కంచర్ల సర్వదేవుళ్లు, బి.బలరామ్మూర్తి, కె.రామకృష్ణ, కె.సూరిబాబు, షేక్ సుభాని, కె.ప్రతాప్, కాలనీ పెద్దలు రమణ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప పీఠాల్లో నిత్యాన్నదానం



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడు తదితరులు

గ్రామీణభీమిలి, తగరపువలస, న్యూస్‌టుడే: తగరపువలసలోని బంగ్లామెట్ట శ్రీదుర్గాలమ్మ అయ్యప్ప సేవాపీఠం ఆధ్వర్యంలో నిత్యాన్నదాన కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. తొలిరోజు సుమారు వెయ్యి మంది అయ్యప్ప స్వాములకు, భవానీ భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. 41 రోజుల పాటు ప్రతిరోజూ మధ్యాహ్నం అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఠం గురుస్వాములు తమ్మిన సూరిబాబు, దొంతల పైడిరాజు, కుమిలి తిరుపతిరావు, బెవర సాయి పాల్గొన్నారు.

### కృష్ణంరాజుపేటలో..

భీమిలి మండలం కృష్ణంరాజుపేట-డొకరపేట జంటగ్రామాల అయ్యప్ప పీఠం ఆధ్వర్యంలోనూ బుధవారం నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభమైంది. స్థానిక రామాలయం ఆవరణలో భీమిలి జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు దీన్ని ప్రారంభించి మాట్లాడారు. 41 రోజుల పాటు అన్నదానం చేయడం ఎంతో పుణ్య కార్యమంటూ నిర్వాహకులను అభినందించారు. విశ్వహిందూ పరిషత్తు జిల్లా కార్యదర్శి నారాయణ, ఆధ్యాత్మిక వేత్తలు గుడ్డాల ఎల్లయ్య, తాతినాయుడు, ఎన్.సూర్యనారాయణ,తుపాకుల పైడిరాజు, పీఠం నిర్వాహకులు గాడు అప్పలనాయుడు, వెంకటరావు, అర్చకులు గణేశ్‌శర్మ పాల్గొన్నారు.

## తగ్గిన పరీక్ష ఫీజులు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : పరీక్ష ఫీజులు తగ్గడంపై విద్యార్థులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. సెమిస్టర్ ఫీజును రూ.450కు తగ్గించినందుకు విద్యార్థులు ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రెక్టార్ ఆచార్య కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో పోలీసులపై దౌర్జన్యం



ట్రాఫిక్ సిబ్బందితో వాదిస్తున్న శ్రీను

విశాఖపట్నం(గాజువాక), న్యూస్‌టుడే : అతిగా మద్యం తాగిన వ్యక్తి... పోలీసులపై దౌర్జన్యం చేసి, చేతి వేలు కొరికేసిన ఘటన బుధవారం రాత్రి విశాఖపట్నం గాజువాకలో చోటు చేసుకుంది. ఆ వివరాలు.. గాజువాక రాజీవ్‌మార్గ్ కూడలి వద్ద పోలీసులు డ్రంకన్ డ్రైవ్ కేసులు రాస్తున్నారు. హోమ్‌గార్డు ప్రసాద్, మొబైల్ కానిస్టేబుల్ రాజశేఖర్ ఆల్కా మీటర్లతో తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో అతిగా మద్యం తాగి బైక్‌పై వస్తున్న అమర్‌నగర్‌కు చెందిన ఆర్.శ్రీను(30)ను ఆపి తనిఖీ చేసేందుకు ప్రయత్నించారు. తననే అడ్డుకుంటారా..? అంటూ శ్రీను గొడవ చేశాడు. అంతటితో ఆగకుండా కానిస్టేబుల్ రాజశేఖర్ చేతి వేలిని కొరికేశాడు. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని నిందితుడిని గాజువాక పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

## కళాశాల స్థలంలో అక్రమ నిర్మాణాల తొలగింపు



ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం జూనియర్ కళాశాల కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలంలో గత కొంత కాలంగా అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను రెవెన్యూ అధికారులు బుధవారం తొలగించారు. తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ.. కళాశాల స్థలంలో అక్రమ నిర్మాణాలు గుర్తించామన్నారు. దీనిపై గతంలో పనిచేసిన అధికారులు నోటీసులిచ్చినా స్పందించకపోవడం, రెవెన్యూ అధికారులపై ఆక్రమణదారులు దౌర్జన్యానికి పాల్పడినందున పోలీసుల సాయంతో వాటిని తొలగించామన్నారు.


## వ్యర్థాల తీరం..



గుడ్లవానిపాలెం అమ్మవార్ల ఆలయాల సమీప సముద్రంలో నుంచి బుధవారం అధిక సంఖ్యలో వ్యర్థాలు తీరానికి కొట్టుకొచ్చాయి. సహజసిద్ధ అందాలకు నెలవైన ప్రకృతి రమణీయ సుందర తీరంలో ఇలాంటి దుస్థితి తలెత్తడంతో పర్యాటకులు నిరుత్సాహానికి గురవుతున్నారు. తక్షణమే ఇక్కడి తీర ప్రాంతాల శుభ్రతకు అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సాగర్‌నగర్

## సుందర తీరంలో పుష్ప వికాసం

జూపార్కు సాగర తీర ద్వారం-రుషికొండ బీచ్ మధ్య ఉన్న అటవీ భూముల్లో వ్యాప్తి చెందిన గుర్రపుడెక్క పాదులకు వికసించిన పుష్పాలు చూపరులకు కనువిందు కలిగిస్తున్నాయి. బీచ్ రోడ్డు-సముద్రతీరానికి మధ్య వందలాది ఎకరాల అటవీ భూముల్లో ఏటా దీపావళి పండగ ముందు నుంచి సంక్రాంతి ముగిసే వరకు ఆహ్లాదకర రీతిలో ఈ పుష్పాలు వికసిస్తాయి.
– న్యూస్‌టుడే, సాగర్‌నగర్



సాగర్‌నగర్ బీచ్ పరిసరాల్లో ఇలా..

## క్రియాశీలక సభ్యత్వాలపై దృష్టి



సభ్యత్వ నమోదు పుస్తకాలను పంపిణీ చేస్తున్న భాజపా రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, ఇతర నాయకులు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో భాజపా క్రియాశీలక సభ్యత్వాలు చేపట్టేందుకు నాయకులు దృష్టి సారించాలని పార్టీ రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర అన్నారు. భీమిలిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నియోజక వర్గ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు ఇంటింటికీ వెళ్లి పార్టీ సిద్ధాంతాలు వివరించడం ద్వారా సభ్యత్వాలు పెంచాలని సూచించారు. అనంతరం నాయకులకు క్రియాశీల సభ్యత్వ పుస్తకాలు పంపిణీ చేశారు. రాష్ట్ర క్రియాశీల సభ్యత్వ కోకన్వీనర్ బి.లక్ష్మినారాయణ, ఇతర నాయకులు పి.శ్రీనివాసరావు, జి.ఆర్.ఎస్.ఎన్.రాజు, కె.సునీత, ఎస్.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ తూర్పు

### రేపు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఆరిలోవ, న్యూస్‌టుడే: ఆరిలోవ సబ్‌స్టేషన్ 33/11 కె.వి. పైనాపిల్‌కాలనీ ఎస్.ఎస్. పరిధి, 11 కె.వి. దుర్గానగర్ ఫీడర్ మరమ్మతుల పని చేపడుతున్న కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్ 3 ఇ.ఇ. ఆపరేషన్స్ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాండురంగపురం, నెహ్రూనగర్, దుర్గా బజార్, లక్ష్మీనగర్, శివాజీనగర్, ప్రగతినగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

-న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

**మేమున్నాం.. మీకు తోడుగా** 10 AM - 1 PM
ఎంవీపీకాలనీ 80085 74768 మద్దిలపాలెం 99121 20229

★ సమస్య : ఎంవీపీకాలనీ సెక్టారు-11 జగన్ కాలనీ పెట్రోల్ బంకుకు ఆనుకుని ఉన్న వీధిలో నాలుగు వీధి దీపాలు వెలగటం లేదు. - శాస్త్రి

★ సమాధానం: పరిశీలించి పాడైన దీపాలను మారుస్తాం. - విక్రాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్

## ఎన్.సి.సి. భవితకు దిక్సూచి..



❑ పెద్దసంఖ్యలో చేరుతున్న విద్యార్థులు
❑ డాక్టర్ వీఎస్ కృష్ణా డిగ్రీ కళాశాలలో 154 మంది శిక్షణ

కేఆర్‌ఎంకాలనీ, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: చదువుతో పాటు సేవ చేయాలని ఆకాంక్ష ఉన్నా.. భవిష్యత్తులో రక్షణ రంగాల వైపు వెళ్లాలన్న కోరిక ఉన్నా.. ఉద్యోగాలకు చదువుతో పాటు అదనపు అర్హతలతో సులభంగా ఉద్యోగం సంపాదించాలన్న లక్ష్యం ఉన్నా.. నేషనల్ కేడెట్ కార్ప్స్(ఎన్.సి.సి.) వారికి వరంగా మారుతోంది. అందుకే చాలా మంది విద్యార్థులు ఎన్.సి.సి.కి ప్రాధాన్యమిచ్చే కళాశాలల వైపు వెళ్తుంటారు. నగరంలోని డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పెద్దసంఖ్యలో విద్యార్థులు చేరుతుండటానికి కారణం ఎన్.సి.సి.లో చేరాలన్న తపనే ప్రధాన కారణమని విద్యార్థులు చెప్తుంటారు.

**ప్రత్యేకతలెన్నో...**

★ కృష్ణా డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం 154 మంది విద్యార్థులు ఎన్.సి.సి.లో శిక్షణ పొందుతున్నారు. వీరిలో ఆర్మీ విభాగంలో 104 మందికాగా, నేవీ విభాగంలో 50 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. వీరిలో ఆర్మీ విభాగంలో 32 మంది, నేవీ విభాగంలో 15 మంది యువతులు ఉండటం విశేషం.

★ ఎన్.సి.సి. రైఫిల్‌షూటింగ్ వంటి వాటిపై నిష్ణాతులచే శిక్షణ అందజేస్తారు. వీరికి 13 ఆంధ్రా బెటాలియన్ పేరిట సంబంధిత అధికారులు పాల్గొని ఎంపికలు చేస్తుంటారు.

★ సువిశాల మైదానం ఈ కళాశాలకు ఓ మంచి అవకాశంగా చెప్పవచ్చు. ఎన్.సి.సి. విద్యార్థులు డ్రిల్, విన్యాసాలకు ఈ మైదానం చక్కగా ఉపయోగపడుతోంది. 27 డమ్మీ రైఫిల్స్ విద్యార్థులు శిక్షణలో వినియోగించుకుంటున్నారు.

★ వారంలో ఒకరోజు ఎన్‌సీసీ విద్యార్థులకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు శిక్షణ ఉంటుంది.

★ ఈ కళాశాలలో ఎన్.ఎస్.సి. కోసమే చేరే విద్యార్థులు ఉంటారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటుంటారు.

★ ఇక్కడి ఎన్.సి.సి. విద్యార్థి సురేష్ 2018లో దిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన గణతంత్ర వేడుకల్లో పరేడ్‌లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నాడు.

★ ఎన్.సి.సి. చేసిన విద్యార్థులకు లభించే సి. సర్టిఫికెట్‌కు పలు ఉద్యోగాల్లో మంచి ప్రాధాన్యం ఉంటుంది.



**దేశ రక్షణకు..:** ఎన్‌సీసీలో రాణించి రక్షణ రంగంలో స్థిరపడాలని ఉంది. ఇందులో శిక్షణ పొందడం వల్ల మానసికంగా.. శారీరకంగా కూడా రాటుదేలుతాం. ఒక్కడిని కూడా జయించవచ్చు. ప్రస్తుతం సి.సర్టిఫికెట్ కోసం శ్రమిస్తున్నాను. ప్రస్తుతం ప్రభుత్వ వసతిగృహంలో ఉంటూ చదువుకుంటున్నాను.
– సి.హెచ్.ప్రవీణ్, డిగ్రీ మూడో సంవత్సరం విద్యార్థి



**యువతకు ఎన్‌సీసీ చాలా అవసరం:** యువత చెడుమార్గంవైపు వెళ్లకుండా క్రమశిక్షణాయుత జీవనం గడిపేందుకు ఎన్‌సీసీ దోహదపడుతుంది. చదువు, ఉద్యోగంలో కూడా ఎన్‌సీసీ ధ్రువపత్రాలు ఎంతగానో ఉపయోగపడతాయి. యువత విద్యార్థి దశనుంచే ఎన్‌సీసీ వైపు రావాలి. పోలీస్, ఆర్మీ వంటి ఉద్యోగాలు సులభంగా సాధించవచ్చు.
– మురిపింటి బాలకృష్ణ, ఎన్‌సీసీ అధికారి



ఆర్మీ, నేవీలో శిక్షణ పొందుతున్న ఎన్.సి.సి. విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు

## కొలిక్కి వచ్చిన మెట్ల మార్గ సమస్య

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : సింహాచలం దేవస్థానం ప్రహరీ నిర్మాణంలో భాగంగా వెంకోజీపాలెం దరి మెట్ల మార్గం సమస్య దాదాపుగా కొలిక్కి వచ్చింది. వెంకోజీపాలెం సీఎంఆర్ పంక్షన్ హాలు ఎదురుగా సింహాచలం దేవస్థానానికి చెందిన కొండ వాలులో సుమారు 100కి పైగా కుటుంబాలు నివాసముంటున్నాయి. వీరంతా రాకపోకలు సాగించేందుకు వీలుగా జీవీఎంసీ గతంలో మెట్ల మార్గం నిర్మించింది. అయితే ఇటీవల సింహాచలం దేవస్థానం అధికారులు ఎలాంటి ఆక్రమణలు జరగకుండా ప్రహరీ నిర్మాణం చేపట్టారు. మెట్ల మార్గం మూసేస్తున్నారంటూ వదంతులు రావటంతో స్థానికులు స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన అధికారులతో మాట్లాడి మెట్ల మార్గం ఉంచాలని కోరారు. అయితే ప్రహరీకి ఆనుకుని ప్రైవేటు స్థలానికి చెందిన వ్యక్తులు బుధవారం ఉదయం మెట్ల మార్గం మూసి వేస్తే, పక్కనే ఉన్న స్థలంలో మెట్లను నిర్మిస్తామని చెప్పటంతో స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో సమాచారం అందుకున్న దేవస్థానానికి చెందిన అధికారులు వచ్చి మెట్ల మార్గం అలాగే ఉంచుతామని హామీఇచ్చారు. ప్రైవేటు స్థల యజమానితో చర్చించి, మెట్ల మార్గం విషయమై ఎలాంటి నిర్ణయం వద్దని చెప్పటంతో స్థానికులు శాంతించారు.



మెట్ల మార్గం వద్ద నిరసన తెలియజేస్తున్న మహిళలు

### గంజాయి అక్రమ రవాణాపై దృష్టి



తనిఖీలు జరుపుతున్న పోలీసులు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : శాంతి భద్రతల పరిరక్షణ, గంజాయి అక్రమ రవాణా నియంత్రణలో భాగంగా నేరాలను నియంత్రించేందుకు నగరంలోని పలు స్టేషన్ల పరిధిలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ప్రధానంగా అన్ని స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి తనిఖీలు చేశారు. ఆయా ఇంటి పరిసరాల్లో వారి కదలికల గురించి ఆరా తీశారు. పలు ప్రాంతాల్లో వాహనాలు తనిఖీలు జరిపి రికార్డులు లేని వాటిని స్వాధీనం చేసుకున్నారు. రౌడీషీటర్లకు హెచ్చరికలు జారీ చేశారు.

## అ వీ ఇ వీ

### ● మద్యం దుకాణం వద్దంటూ నిరసన

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : పందిమెట్ట వద్ద కొత్తగా కేటాయించిన మద్యం దుకాణాన్ని వ్యతిరేకిస్తూ ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నిరసన తెలియజేశారు. ముత్యాలమ్మ ఆలయానికి అతి చేరువుగా దుకాణం ఉందని తెలిపారు. మద్యం దుకాణం నిర్వహించకుండా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండు చేశారు.

### ● విద్యార్థుల సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఏబీవీపీ యూనివర్సిటీ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను భాజపా జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర లాసన్స్‌బేకాలనీ భాజపా కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. 27, 28 తేదీల్లో రెండు రోజుల పాటు గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో ఈ విద్యార్థుల సమ్మేళనం జరగనుందన్నారు. ఏబీవీపీ ఆంధ్ర యూనివర్సిటీ అధ్యక్షులు డి.నరసింహ, సభ్యులు నాగాంజి నాయక్, శ్రీనివాస్, వెంకయ్యనాయుడు, సునీల్, ప్రసాద్, చక్రవర్తి, మోహన్ పాల్గొన్నారు.

### ● ఆచార్య ప్రసాదరావుకు సత్కారం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపల్, అర్థశాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యులు బి.ప్రసాదరావును ఏయూ ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు బుధవారం తన ఛాంబర్‌లో సత్కరించారు. పాఠశాల విద్యను బలోపేతం చేయాలనే సదుద్దేశంతో ఎన్నో వ్యయప్రయాసల కోర్చి ఆంగ్ల మాధ్యమ పాఠశాలను అభివృద్ధి చేసిన విధానం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ. నరసింహారావు పాల్గొన్నారు.

### ● నూతన సెమినార్ హాల్ పరిశీలన

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో రామినేని కోదండ రామయ్య సెమినార్ హాల్‌ను ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ వాలీబాల్ మాజీ కోచ్, విశాఖ ఒలింపిక్ అసోసియేషన్ మాజీ ఛైర్మన్ దివంగత కోదండరామయ్య పేరు మీదుగా ఆయన కుమారుడు శ్రీధర్ సుమారు రూ.2 కోట్ల వ్యయంతో 250 మంది కూర్చునే సామర్థ్యంతో ఈ సెమినార్ హాల్‌ను నియమించారు. ఈ సెమినార్ హాల్‌కు సెంట్రల్ ఏసీతో పాటు సదస్సులు నిర్వహణకు కావలసిన అన్ని సదుపాయాలు కల్పించారు. కార్యక్రమంలో ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్, ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ కార్యనిర్వాహక సభ్యులు రామినేని శివలింగ ప్రసాద్, రామినేని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

### ● వృత్తి విద్యాకోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : విశాలాక్షినగర్ పరిధిలోని దయాల్బాగ్ విద్యాకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ వృత్తివిద్యాకోర్సులకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోర్సుల సమన్వయ కర్త దక్షిణామూర్తి తెలిపారు. డ్రెస్ డిజైనింగ్ అండ్ టైలరింగ్, టెక్స్‌టైల్ డిజైనింగ్ అండ్ ప్రింటింగ్, కటింగ్ అండ్ సూయింగ్, బ్లాక్ ప్రింటింగ్, ఆఫీస్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్, మోటారు మెకానిజమ్ (2 వీలర్, ఫోర్ వీలర్) కోర్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు విశాలాక్షినగర్ కైలాసగిరి కూడలి దగ్గరలో గల విద్యాకేంద్రంలో సంప్రదించవచ్చన్నారు.

## విదేశీ విద్యార్థుల వసతి గృహాన్ని సందర్శించిన రిజిస్ట్రార్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్ర విశ్వవిద్యాలయం విదేశీ విద్యార్థుల వసతి గృహాన్ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్. ధనుంజయరావు బుధవారం మధ్యాహ్నం సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో కల్పిస్తున్న సదుపాయాలను ఆయన స్వయంగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి అక్కడే భోజనం చేశారు. విద్యార్థులకు ఎటువంటి సహాయం అవసరమైన వెంటనే తమను సంప్రదించాలని సూచించారు. అంతకుముందు రిజిస్ట్రార్‌కు పూల బొకే అందించి సిబ్బంది స్వాగతం పలికారు. చీఫ్ వార్డెన్ డాక్టర్ ఎన్.ఎం.యుగంధర్, అడకమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్ కుమార్, దూర విద్యా కేంద్రం సంచాలకులు ఆచార్య ఎన్. విజయమోహన్, డి.సి.ఎం.ఎస్.విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, తదితరులు పాల్గొన్నారు.



ఏయూ రిజిస్ట్రార్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న డాక్టర్ ఎన్.ఎం.యుగంధర్ తదితరులు

## క్రీడలతో మానసికోల్లాసం..

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఏయూ జిమ్నాజియంలో మహిళల ఇంటర్ కాలేజియేట్ కమ్ యూనివర్సిటీ ఎంపికలను బుధవారం ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్, బ్యూటిఫికేషన్ డీన్ ఆచార్య ధనరాజ్, కబడ్డీ కోచ్ డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ వి.ఎస్.కృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ జి.వెంకటేశ్వరరావు, డాక్టర్ సి.హెచ్.సత్యనారాయణ పాల్గొన్నారు.





క్రీడాకారులతో ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు

### కారుణ్య నియామక పత్రం అందజేత



నియామకపత్రం అందజేస్తున్న సి.పి. శంఖబ్రత బాగ్చీ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : అకాల మరణం చెందిన హోమ్‌గార్డు కుటుంబానికి ఆర్థిక సహాయంతో పాటు హోమ్‌గార్డు సతీమణికి కారుణ్య నియామక పత్రాన్ని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అందజేశారు. నగర పోలీసు శాఖలో హోమ్‌గార్డుగా విధులు నిర్వహించిన మహ్మద్ హసమ్ న్యూరో సమస్యలతో ఆగస్టులో మృతిచెందారు. కాంట్రిబ్యూషన్ ఫండ్ నుంచి హోమ్‌గార్డు భార్యకు ఆర్థిక సహాయాన్ని చెక్కురూపంలో అందజేశారు.

### ● నర్సుల సంఘం ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలకు సంబంధించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాలతో కేజీహెచ్ వద్ద ఎన్నికలు జరిగే ప్రాంతంలో పోలీసులు బందోబస్తు ఉన్నారు. ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన వారిని మాత్రమే లోపలికి పంపించారు. బయట పరిసరాల్లో ఎవరూ ఉండకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

### ● వ్యభిచారగృహంపై దాడి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : న్యూపోర్టు స్టేషన్ పరిధిలో గుట్టుగా నిర్వహిస్తున్న వ్యభిచారగృహంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు జరిపారు. ఇతర ప్రాంతాల నుంచి అమ్మాయిలను తీసుకువచ్చి రహస్యంగా వ్యభిచారం చేయిస్తున్నారని వచ్చిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు జరిపారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న ఇద్దరు యువతులు, నలుగురు విటులను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం న్యూపోర్టు స్టేషన్‌కు అప్పగించారు.

### ● కిక్ బాక్సింగ్‌లో న్యాయనిర్ణేతకు అభినందనలు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించిన హోంగార్డు నూకరాజును సి.పి. శంఖబ్రత బాగ్చీ అభినందించారు. సిటీ హోంగార్డు యూనిట్‌లో పని చేస్తూ కిక్ బాక్సింగ్‌లో ఆసక్తిగల విద్యార్థులను ప్రోత్సహిస్తూ గత నెలలో ఉత్తరాఖండ్ డెహ్రాడూన్‌లో జరిగిన 17వ సీనియర్, 16వ జూనియర్, 15వ సబ్ జూనియర్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. దీంతో నూకరాజు ప్రతిభను గుర్తించి, అభినందనలు తెలిపారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

### ● తోపుడుబండ్ల కార్మికులపై దాడులు ఆపాలి

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తోపుడుబండ్ల కార్మికులపై దాడులు పెరిగాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ ఆరోపించారు. రెక్కాడితేగాని డొక్కాడని తోపుడుబండ్ల చిల్లర వర్తకులపై కొత్తగా వచ్చిన జీవీఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్ ఇతర అధికారులు ఈ రకమైన దాడులు చేయడం సరికాదని విమర్శించారు. కార్యక్రమంలో మద్దిలపాలెం జోన్ తోపుడుబండ్ల, చిల్లర వర్తకుల కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు పి.వెంకటరావు, సి.ఐ.టి.యు నాయకులు వి.కృష్ణారావు, అనపర్తి అప్పారావు, కె.కుమారి తదితరులు పాల్గొన్నారు.

### ● ఏబీవీపీ నిరసన

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం పెంచిన సెమిస్టర్ ఫీజులను తగ్గించాలని కోరినందున వీసీ తమను బెదిరించి అవమానించారని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) విద్యార్థులు ఆరోపించారు. ఈ మేరకు వారు బుధవారం ఏయూ ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సహ సంఘటన కార్యదర్శి గుడిపాటి సుబ్బరాజు, యూనివర్సిటీ ఇన్‌ఛార్జి కిరణ్ కుమార్, విద్యార్థి నాయకులు కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

### ● డీసీఎంఎస్ ఆచార్యునికి వీసీ అభినందన

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.హనుమంతురావును ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు బుధవారం అభినందించారు. ఇటీవల మలేసియాలో జరిగిన ఇండో - మలేషియా ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో ఆయనకు 'ది బెస్ట్ అడకమిక్ రీసెర్చర్ ఇన్ మేనేజ్‌మెంట్ స్టడీస్' అవార్డు లభించింది.

### మిద్దె తోటల నగరంగా విశాఖను తీర్చిదిద్దుదాం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : మిద్దెతోటల నగరంగా విశాఖను తీర్చిదిద్దుదామని గ్రీన్ క్లైమేట్ టీం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం అన్నారు. మద్దిలపాలెంలోని శ్రీ భావన విద్యా నికేతన్‌లో ఎకో వైజాగ్‌లో భాగంగా బుధవారం మిద్దెతోటల పెంపకం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రతినిధి నీలిమ, ఏయూ మాస్టర్ సోషల్ వర్క్ విద్యార్థిని బి.చైతన్య సరస్వతి, గ్రీన్ వాలంటీర్ జె.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మిద్దె పంటలపై అవగాహన కల్పిస్తున్న జె.వి.రత్నం

### తగ్గిన పరీక్ష ఫీజులు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : పరీక్ష ఫీజులు తగ్గడంపై విద్యార్థులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. సెమిస్టర్ ఫీజును రూ.450కు తగ్గించినందుకు విద్యార్థులు ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రెక్టార్ ఆచార్య కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య జి. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఏయూ వీసీ జి.శశిభూషణరావు, రెక్టార్ కిశోర్ బాబు, రిజిస్ట్రార్ ధనుంజయరావును కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఏయూ విద్యార్థులు

## వ్యాసరచనలో ప్రతిభ

ఆరిలోవ, న్యూస్‌టుడే: ఆరిలోవ ఆఖరి బస్‌స్టాప్ దగ్గరలో ఉన్న క్రిస్టినా పబ్లిక్ స్కూల్‌లో 'ఈనాడు' ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'అంతర్జాల వినియోగంలో లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అన్న అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. వై.జ్యోత్స్న ప్రియ (10వ తరగతి), అనంత హాసిని (9వ తరగతి), ఐ.కుసుమ(8వ తరగతి)లు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయిని ఇ.శ్రీలక్ష్మి, ఇన్‌ఛార్జి డి.సరిత, రాహుల్‌సింధు చేతులు మీదుగా బహుమతులు అందించారు.



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు



విజేతలుగా నిలిచిన వై.జ్యోత్స్నప్రియ, ఎ.హాసిని, ఐ.కుసుమలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

### మర్యాదపూర్వక కలయిక



ఎం.వి.పి. కాలనీ, న్యూస్‌టుడే : నగరంలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజును ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం సాయంత్రం అశోక్‌గజపతిరాజును కలిసి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

### కమనీయం.. నరహరి నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య కల్యాణోత్సవం బుధవారం సింహగిరిపై కమనీయంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాల భోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవింద రాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు.

### అసాంఘిక చర్యలకు అడ్డుకట్ట వేయాలి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : లాసన్స్‌బేకాలనీ వేంకటేశ్వర ఆలయం సమీపంలో మందుబాబులు రాత్రిపూట మద్యం తాగి బాటిళ్లను అక్కడే వదిలి పెట్టి వెళ్తున్నారు. నిత్యం భక్తులు తిరిగే ప్రాంతంలో ఈ తరహా చర్యల పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఈ ప్రాంతంలో వీధిలైట్లు లేకపోవడంతో మందుబాబుల ఆగడాలకు హద్దు లేకుండా పోయింది. దీనిపై పలుమార్లు ఎంవీపీ స్టేషన్ పోలీసుల దృష్టికి కూడా తెచ్చామని.. అయినా స్పందన లేదని స్థానికులు చెప్తున్నారు.



ఆలయం గోడపక్కన పడేసిన మద్యం బాటిళ్లు, గ్లాసులు

## ఆదర్శనగర్‌లో సమస్యలెన్నో...



వెలగని వీధి దీపాలు



రహదారి మధ్యలో గోతులు

ఉషోదయ కూడలి సమీపంలోని ఆదర్శనగర్‌లో అనేక సమస్యలతో స్థానికులు సతమతమవుతున్నారు. ఆదర్శనగర్‌లో గత కొంతకాలంగా వీధి దీపాలు వెలగని పరిస్థితి ఉంది. చీకటి పడితే అంధకారం అలముకుంటోంది. ఇటీవల కాలంలో తాగునీటి కుళాయిల ఇంటింటి కనెక్షన్ కోసం రహదారుల మధ్యలో గోతులు తవ్వి వదిలేయటంతో రాత్రి సమయంలో వీధి దీపాలు వెలగడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతులు పూడ్చి, వీధి దీపాలను వెలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

### వాహనాలు స్వాధీనం

ఆరిలోవ, న్యూస్‌టుడే: ఆరిలోవ పరిసర ప్రాంతాల్లో బుధవారం పోలీసుల తనిఖీలు జరిగాయి. తూర్పు ఏసీపీ రాంబాబు నేతృత్వంలో కృష్ణాపురం, రామకృష్ణాపురం, పైనాపిల్‌కాలనీ తదితర కొండ ప్రాంతంలో ఈ తనిఖీలు కొనసాగాయి. సరైన ఆధారాలు లేని పది ద్విచక్ర వాహనాలను జప్తు చేశారు. ఈ తనిఖీల్లో సుమారు 50 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.



## మద్యం మత్తులో పోలీసులపై దౌర్జన్యం

గాజువాక, న్యూస్‌టుడే : అతిగా మద్యం తాగిన వ్యక్తి... పోలీసులపై దౌర్జన్యం చేసి, చేతి వేలు కొరికేసిన ఘటన బుధవారం రాత్రి విశాఖపట్నం గాజువాకలో చోటు చేసుకుంది. ఆ వివరాలు.. గాజువాక రాజీవ్‌మార్గ్ కూడలి వద్ద పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు రాస్తున్నారు. హోమ్‌గార్డు ప్రసాద్, మొబైల్ కానిస్టేబుల్ రాజశేఖర్ ఆల్కా మీటర్లతో తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో అతిగా మద్యం తాగి బైక్‌పై వస్తున్న అమర్‌నగర్‌కు చెందిన ఆర్.శ్రీను(30)ను ఆపి తనిఖీ చేసేందుకు ప్రయత్నించారు. తననే అడ్డుకుంటారా..? అంటూ శ్రీను గొడవ చేశాడు. అంతటితో ఆగకుండా కానిస్టేబుల్ రాజశేఖర్ చేతి వేలిని కొరికేశాడు. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని నిందితుడిని గాజువాక పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.



ట్రాఫిక్ సిబ్బందితో వాదిస్తున్న శ్రీను



కానిస్టేబుల్ వేలిపై గాయం

# విశాఖ ఉత్తరం

• విశాఖ ఉత్తరం • విశాఖ దక్షిణం

## విద్యుత్తు సరఫరాకు అంతరాయం రేపు

కంచరపాలెం, న్యూస్‌టుడే: కప్పరాడ 11కేవీ ఫీడర్‌లో మరమ్మతులు చేపట్టనున్నందున ఈనెల 25న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఐటీ దరినగర్, జయప్రకాష్‌నగర్‌పైన, బాపూజీనగర్, తిక్కవానిపాలెం, కప్పరాడ, రామ్‌జీఎస్టేట్, పెదకొత్తూరు, ఎ.ఎస్.ఆర్.నగర్, సురేశ్‌రామ్‌నగర్, జగ్జీవన్‌నగర్, అంబేడ్కర్‌నగర్, ఇందిరానగర్ 1 నుంచి 5 వరకు గల ప్రాంతాల్లో విద్యుత్తు ఉండదని ఈఈ బి.కె.నాయుడు తెలిపారు.

మురళీనగర్, న్యూస్‌టుడే: అయ్యప్పనగర్ 11కేవీ ఫీడర్‌లో నిర్వహణ పనులు చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మసీదుప్రాంతం, అయ్యప్పనగర్, వర్కర్సాఫ్లెక్సు, ప్రశాంతి పార్కు, వాకర్స్‌పార్కు తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఈఈ బి.కె.నాయుడు తెలిపారు.

## వృత్తి విద్యాకోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : విశాలాక్షినగర్ పరిధిలోని దయార్డ్స్ విద్యాకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వృత్తివిద్యాకోర్సులకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోర్సుల సమన్వయ కర్త దక్షిణామూర్తి తెలిపారు. డ్రెస్ డిజైనింగ్ అండ్ టైలరింగ్, టెక్స్‌టైల్ డిజైనింగ్ అండ్ ప్రింటింగ్, కటింగ్ అండ్ సూయింగ్, బ్లాక్ ప్రింటింగ్, ఆఫీస్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్, మోటారు మెకానిజమ్ (2 వీలర్, ఫోర్ వీలర్) కోర్సుల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు విశాలాక్షినగర్ జైలారసిని కూడలి దగ్గరలో గల విద్యాకేంద్రంలో సంప్రదించవచ్చన్నారు.

## ఆల్‌ఇండియా పోటీల్లో పతకాలు

మురళీనగర్, న్యూస్‌టుడే: ఇటీవల ఉత్తరాఖండ్ రాష్ట్రంలో నిర్వహించిన ఆల్‌ఇండియా కార్పొరేట్ అథ్లెటిక్ మీట్‌లో నగరానికి చెందిన బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి, క్రీడాకారిణి మీనాకుమారి ప్రతిభ చాటి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా బుధవారం నగరంలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆమెను ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పాల్ విలియమ్స్, జి.ఆడమ్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌పి బి.శ్రీదేవి, డీజీఎం కె.జగదీశ్వరరావు, ఏజీఎం నుయమున్నీసా బేగం, యూనియన్ నాయకులు బి.ఎస్.చక్రవర్తి, పి.ఈ.సి.హెచ్. వి.సాగర్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



మీనాకుమారిని సత్కరిస్తున్న బీఎస్ఎన్ఎల్ అధికారులు, ఉద్యోగులు

## ఆర్టీసీ బస్సు మొరాయింపు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే : ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఎస్.కోట వెళ్తున్న ఆర్టీసీ బస్సు బుధవారం రాత్రి తాటిచెట్లపాలెం రైల్వేక్వార్టర్స్ వద్దకు వచ్చేసరికి మరమ్మతులకు గురై రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. దీంతో ఆర్టీసీ బస్సులో ఉన్న ప్రయాణికులను మరో బస్సులో ఎస్.కోటకు తీసుకెళ్లారు. ఆ తర్వాత డిపో నుంచి వచ్చిన మెకానిక్‌లు బస్సుకు మరమ్మతులు చేపట్టి ఇక్కడి నుంచి డిపోనకు తరలించారు. ఈ సందర్భంగా ప్రయాణికులు కొంత అసౌకర్యానికి గురయ్యారు. రోడ్డు మధ్యలో బస్సు నిలిచిపోవడం కారణంగా జుయువైపు వచ్చే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



తాటిచెట్లపాలెం వద్ద మరమ్మతులకు గురైన ఆర్టీసీ బస్సు

## కార్తిక పౌర్ణమి నాడు రాధాకృష్ణ మహోత్సవం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తిక పౌర్ణమినాడు రాధాకృష్ణ మహోత్సవం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు తెలిపారు. బుధవారం ఆశీలుమెట్ట సంపత్ వినాయగర్ ఆలయం వద్ద ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను సంఘం సభ్యులు ఆవిష్కరించారు. సంఘం ప్రధాన కార్యదర్శి బొట్టా వెంకటరమణ, ప్రతినిధులు గొంప అప్పారావు, సారిపిల్లి కృష్ణ, ఉప్పిలి కనకరాజు, ఒమ్మి అప్పారావు, డొక్కరి శ్రీనివాసరావు, బొట్టా పరదేశి, ఉప్పిలి అప్పలకొండ, పల్లా రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

## ఆధార్ నవీకరణకు అవకాశం

మాధవధార, న్యూస్‌టుడే: ఆధార్ నవీకరణకు సంబంధించి పలు సచివాలయాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ప్రతి వార్డులో 4 కేంద్రాల చొప్పున 45 సచివాలయాల్లో ఈ నవీకరణ చేపడుతున్నామన్నారు. కొత్తగా పేర్ల నమోదు, చిరునామాల్లో మార్పులు, చేర్పులు, ఫోన్ నంబర్ల సవరణ, బయోమెట్రిక్, బడి పిల్లలకు సంబంధించి ఆధార్ నవీకరణ వంటివి చేసుకోవచ్చునని ఈనెల 25వ తేదీ వరకు ఈ శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

## ఒలింపియాడ్ పరీక్షల్లో ప్రతిభ

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జాతీయ స్థాయిలో నిర్వహించిన ఐఓక్యూఎం(ఇండియన్ ఒలింపియాడ్ క్వాలిఫయిర్ ఇన్ మేథమెటిక్స్) పోటీల్లో ద్వారకానగర్ శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపల్ రవికిరణ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 39 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 14 మంది విద్యార్థులు రెండో స్థాయికి అర్హత సాధించారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉత్తరాంధ్ర ఏజీఎం ఎంవీ సురేష్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జోనల్ కో-ఆర్డినేటర్ రాజేష్, డీన్‌లు సురేష్, గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో అధ్యాపకులు

## చైర్‌పర్సన్ నియామకం అభినందనీయం

సీతంపేట:ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్‌గా విశ్రాంత ఐపీఎస్ అధికారిణి అనురాధను నియమించడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సమయం హేమంత్ కుమార్ అన్నారు. గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష తేదీలను నూతన చైర్‌పర్సన్ ప్రకటించాలని కోరారు.

జ్ఞానాపురం, న్యూస్‌టుడే

**సమస్య:** జ్ఞానాపురం దరి శిలువ గుర్తుమండపం వద్ద గొయ్యి తీసి విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేశారు. గొయ్యి తీసిన సమయంలో వచ్చిన మట్టిని అక్కడే వదిలేశారు. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం.
– పంచదార్ల సన్నియాదవ్, జ్ఞానాపురం

**సమాధానం:** సంబంధిత గుత్తేదారుడితో మాట్లాడి మట్టిని తొలగించాలని ఆదేశాలు జారీ చేస్తాం. – ఏఈ సతీష్

మేమున్నాం.. మీకు తోడుగా
10 AM - 1 PM
విశాఖ ఉత్తరం: 80747 24699
విశాఖ దక్షిణం: 80085 66543

## అభివృద్ధి పనుల్లో నాణ్యత డొల్ల..!

అల్లిపురం, న్యూస్‌టుడే

జీవీఎంసీ జోన్-4 పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పూర్ణమార్కెట్, అల్లిపురం, జగదాంబ కూడలిలో నెలల కిందట నిర్మించిన బీటీ రహదారులపై ప్రస్తుతం గుంతలు పడ్డాయి. నాడు గుత్తేదారు ఇష్టానుసారంగా పనిచేసినా ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోలేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల వెంకటేశ్వరమెట్ట వద్ద రూ.15లక్షలతో డ్రైనేజీ పనులు చేపట్టారు. సంబంధిత గుత్తేదారుడు ఇసుకలో కంకర పొడిని కలిపి నిర్మాణాలకు వినియోగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు అక్కడే ఉన్నా ఆ విషయాన్ని పట్టించుకోలేదని చెబుతున్నారు. ఈ విషయంపై జోన్-4 ఇంజినీరింగ్ అధికారులను వివరణ కోరగా వెంకటేశ్వరమెట్ట డ్రైనేజీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించినప్పుడు ఇసుకలో ఎలాంటి కల్తీని గుర్తించలేదన్నారు. ఇక్కడ పనుల కోసం తీసుకొచ్చిన ఇసుకలో కంకరపొడి కలిసి ఉండడం బహిరంగంగా కనిపిస్తున్నా అధికారులు గుర్తించకపోవడం గమనార్హం.

★ నాణ్యతలేని పనుల కారణంగా ఏడాది లోపే కాల్వలు, రహదార్లు దెబ్బతిని శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పన్నుల రూపంలో వచ్చిన ప్రజాధనం వృథా అవుతోందని, ఇప్పటికైనా జీవీఎంసీ ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు స్పందించి గుత్తేదారుడు పనుల్లో నాణ్యత పాటించేలా పర్యవేక్షించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఇసుకలో కంకర పొడి కలిపి నిర్మాణాలకు వినియోగిస్తున్న దృశ్యం



ఇసుక, కంకరపైకి తేలి దర్శనమిస్తున్న డ్రైనేజీ గోడలు

## రోడ్డుపైనే చెట్ల కొమ్మలు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: వర్షాకాలం కారణంగా విద్యుత్తు శాఖ విభాగం అధికారులు గుత్తేదారుడితో నగరంలోని అన్ని వీధులు, ప్రధాన రహదారుల పక్కనున్న చెట్ల కొమ్మలు ట్రిమ్మింగ్ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. అయితే ఈ పనుల్లో భాగంగా ఎక్కడ నరికిన చెట్ల కొమ్మల్ని అక్కడే పెద్ద గుట్టలుగా వేసి వదిలేస్తున్నారు. కొన్నిచోట్ల అయితే రోడ్డుపై అడ్డంగా కుప్పలుగా పోసి వదిలేస్తున్నారు. వీటితో ఆ రహదారుల్లో ప్రయాణించే వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వారంరోజుల కిందట శంకరమఠంరోడ్డు పక్కనున్న శాంతిపురంలో రహదారి పక్కనున్న చెట్ల కొమ్మల్ని నరికారు. అలా నరికిన కొమ్మల్ని పెద్ద పోగుగా చేసి రోడ్డు మధ్యలో వేసి వదిలేశారు. వీటిని సకాలంలో వెంటనే తొలగించకపోవడంతో ఎండకు ఎండి వానకు తడిచి ఆ ప్రాంతంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది.



గురుద్వారా - శాంతిపురం మార్గంలో ఇలా..



శంకరమఠం రోడ్డు నుంచి గురుద్వారా కూడలికి వచ్చే దారిలో పరిస్థితి..

## రైళ్లు లేక.. దిక్కుతోచక..!

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: దానా తుపాను కారణంగా హావ్‌డా, షాలిమార్, భువనేశ్వర్ వైపు వెళ్లే రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. దీంతో పాటు పలు రైళ్ల రాకపోకల్లో తీవ్ర అంతరాయం ఏర్పడి ఆలస్యంగా నడుస్తున్నాయి. బుధవారం నుంచి రైళ్లు రద్దయినప్పటికీ అంతకు ముందు బయలుదేరినవి ఒక్కొక్కటిగా విశాఖ చేరుకుంటున్నాయి. అయితే కనెక్టింగ్ రైళ్లు లేకపోవడంతో పెద్దఎత్తున ప్రయాణికులు రైలు నిలయంలో పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గమ్యస్థానానికి చేరే దారి తెలియక ఆందోళన చెందుతున్నారు. నిరీక్షిస్తున్న వారితో స్టేషన్ పరిసరాలు రద్దీగా మారాయి. మరో పక్క అరకొరగా నడుస్తున్న రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి.



రైళ్ల రద్దుతో స్టేషన్‌లో పడిగాపులు



విశాఖ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

## మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం

వన్‌టౌన్: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని, బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మహిళా పోలీసు స్టేషన్ ఏఎస్ఐ భీశెట్టి వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం సాయంత్రం ఏవీఎన్ కళాశాలలో మహిళా పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో అవగాహన శిబిరం నిర్వహించారు. ఏఎస్ఐ మాట్లాడుతూ తెలియని తనంతో తప్పులు చేయద్దని, ముఖ్యంగా బాలికలను వేధించడం వంటి చర్యలకు పాల్పడితే పోక్సో వంటి చట్టాల కింద కేసులు నమోదవుతాయని, జీవితం నాశనమవుతుందన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా పాటించాలని, సైబర్ భద్రతపై దృష్టి పెట్టాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ సింహాద్రినాయుడు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి చదువుపైనే దృష్టి సారించాలని సూచించారు.





హాజరైన విద్యార్థులు, మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సింహాద్రినాయుడు, చిత్రంలో ఏఎస్సై వెంకటేశ్వరరావు

## ఎరుకుమాంబకు జలాభిషేకం

అక్కయ్యపాలెం, (దొండపర్తి), న్యూస్‌టుడే: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా పేరుగాంచిన ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం బుధవారం ఘనంగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దీంతో పాటుగా అమ్మవారికి చీర, జాకెట్లు ముడుపులుగా చెల్లించారు. ఈ కార్యక్రమాలను ఆలయం ఇ.ఒ. రమాబాయి పర్యవేక్షించారు.



అమ్మవారిపై పసుపు, కుంకుమ కలిపిన నీటిని పోస్తున్న భక్తులు

## సృజన చూపి.. అబ్బుర పరిచి..!

### 'ఈనాడు' వ్యాసరచన పోటీల్లో ప్రకాశరావుపేట పాఠశాల విద్యార్థుల ప్రతిభ

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ప్రకాశరావుపేట ప్రభుత్వ పాఠశాలలో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశాలపై వ్యాసరచన పోటీలు జరిగాయి. అధిక సంఖ్యలో విద్యార్థులు పోటీలో పాల్గొని తమ సృజనాత్మక భావనలను వ్యక్తీకరించారు. వారిలో కె.మహాశ్రీ (8వ తరగతి), చాందిని కుమారి (10వ తరగతి), బి.కుసుమ (9వ తరగతి) విజేతలుగా నిలిచారు. వారికి నిర్వాహకులు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయిని కె.స్వర్ణలత పాల్గొన్నారు.



పోటీలో పాల్గొన్న విద్యార్థులు



బహుమతులు, ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

## ఆ మార్పు.. ప్రమాదాలకు పిలుపు

**ఆర్టీసీ కాంప్లెక్స్-సిరిపురం రహదారిలో ఇటీవల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అత్యంత రద్దీగా ఉండే ఈ మార్గంలో చేసిన స్వల్ప మార్పులను వాహన చోదకులు అర్థం చేసుకోకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటికి కారణాలను అన్వేషించి పరిష్కరించాల్సిన ట్రాఫిక్ పోలీసులు చోద్యం చూస్తున్నారు.**

కార్పొరేషన్, న్యూస్‌టుడే

★ బుధవారం ఆశీలుమెట్ట నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు ముగ్గురు ప్రయాణికులతో వస్తున్న ఆటో, పైవంతెన నుంచి మేఘాలయ హోటల్ రహదారిలోకి వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్రవాహనంపై ఉన్న మహిళ కాలు విరిగిపోగా, ఆటో చోదకుడికి స్వల్ప గాయాలయ్యాయి. వాహనాన్ని ఢీకొట్టి ఆటో బోల్తాపడినా అందులో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. ఇదే మార్గంలో గతంలో ఓ ప్రయివేటు బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి కొంత దూరం ఈడ్చుకుపోయింది. అదే విధంగా తరచూ ద్విచక్రవాహనాలు ఒకదాన్ని మరొకటి ఢీకొట్టుకుంటున్నాయి.

**గత కమిషనర్ తీసుకున్న నిర్ణయం వల్లే..:** జీవీఎంసీ కమిషనర్‌గా పనిచేసిన సీఎం సాయికాంత్‌వర్మ ఈ రహదారిలో చేసిన మార్పులతోనే ప్రమాదాలు పెరిగాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో పైవంతెన నుంచి వచ్చిన వాహనాలు హోటల్ మేఘాలయ వైపు యూటర్న్ తిరగాలంటే వంతెన దిగి, కాస్త దూరం వెళ్లిన తరువాత మలుపు ఉండేది. దాన్ని నాటి కమిషనర్ మార్పు చేశారు. వంతెన దిగిన వెంటనే కుడివైపు వాహనాలు తిరిగేలా ఏర్పాటు చేశారు. దీంతో సిరిపురం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చే వాహనాలు ఢీకొడుతున్నాయి. అదే విధంగా పైవంతెన నుంచి వచ్చిన కొన్ని వాహనాలు కేపీపాల్ ఫంక్షన్ హాలు వైపు వెళ్తూ, సంపత్ వినాయగర్ ఆలయం నుంచి హోటల్ మేఘాలయ వైపు వచ్చే వాహనాలను ఢీకొడుతున్నాయి. గతంలో వలే రహదారి డివైడర్లను కాస్త ముందుకు మారిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని, ఆ దిశగా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని చోదకులు కోరుతున్నారు.



ప్రమాదానికి గురైన ఆటో

## కథలు.. జీవన చిత్రాలు

సీతంపేట, న్యూస్‌టుడే : సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో జరిగిన కథాకచేరి అలరించింది. సంస్థ అధ్యక్షులు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు మాట్లాడుతూ కథలు పాఠకుడ్ని చదివించేలా ఉత్కంఠగా సాగాలన్నారు. మళ్లీ మళ్లీ చదివించేది మంచి కథని, సామాజిక రుగ్మతలను బయటపెట్టే మంచి కథలు రచయితల నుంచి రావాలన్నారు. కార్యక్రమంలో జె.పి.శర్మ, చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణ మూర్తి, డాక్టర్ డీవీ సూర్యారావు, కొత్తూర రమణ, డాక్టర్ కె.జి వేణు కథానికలు చదవారు. కుప్పిలి భీమేశ్వరరావు, శ్రీనివాసరావు, జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

## మొండి బకాయిదారులపై చర్యలు

సూర్యబాగ్ (అల్లిపురం), న్యూస్‌టుడే: ఆస్తి పన్ను చెల్లించని మొండి బకాయిదారులపై రెవెన్యూ అధికారులు, సచివాలయ కార్యదర్శులు దృష్టి సారించాలని జోన్-4 జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడు ఆదేశించారు. సూర్యబాగ్ జోన్-4 కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం రెవెన్యూ అధికారులు, సచివాలయ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. నీటి ఛార్జీలు, ఆస్తిపన్ను వసూళ్లల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్తిపన్నులు విధించాలని వచ్చిన దరఖాస్తులను తక్షణం పరిశీలించాలని ఆదేశాలు జారీ చేశారు. జోన్-4 ఆర్వోలు రతన్ రాజు, అప్పలరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఉదయ్‌భాస్కరరావు, వీరబాబు, సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జోన్-4 జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడు

## అంబేడ్కర్ కాలనీలో ఆకస్మిక తనిఖీలు

మాధవధార, న్యూస్‌టుడే: జీవీఎంసీ 51వ వార్డు పరిధి అంబేడ్కర్ కాలనీలో బుధవారం ఎయిర్‌పోర్టు పోలీసుల ఆధ్వర్యంలో 'కార్డన్‌సెర్చ్' తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని పలు ఇళ్లలో సోదాలు నిర్వహించి, గొడవలకు, అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన వస్తువులు ఏమైనా ఉన్నాయా అని పరిశీలించారు. కాలనీలోని పలు ద్విచక్ర వాహనాలకు సంబంధించిన దస్త్రాలు పరిశీలించారు. వాటిలో రికార్డులు లేని 11 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కాలనీలోని యువకులు అసాంఘిక కార్యకలాపాలకు, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎయిర్‌పోర్టు సీఐ వి.చక్రధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఓ ఇంటిలో తనిఖీ నిర్వహిస్తున్న దృశ్యం

## వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి బలవన్మరణం

గురుద్వారా, న్యూస్‌టుడే: నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు బలవన్మరణానికి పాల్పడిన ఘటనలు బుధవారం చోటుచేసుకున్నాయి. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో మనస్తాపంతో ఓ వివాహిత, అక్కయ్యపాలెంలో మద్యానికి బానిసై ఓ వ్యక్తి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలిలా..

**సీతమ్మధారలో వివాహిత..:** మేధానాగ్ (33)కు శ్రీకాంత్‌రెడ్డితో 2020లో వివాహమైంది. మూడేళ్ల తర్వాత ఉద్యోగం నిమిత్తం భార్యను వదిలేసి భర్త అమెరికా వెళ్లారు. అప్పటి నుంచి ఆమె సీతమ్మధారలోని తల్లిదండ్రుల చెంతనే ఉంటోంది. ఆమెను ఆ దేశానికి తీసుకెళ్లేందుకు భర్త ప్రయత్నించినా ఏడాదిన్నరగా వీసా రాలేదు. దీంతో కొద్ది రోజులుగా మానసిక వేదనకు గురైంది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం తన పడక గదిలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చేర్పించినా ఫలితం లేకపోయింది. అప్పటికే ఆమె చనిపోయిందని వైద్యులు నిర్ధారించారు. ఘటనా స్థలానికి నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ విజయ్‌కుమార్ చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

**మరోచోట మద్యానికి బానిసైన వ్యక్తి..:** అక్కయ్యపాలెం నందనగిరినగర్‌కు చెందిన సతీశ్(28) ఓ దుకాణంలో సైకిల్ మెకానిక్‌గా చేస్తున్నాడు. అతడికి భార్య ఉంది. మద్యానికి బానిసై రోజూ తాగొచ్చేవాడు. మంగళవారం ఇంటికి రాకపోవడంతో భార్య చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోయింది. బుధవారం ఉదయం ఇంటి పరిసరాలను నిశితంగా పరిశీలించగా ఓ చోట కేబుల్ తీగతో ఉరేసుకుని విగతజీవిగా కనిపించడంతో భార్య పోలీసులను ఆశ్రయించింది. సీఐ విజయ్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఘనంగా ఎస్పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

మాధవధార, న్యూస్‌టుడే: ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆవిర్భావ దినోత్సవాన్ని కైలాసపురం సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎస్పీఎఫ్ ఏర్పాటు చేసి 33 ఏళ్లు గడిచిందని, అన్ని విభాగాల్లో ఈ ప్రత్యేక రక్షణ దళం సేవలందిస్తోందని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేక్ కోసి సిబ్బంది సంబరాలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో నాల్కో జీజీఎం ఎ.వి. సుబ్బారావు, పలువురు ఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కేక్ కోసి సంబరాలు జరుపుకొంటున్న ఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బంది

## మద్యం మత్తులో పోలీసులపై దౌర్జన్యం

విశాఖపట్నం(గాజువాక), న్యూస్‌టుడే : అతిగా మద్యం తాగిన వ్యక్తి... పోలీసులపై దౌర్జన్యం చేసి, చేతి వేలు కొరికేసిన ఘటన బుధవారం రాత్రి విశాఖపట్నం గాజువాకలో చోటు చేసుకుంది. ఆ వివరాలు.. గాజువాక రాజీవ్‌మార్గ్ కూడలి వద్ద పోలీసులు డ్రంకన్ డ్రైవ్ కేసులు రాస్తున్నారు. హోమ్‌గార్డు ప్రసాద్, మొబైల్ కానిస్టేబుల్ రాజశేఖర్ ఆల్కా మీటర్లతో తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో అతిగా మద్యం తాగి బైక్‌పై వస్తున్న అమర్‌నగర్‌కు చెందిన ఆర్. శ్రీను(30)ను ఆపి తనిఖీ చేసేందుకు ప్రయత్నించారు. తననే అడ్డుకుంటారా..? అంటూ శ్రీను గొడవ చేశాడు. అంతటితో ఆగకుండా కానిస్టేబుల్ రాజశేఖర్ చేతి వేలిని కొరికేశాడు. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని నిందితుడిని గాజువాక పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.



ట్రాఫిక్ సిబ్బందితో వాదిస్తున్న శ్రీను



కానిస్టేబుల్ వేలిపై గాయం




**తీరంలో... 'మజాకా'**

హీరో సందీప్ కిషన్ నటిస్తున్న సినిమా చిత్రీకరణ బుధవారం ఆర్కే బీచ్‌లో జరిగింది. త్రినాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో రావురమేష్, అజయ్ నటిస్తున్నారు. వీరిపై చిత్రీకరించిన పలు సన్నివేశాలను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. - ఈనాడు, విశాఖపట్నం

## పంచారామాలకు ఆర్టీసీ బస్సులు


గాజువాక డిపోలో సిబ్బందితో మాట్లాడుతున్న అప్పలనాయుడు

సింధియా, న్యూస్‌టుడే: కార్తిక మాసంలో ప్రతి ఆదివారం విశాఖ నగరం నుంచి పంచారామాల సందర్శనకు రాష్ట్ర ప్రజా రవాణా సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక సర్వీసులు నడుపుతామని జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. బుధవారం ఆయన గాజువాక డిపోను సందర్శించి మాట్లాడారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు ద్వారకా బస్‌స్టేషన్ నుంచి బయలుదేరే సర్వీసు ద్వారా మరుసటి రోజు (సోమవారం) అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట ఆలయాల సందర్శన పూర్తి చేయొచ్చని తెలిపారు. నవంబరు 3, 10, 17, 24న సర్వీసులు ఉంటాయన్నారు. ఒక్కరికి సూపర్ లగ్జరీ ఛార్జీ రూ.2150, అల్ట్రా డీలక్స్‌లో రూ.2100, ఇంద్రలో రూ.2600గా నిర్ణయించామని, ఆన్‌లైన్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ★ లంబసింగి పర్యటనకు వెళ్లే వారి కోసం ప్రతి శని, ఆదివారాల్లో తెల్లవారుజామున 3 గంటలకు ద్వారకా బస్‌స్టేషన్ నుంచి బస్సులు బయలుదేరుతాయన్నారు. రాజుగారి ద్యామ్, కొత్తపల్లి జలపాతాలు, మోదమాంబ ఆలయం, పాడేరు, కాఫీ తోటలు సందర్శనకు వీలుంటుందన్నారు. ఒక్కరికి ఛార్జీ అల్ట్రా డీలక్స్‌లో రూ.800, ఎక్స్‌ప్రెస్‌లో రూ.650గా నిర్ణయించామన్నారు. ★ దారమఠం సందర్శనకు ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం 7 గంటలకు ద్వారకా బస్‌స్టేషన్ నుంచి బస్సులు ఉంటాయన్నారు. శివాలయం, దారమఠం జలపాతాలు, అల్లూరి సీతారామరాజు మ్యూజియం, బొజ్జన్నకొండ చూసే వీలుంటుందన్నారు. ఒక్కరికి ఛార్జీ సూపర్ లగ్జరీలో రూ.650, అల్ట్రా డీలక్స్‌లో రూ.550గా ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 99592 25602, 90522 27083, 99592 25594, 91001 09731 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# మార్పు.. మంచివైపే

**ఏయూలో సత్ఫలితాలిస్తున్న ముఖ హాజరు**
**అన్ని అంశాల్లోనూ సంస్కరణలు**

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే

**'పెద్ద సార్లు పాఠాలు చెప్పరు.. విద్యార్థులు తరగతులకు రారు.. వసతి గృహాల్లో బయటివారు తిష్టవేస్తుంటారు.' గతంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పరిస్థితి ఇలాగే ఉండేది. అయితే వీసీగా ఆచార్య జి.శశిభూషణరావు బాధ్యతలు చేపట్టాక అకడమిక్‌లో మంచి మార్పులు తీసుకువచ్చారు. ప్రతీ ఆచార్యుడు తప్పని సరిగా తరగతులకు వెళ్లాల్సిందే. పెద్ద సార్లు పాఠాలు బోధించాల్సిందే. విద్యార్థులు తరగతులకు రావాల్సిందే. దీంతో పాటు పలు సంస్కరణ అమలుతో విశ్వవిద్యాలయానికి మంచి పూర్వవైభవానికి కృషిచేస్తున్నారు.**

### ఆలస్యమైతే ఆబ్సెంటే...

ముఖ హాజరు (ఫేషియల్ అటెండెన్స్) ఏర్పాటు చేశాక స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. తొలుత ఇంజినీరింగ్ కళాశాలలోని వివిధ విభాగాల ఏర్పాటు చేశాక మంచి ఫలితాలు రావడంతో అన్ని విభాగాల్లోనూ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వారికి కేటాయించిన సమయానికి మించి ఎవరు వచ్చినా వారికి ఆరోజు ఆబ్సెంట్ మార్కు పడుతుంది. దీంతో ఆచార్యులు, ఉద్యోగులతో పాటు, విద్యార్థులు సకాలంలో వస్తున్నారు.


ముఖ హాజరు యంత్రం..

### ఆకస్మిక తనిఖీలు...

ఏయూలో అన్ని విభాగాలు తనిఖీలు చేయడానికి ఐదు కమిటీలను నియమించారు. ఒక్కొక్క కమిటీలో ఐదుగురు సభ్యులు ఉంటున్నారు. వీరు కూడా విభాగాలు తెరుచుకోవాల్సిన సమయంలో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. తరగతి గదుల్లో వేసే అటెండెన్స్‌తో పాటు ముఖ అటెండెన్స్‌ను బేరీజు వేసుకొంటున్నారు.

### సీసీ కెమెరాలు వచ్చాక...

గతంలో విద్యార్థులు తమకు నచ్చిన తరగతులకు వచ్చి మిగిలిన సమయం వ్యక్తిగత అవసరాలు చూసుకునే వారు. కొందరు ఆచార్యులు కూడా తమ ఛాంబర్లలో కూర్చొని పరిశోధక విద్యార్థులతో పాఠ్యాంశాల బోధన చేయించే వారు. ఇప్పుడు కొన్ని విభాగాల్లో సీసీ కెమెరాలు కూడా వినియోగించడంతో సీనియర్ ఆచార్యులు సైతం తరగతులకు వెళుతున్నారు. పాఠాలు బోధిస్తున్నారు. విద్యార్థులు తరగతి గదిలో ఉంటున్నారు.

### ఇంకొన్ని సంస్కరణలు..

★ విద్యార్థులు తరగతులకు హాజరైనప్పుడు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు తీసుకు రావాల్సిందే. అదే విధంగా చొక్కాలు వేసుకొని రావాలి. టీ షర్టులతో వస్తే అనుమతించడం లేదు. ఎవరైనా తొలిసారి వస్తే హెచ్చరించి విడిచి పెడుతున్నారు. రెండు లేదా మూడోసారి వస్తే మాత్రం ఆబ్సెంట్ వేస్తున్నారు.


ముఖ హాజరుకు వచ్చిన విద్యార్థినులు

★ ఆల్కహాల్, డ్రగ్స్, ర్యాగింగ్, పొగాకు ఉత్పత్తులు నిషేధించారు. వీటిని వినియోగించే విద్యార్థులపై చర్యలు తీసుకోవడానికి ఓ కమిటీని ఏర్పాటు చేశారు. ప్రతి వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీలు చేపడుతుండటంతో నాన్ బోర్డర్లు పలాయనం చిత్తగిస్తున్నారు.

### మార్పు తీసుకువచ్చాం...



ఫేస్ అటెండెన్స్ డివైస్‌లు ఏర్పాటు చేసిన తర్వాత ఏయూలో అన్ని విభాగాల్లో మార్పు వచ్చింది. పెద్దసార్లు పాఠాలు బోధించడం అన్న ఆచారం తప్పింది. విద్యార్థులు, పరిశోధకులు సమయానికి తరగతులకు, ల్యాబ్‌లకు హాజరవుతున్నారు. త్వరలో ఆల్కహాల్, డ్రగ్స్, ర్యాగింగ్, పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే దుష్ప్రభావాలు వివరిస్తూ బోర్డులు ఏర్పాటు చేస్తాం. - ఆచార్య ఎన్.కిశోర్‌బాబు, రెక్టార్, ఆంధ్రవిశ్వవిద్యాలయం

## పీరియాడికల్ థ్రిల్లర్‌గా 'క' సినిమా


మాట్లాడుతున్న హీరో కిరణ్ అబ్బవరం

డాబాగార్డెన్స్ (అల్లిపురం), న్యూస్‌టుడే: పాన్ ఇండియా సినిమాగా 'క'ను రూపొందించినట్లు హీరో అబ్బవరం కిరణ్ అన్నారు. డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో బుధవారం చిత్ర యూనిట్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. హీరో కిరణ్ మాట్లాడుతూ పీరియాడికల్ థ్రిల్లర్‌గా తీసిన ఈ సినిమా ఈనెల 31న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. నయన్ సారిక, తన్వీరామ్ హీరోయిన్లుగా నటించారని చెప్పారు. విశాఖతో తనకు ఎంతో అనుబంధం ఉందని, ఎస్.ఆర్. కల్యాణమండం సినిమా కథను ఇక్కడి ఆర్.కె.బీచ్‌లో రాసినట్లు తెలిపారు. 'క' సినిమాకు ఎందుకు ఆ పేరు పెట్టామనేది చివరలో చెబుతామన్నారు. గోపాలకృష్ణరెడ్డి మంచి అభిరుచి గల నిర్మాత అన్నారు. కర్ణాటకలో, రామోజీ ఫిల్మ్ సిటీలో ఈ సినిమా చిత్రీకరణ చేశామని, ఇందులో జాతర పాట ప్రేక్షులకు మంచి అనుభూతి ఇస్తుందని పేర్కొన్నారు.

## సైబర్ భద్రతపై అవగాహన

సింధియా, న్యూస్‌టుడే: తూర్పు నౌకాదళ పరిధి అన్ని నేవల్ యూనిట్లలో సైబర్ భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు బుధవారం నేవీ వర్గాలు తెలిపాయి. 'జాతీయ సైబర్ భద్రత అవగాహన మాసం-2024' నేపథ్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నాయి. సైబర్ ఫోర్స్, సేఫ్ గార్డింగ్, డిజిటల్ సీస్ వంటి అంశాలపై నిపుణులు సూచనలు చేస్తున్నారని స్పష్టం చేశాయి. సైబర్ పీస్ ఫౌండేషన్ సహకారం అందిస్తున్నట్టు వెల్లడించాయి.

## 'గంగాభవాని ప్యానెల్'దే విజయం

### ప్రశాంతంగా నర్సుల సంఘం ఎన్నిక

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం (ఏపీజీఎన్ఏ) ఉమ్మడి విశాఖ జిల్లా కమిటీ ఎన్నిక బుధవారం ప్రశాంతంగా ముగిసింది. కేజీహెచ్ ఆవరణలోని నర్సుల క్వార్టర్స్‌లో ఉదయం 8గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల అధికారి, సహాయకార్మిక సహాయ రిజిస్ట్రార్ బి.శ్రీనివాస్ ప్రక్రియను పరిశీలించారు. ఉషారాణి, గంగాభవాని ప్యానళ్లకు చెందిన అభ్యర్థులు కేజీహెచ్ వద్ద భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి ఓటర్లను ఆకట్టుకొనే ప్రయత్నం చేశారు. చివరి నిమిషం వరకు ముమ్మరంగా ప్రచారం చేశారు. అధ్యక్ష పదవితో పాటు ఉపాధ్యక్ష, కోశాధికారి, అయిదు కార్యవర్గ సభ్యుల పదవులకు ఇద్దరేసి చొప్పున 16 మంది, కార్యదర్శి పదవికి ముగ్గురు చొప్పున మొత్తం 19 మంది ఎన్నికల బరిలో నిలిచారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ఆసుపత్రుల్లో శాశ్వత ప్రాతిపదికన పనిచేస్తున్న నర్సులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.


ఓటు హక్కు వినియోగించుకుంటున్న నర్సులు

★ మొత్తం 555 మంది ఓటర్లు ఉండగా, మొదటి రెండు గంటల వ్యవధిలో 50 మంది ఓటేశారు. మధ్యాహ్నం 12గంటల సమయానికి 257 మంది, పోలింగ్ ముగిసే సమయానికి 94శాతం అంటే 521 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం 5.30గంటల సమయంలో పోలైన ఓట్లను లెక్కించే ప్రక్రియను ప్రారంభించారు.


విజేతలు వీరే

★ ఉత్కంఠ భరితంగా జరిగిన ఎన్నికల్లో గంగాభవాని ప్యానెల్ విజయం సాధించింది. ఓట్ల లెక్కింపు అనంతరం విజేతల పేర్లను ఎన్నికల అధికారి శ్రీనివాస్ ప్రకటించారు. అధ్యక్షురాలిగా టి.గంగాభవాని, ఉపాధ్యక్షురాలిగా ఎం.ఇందిర, కార్యదర్శిగా జి.వి.ఎస్.వరలక్ష్మి, కోశాధికారిగా ముద్దరాజు వంశీ, కార్యవర్గ సభ్యులుగా ఎస్.మెహర్ శాంతి, వియ్యపు వినీల, దాసరి లిల్లీగ్రేస్, ఎస్.గంగాగౌరి, పి.పద్మజ ఎన్నికయ్యారు.

## రైల్వేస్టేషన్‌లో భారీగా బంగారం పట్టివేత

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విశాఖ రైల్వేస్టేషన్‌లో బుధవారం భారీ ఎత్తున బంగారం పట్టుబడింది. మధ్యాహ్నం విజయవాడ నుంచి విశాఖ వచ్చిన ముంబయి-భువనేశ్వర్(11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో మారిదా ఎక్స్‌ప్రెస్ లాజిస్టిక్ సర్వీసుకు చెందిన పార్శిళ్లను ఆర్పీఎఫ్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేశారు. ఓ పార్శిల్‌లో 2.77 కేజీల బంగారం, 2.15 కేజీల వెండి నాణేలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటికి ఎటువంటి బిల్లులు లేకపోవడంతో అనధికారికంగా తీసుకొస్తున్నట్లు గుర్తించి జీఎస్టీ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి నిర్వాహకులకు రూ.8,60,170 జరిమానా విధించారు.



స్వాధీనం చేసుకున్న బంగారం, వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామకృష్ణ



## ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

కరాస, న్యూస్‌టుడే : రాష్ట్రీయ ఏక్ పర్వ్, ఏక్ భారత్, శ్రేష్ఠభారత్ కళా ఉత్సవం-2024 వేడుకలు బుధవారం 104 ఏరియా శ్రీవిజయనగర్ కేంద్రీయ విద్యాలయం-2లో ముగిశాయి. హైదరాబాద్ రీజియన్ పరిధి ఆంధ్ర, తెలంగాణకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులు, 70 మంది ఉపాధ్యాయులు హాజరైనట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ అంశాల్లో ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కేవీ ప్రధానాచార్యులు సీహెచ్.శ్రీనివాసులు మాట్లాడుతూ... ఇక్కడి పోటీల్లో ప్రతిభ చూపిన వారు నవంబరు 11న హైదరాబాద్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామచంద్రరావు, ఇందిర, బాలాజీ, రామ్‌భూపాల్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


బృందగానం చేస్తున్న కేవీ విద్యార్థులు

## ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు: కలెక్టర్


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్


ఆనందపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూములను పరిరక్షించడం మనందరి కర్తవ్యమని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. బుధవారం ఆనందపురం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో భీమిలి నియోజకవర్గ పరిధిలోని రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆక్రమణలకు గురైన సర్కారు భూములను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖ మహానగరానికి ఉన్న ప్రాముఖ్యత దృష్ట్యా భవిష్యత్తులో పారిశ్రామిక, ఐటీ పరిశ్రమలు రానున్న తరుణంలో క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది రెవెన్యూ దస్త్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీఆర్వో నుంచి కలెక్టరు వరకు అందరూ నిబద్ధతతో పనిచేయాలని, నిజాయతీగా ఉన్నప్పుడే వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. దస్త్రాల తారుమారు తదితర తప్పిదాలు ఎవరు చేసినా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. మ్యుటేషన్ ప్రక్రియ, పట్టాదారు పాసు పుస్తకాల జారీలో జాగ్రత్తలు తీసుకోవాలని, రెవెన్యూ పరమైన విషయాల్లో ఏదైనా తప్పు జరిగినట్లు తెలిస్తే వెంటనే స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, ప్రత్యేక ఉప కలెక్టర్లు, తహసీల్దార్లు, సర్వే అధికారులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ పోటీలకు అర్హత



సాగర్‌నగర్, న్యూస్‌టుడే: చైనాలో ఈనెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరగనున్న ప్రపంచకప్ 'డ్రాగన్ బోటు-2024' పోటీల్లో సాంకేతిక అధికారిగా బాధ్యతలు నిర్వర్తించేందుకు కయాకింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు, జలక్రీడల నిపుణుడు **బి.బలరామ్‌నాయుడు** అర్హత సాధించారు. ఈ మేరకు సంబంధిత వివరాల్ని బుధవారం ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రపంచస్థాయి పోటీల్లో భారతదేశం తరపున ఈయన ప్రాతినిధ్యం వహిస్తుండడం ప్రశంసనీయమని సహచర నిపుణులు అభిప్రాయపడ్డారు. జలక్రీడల్లో (వాటర్ స్పోర్ట్స్) విజయం సాధించి భారతదేశం పేరు ప్రఖ్యాతులను మరింత ఇనుమడింపజేసేలా నాయుడు చేస్తున్న కృషిని వారు అభినందించారు.

## జాతీయ టీటీ పోటీలకు అంపైర్‌గా శర్మ



విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్(టీటీ) పోటీలకు అంపైర్‌గా ఎల్ఐసీ ఉద్యోగి **డి.వి.ఎస్.వై. శర్మ** నియమితులయ్యారు. పోటీలు గురువారం నుంచి హరియాణాలో ప్రారంభమవుతాయి. శర్మ ప్రస్తుతం ఏపీ టేబుల్ టెన్నిస్ సంఘం ఉపాధ్యక్షుడిగా, జిల్లా సంఘం కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. అలాగే ఎల్ఐసీ ఆలిండియా క్రీడా ప్రమోషన్ బోర్డులో సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఆయన ఎంపికపై ఎల్ఐసీ అధికారులు హర్షం వ్యక్తం చేశారు.




శ్రీకాకుళం రోడ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

## తుపాను హెచ్చరికలతో వాల్తేరు రైల్వే అప్రమత్తం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: దానా తుపాను హెచ్చరికలను దృష్టిలో ఉంచుకొని వాల్తేర్ డివిజన్‌లో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. రైల్వే వంతెనలు, పట్టాలు, సిగ్నలింగ్, టెలికమ్యూనికేషన్ వ్యవస్థలపై నిరంతరం నిఘా ఉంచామన్నారు. అదనపు కంట్రోల్ రూమ్‌లు, విపత్తు నిర్వహణ విభాగాన్ని అందుబాటులో ఉంచామన్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి వైద్య సిబ్బందితో కూడిన అంబులెన్సులు, సివిల్ డిఫెన్స్ సిబ్బంది స్కౌట్, గైడ్స్ క్యాడెట్లను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. శ్రీకాకుళం రోడ్ స్టేషన్‌తో పాటు పలు చోట్ల తీసుకున్న ముందస్తు చర్యలను బుధవారం డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఇతర సీనియర్ అధికారుల బృందం పరిశీలించింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

**హెల్ప్‌లైన్ నెంబర్లు:** ★ విశాఖ: 0891-2746330, 2744619, 87126 41255, 77807 87054 ★ విజయనగరం: 08922-221202, 87126 41260 ★ శ్రీకాకుళం రోడ్: 08942-286213, 286245

**చికెన్ ధరలు**
(కిలోకి - రూ.లలో)

| | వెన్‌కాబ్ | బ్యాగ్ |
|---|---|---|
| ఫారం గేటు | 115 | 110 |
| లైవ్ | 137 | 130 |
| డ్రెస్డ్ | 199 | 230 |
| స్కిన్‌లెస్ | 226 | 240 |

# గాజువాక

•గాజువాక •విశాఖ పశ్చిమం


## వరద బాధితులకు సాయం



ఎమ్మెల్యే పల్లాకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

గాజువాక, న్యూస్‌టుడే : విజయవాడ వరద బాధితులకు గాజువాక వీఈపీ జూనియర్, డిగ్రీ కళాశాల యాజమాన్యం, సిబ్బంది రూ.50 వేల విరాళం అందజేశారు. సీఎం సహాయ నిధి పేరిట తీసిన చెక్కును బుధవారం గాజువాక తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు అందించారు. కళాశాల డైరెక్టర్ డీఎస్.కృష్ణకుమార్, ప్రిన్సిపల్ ఐ.సీతాలక్ష్మి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కమనీయం.. నరహరి నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే : శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య కల్యాణోత్సవం బుధవారం సింహగిరిపై కమనీయంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆసీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు భక్తులను ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.



విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు

## విస్తరణ మరిచి.. కాలువ నిర్మిస్తే ఎలా..?

పనులపై స్థానికుల అభ్యంతరం

–న్యూస్‌టుడే, గోపాలపట్నం

గోపాలపట్నం సమీప 91వ వార్డు పరిధి సింహాచలం రైల్వేస్టేషన్ రోడ్డులో సుమారు రూ.20 లక్షల జీవీఎంసీ నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రహదారికి ఇరువైపులా కాలువ నిర్మాణానికి ఏర్పాట్లు చేశారు.



సింహాచలం రైల్వేస్టేషన్ మార్గంలో నిర్మాణ పనులకు ఏర్పాట్లు

★ గతంలో ఈ రోడ్డు దాదాపు 30 అడుగుల వెడల్పుతో ఉండేది. క్రమేపీ దుకాణాల ఏర్పాటుతో ఆక్రమణకు గురై.. కుదించుకుపోయింది. ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించుకునే వీలులేక తరచూ ట్రాఫిక్ నిలిచిపోతుంటుంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే రైలు వచ్చే సమయంలో రైల్వే ప్రయాణికులు, సాధారణ ప్రయాణికుల రాకతో రహదారి మొత్తం కిక్కిరిసిపోతుంటుంది.

★ ప్రస్తుతం కాలువల నిర్మాణానికి ఓ వైపున ఉన్న దుకాణాలను పాక్షికంగా తొలగించారు. మరోవైపు జిల్లా పరిషత్‌కు చెందిన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాల జోలికి వెళ్లలేదు.

★ అయితే స్థానిక దుకాణదారులంతా కలిసి గుత్తేదారుడిని, ప్రజా పనుల విభాగం అధికారులను ప్రసన్నం చేసుకుంటున్నారు. తమ దుకాణాల జోలికి రాకుండా రోడ్డు వెడల్పు కుదించి కాలువల నిర్మాణం చేపట్టాలని ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం.

★ ఇప్పటికైనా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రోడ్డును వెడల్పు చేసేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇక్కడ రహదారికి అనుకుని ఉన్న జిల్లా పరిషత్ స్థలాన్ని వినియోగించుకుంటూ విస్తరణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## బాలల ప్రతిభ అదరహో..!





గాజువాక కుంచుమాంబకాలనీ ఎక్సలెంట్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులకు బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాలం వినియోగంతో లాభమా-నష్టమా', 'విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 8, 9, 10 తరగతులకు చెందిన వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా అంశాలను తమదైన శైలిలో, విభిన్న కోణాల్లో ఆవిష్కరించారు. ప్రతిభ చూపిన సీహెచ్.దీపిక, పి.లోహిత, కె.వర్షిణికి పాఠశాల ప్రిన్సిపల్ చుండూరు సత్య, ఇతర ఉపాధ్యాయులు చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు.

–న్యూస్‌టుడే, గాజువాక

## మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గోపాలపట్నం, సింధియా

?: జీవీఎంసీ 90వ వార్డు విమాననగర్‌లోని 4, 5, 8 లైన్లలో వీధి దీపాలు వెలగడం లేదు. –కె.రాధాకృష్ణ, విమాననగర్

✔: క్షేత్రస్థాయిలో పరిశీలించి.. దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. –గోవిందరావు, వీధి దీపాల నిర్వాహకుడు

?: జీవీఎంసీ 89వ వార్డు ఎల్లపువానిపాలెం-90వ వార్డు విమాననగర్ అంతర్గత మార్గంలో వాన నీరు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. – రమేశ్, చంద్రనగర్

?: జీవీఎంసీ 90వ వార్డు గాంధీనగర్ రోడ్డులో రోజుల తరబడి వర్షం నీరు, మురుగు నిలిచిపోతోంది. –రాజారావు, ఎన్‌ఏడీ

✔: సిబ్బందిని పంపి... మురుగు నిలిచిపోకుండా చర్యలు చేపడతాం. –వెంకటలక్ష్మి, ప్రజా పనుల విభాగం, ఏఈ.

?: యారాడ పార్కు గేటు, జవహర్‌నగర్ మెయిన్ రోడ్డు పరిసరాల్లోనే వ్యర్థాలు పారబోస్తున్నారు. రాకపోకలు సాగించే వారు తీవ్ర దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. – శ్రీనివాస్, జవహర్‌నగర్

✔: వీధుల్లో శుభ్రతపై నివాసితులకు అవగాహన కల్పిస్తాం. అవసరం మేరకు జరిమానాలు విధిస్తాం. – సతీశ్, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్

## తెదేపా సభ్యత్వ నమోదుపై దృష్టి : పల్లా

గాజువాక, న్యూస్‌టుడే : తెదేపా అధిష్ఠానం ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 26 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు నిర్వహిస్తామని పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం గాజువాక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిష్ఠాత్మకంగా జరిగే సభ్యత్వ నమోదును పండగ వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. గాజువాక నియోజకవర్గంలో 80 వేల సభ్యత్వాలు పూర్తి చేయాలన్నారు. సభ్యత్వం తీసుకున్న వారికి బీమా సదుపాయం ఉంటుందన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ ఇన్‌ఛార్జి ప్రసాదుల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. నాయకులు ఎండీ రఫీ, గొర్లె వెంకునాయుడు, విల్లా రామ్మోహన్‌కుమార్, బలగా బాలునాయుడు, తమిరి శివప్రసాద్, కర్రి దశేంద్ర, గోమాడ వాసు, గంతకోరు అప్పారావు, సర్వసిద్ధి అనంతలక్ష్మి, నిర్మలాకుమారి, అడుసుమిల్లి దీప్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

## లబ్ధిదారులుగా గుర్తించాలని వినతి

గోపాలపట్నం, న్యూస్‌టుడే : సామాజిక పింఛను మంజూరు చేయాలని ఎల్జీ పాలిమర్స్ కంపెనీ విశ్రాంత ఉద్యోగులు కోరారు. ఈ మేరకు వారు బుధవారం పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబును గోపాలపట్నంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కంపెనీ ఆధ్వర్యంలో రూ.3 వేలు మాత్రమే పింఛను వస్తుందని, ప్రస్తుతం పెరిగిన ధరల నేపథ్యంలో ఆ సొమ్ము ఎటూ చాలడం లేదని వారంతా వాపోయారు. ప్రభుత్వ సామాజిక పింఛన్‌కు అర్హులుగా గుర్తించి, ఆదుకోవాలని కోరారు. ఈ అంశంపై ఉన్నతాధికారులతో చర్చించి.. తగిన న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



విశ్రాంత ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

● **కిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స**

అక్కిరెడ్డిపాలెం(షీలానగర్), న్యూస్‌టుడే : షీలానగర్ కిమ్స్ ఆసుపత్రి వైద్యులు అత్యాధునిక టెక్నాలజీతో అరుదైన శస్త్రచికిత్స చేశారని ఆసుపత్రి పీఆర్వో గిరి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ వివరాలు... విజయనగరానికి చెందిన 64 ఏళ్ల మహిళ తీవ్రమైన తలనొప్పి, కుడి చేయి, కుడికాలు తిమ్మిరితో ఆసుపత్రిలో చేరారు. ఆమెకు వివిధ పరీక్షలు చేసి, మెదడులో రక్తనాళాలు ఉబ్బినట్లు వైద్యులు గుర్తించారు. రేడియాలజిస్ట్ పోతుల వెంకటేశ్ ఆధ్వర్యంలో ట్రెన్జా అనే నూతన పరికరాన్ని మెదడులో అమర్చి శస్త్రచికిత్స చేశారు. మూడో రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచి, బాధితురాలు పూర్తిగా కోలుకున్న తర్వాత ఇంటికి పంపించినట్టు ఆయన తెలిపారు.

● **అతిథి అధ్యాపకులకు ఆహ్వానం**

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి చర్యలు చేపడుతున్నామని ప్రిన్సిపల్ సుధాకర్‌బాబు బుధవారం తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు పౌరశాస్త్రం బోధించడానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల వారు నేరుగా కళాశాలలో సంప్రదించాలన్నారు.

● **నేటి నుంచి దీపావళి సామగ్రి విక్రయాలు**

ఉక్కునగరం (స్టీల్‌సెక్టారు–3), న్యూస్‌టుడే : ఉక్కు కో-ఆపరేటివ్ స్టోర్స్ ఆధ్వర్యంలో 24 నుంచి 31 వరకు దీపావళి సామగ్రి విక్రయిస్తామని స్టోర్స్ అధ్యక్ష, కార్యదర్శులు డి.వి.నాగబాబు, ఆకుల నూకరాజు బుధవారం తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాక్షేత్రం (సీడబ్ల్యూసీ-1)లో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు విక్రయాలు ఉంటాయన్నారు. సభ్యులు నాగభూషణం, జగదీష్, సత్యనారాయణ, లోకేశ్, భాను, శ్రీనివాసరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● **నేడు ఐటీఐలో జాబ్‌మేళా**

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : ప్రభుత్వ స్టీల్ సిటీ ఐటీఐలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గురువారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపల్ కేఎస్.శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిట్టర్, మెయింటర్, మెషినిస్టు ట్రేడ్లు పూర్తి చేసిన వారితో పాటు డిగ్రీ, డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 81217 43777 నంబరులో సంప్రదించాలని కోరారు.

● **అనాథ బాలలకు చేయూత**

గాజువాక, న్యూస్‌టుడే : శ్రీనగర్‌లోని డిజైర్ సొసైటీ అనాథ బాలలకు దీపావళి పండగ సందర్భంగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. సొసైటీకి మరింత తోడ్పాటు అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు సొసైటీ ప్రతినిధి లక్ష్మణ బుధవారం తెలిపారు.



సాయం అందజేస్తున్న గంటా దంపతులు

## మద్యం మత్తులో పోలీసులపై దౌర్జన్యం



ట్రాఫిక్ సిబ్బందితో వాదిస్తున్న శ్రీను



కానిస్టేబుల్ వేలిపై గాయం

గాజువాక, న్యూస్‌టుడే : అతిగా మద్యం తాగిన వ్యక్తి.. . పోలీసులపై దౌర్జన్యం చేసి, చేతి వేలు కొరికేసిన ఘటన బుధవారం రాత్రి గాజువాకలో చోటు చేసుకుంది. ఆ వివరాలు.. గాజువాక రాజీవ్‌మార్గ్ కూడలి వద్ద పోలీసులు డ్రంకన్ డ్రైవ్ కేసులు రాస్తున్నారు. హోమ్‌గార్డు ప్రసాద్, మొబైల్ కానిస్టేబుల్ రాజశేఖర్ ఆల్కా మీటర్లతో తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో అతిగా మద్యం తాగి బైక్‌పై వస్తున్న అమర్‌నగర్‌కు చెందిన ఆర్.శ్రీను(30)ను ఆపి తనిఖీ చేసేందుకు ప్రయత్నించారు. నన్నే అడ్డుకుంటారా..? అంటూ శ్రీను గొడవ చేశాడు. అంతటితో ఆగకుండా కానిస్టేబుల్ రాజశేఖర్ చేతి వేలిని కొరికేశాడు. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని నిందితుడిని గాజువాక పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

## విద్యుత్తు కార్మికుడికి గాయాలు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : విద్యుత్తు స్తంభంపై నుంచి జారిపడడంతో ఒకరికి గాయాలైన ఘటన పెదగంట్యాడ రూరల్ సబ్‌స్టేషన్ పరిధి దయాల్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఆ వివరాలు.. దయాల్‌నగర్ ఎస్ఎస్ 158 పరిధిలో బుధవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అసిస్టెంట్ లైన్‌మెన్ శ్రీనివాసరావు, ప్రైవేట్ అవుట్ సోర్సింగ్ పీక్‌లోడ్ ఆపరేటర్ ప్రసాద్(35) అక్కడకు వెళ్లారు. ప్రసాద్ స్తంభంపైకి ఎక్కి తీగల్ని సరి చేస్తుండగా... ప్రమాదవశాత్తు జారి కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. తోటి సిబ్బంది వెంటనే నగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పర్మినెంట్ సిబ్బంది స్తంభం ఎక్కి పని చేయాల్సి ఉన్నా, అవుట్ సోర్సింగ్ సిబ్బందితో నిర్లక్ష్యంగా పనులు చేయించారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై జోన్-2 డీఈ బీకే నాయుడు వివరణ కోరగా.. .. ట్రాన్స్‌ఫార్మర్ స్తంభం తుప్పుపట్టి ఉండడంతో ఘటన జరిగిందని, ప్రస్తుతం బాధితుడు కోలుకుంటున్నాడని తెలిపారు.

## గాజువాక సినిమాలు..

కన్య: దేవర, హెవెన్: జనక అయితే గనక.., శ్రీకన్య: లక్కీ; హెవెన్: అరుణ (పెదగంట్యాడ): అన్నపూర్ణ (కూర్మన్నపాలెం): వేట్టయాన్, మోహినీ 70ఎంఎం: విశ్వం, లక్ష్మీకాంత్: శ్వాగ్, మినీ మోహినీ: మార్టిన్, మోహినీ: జిగ్రా, విశేష్: మా నాన్న సూపర్ హీరో

**ఎస్టీబీఎల్‌లో:** స్క్రీన్-2: వేట్టయాన్, స్క్రీన్-3: విశ్వం, స్క్రీన్-4: దేవర, స్క్రీన్-1: జనక అయితే గనక

**గోపాలపట్నంలో:** శ్రీనరసింహ: జనక అయితే గనక, నరసింహ: వేట్టయాన్, సౌజన్య: విశ్వం, సుకన్య: దేవర, మౌర్య: మార్టిన్

## జోన్-8 ఈఈగా చిరంజీవులు

వేపగుంట, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-8 ఇంజినీరింగ్ విభాగం ఈఈగా ఎస్.చిరంజీవులు బుధవారం విధుల్లో చేరారు. ఇటీవల నిర్వహించిన బదిలీల్లో భాగంగా జోన్-7 నుంచి ఈయన ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన ఈఈ రత్నాకర్‌రెడ్డి యూజీడీ ప్రాజెక్టు విభాగానికి బదిలీ అయ్యారు.



## మొక్కల పెంపకానికి ప్రాధాన్యం

షిప్‌యార్డుకాలనీ(మల్కాపురం), న్యూస్‌టుడే : కాలుష్యాన్ని నియంత్రించేలా... పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని హిందుస్థాన్ షిప్‌యార్డు కాలనీ ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రాథమిక స్థాయి నుంచే మొక్కల్ని నాటి, పెంచేలా చర్యలు చేపడుతున్నారు. పచ్చదనం, స్వచ్ఛభారత్, ప్లాస్టిక్ నిర్మూలన, కాలుష్య నియంత్రణ.. తదితర అంశాల్లో పిల్లల్ని భాగస్వామ్యం చేస్తున్నారు. విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక బాధ్యత అలవర్చేలా కృషి చేస్తున్నామని హెచ్ఎం పి.శ్రీదేవి, ఉపాధ్యాయుడు హరినాథ్ తెలిపారు.



చెట్టుకు నీరు పోస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయుడు

## స్పందనకు వందనం

### వేగ నిరోధకాల ఏర్పాటు



పారిశ్రామిక ప్రాంతం సేవా రహదారిలో వాహనాలు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తుండడంతో తరచూ ప్రమాదాలు జరిగేవి. ఈ సమస్యపై గతంలో పలుమార్లు 'ఈనాడు'లో వార్తలు ప్రచురితమయ్యాయి. ఎట్టకేలకు స్పందించిన అధికారులు బుధవారం హిమాచల్ నగర్ వద్ద, జింక్ ఆంజనేయ స్వామి ఆలయం మలుపు వద్ద వేగ నిరోధకాలు నిర్మించారు. ఆయా పనులను జీవీఎంసీ ప్రజా పనుల విభాగం సిబ్బంది పర్యవేక్షించారు.

–న్యూస్‌టుడే, సింధియా(నెహ్రూనగర్)

● **ఆరోగ్యకార్డులు అందించాలి**

గాజువాక, న్యూస్‌టుడే : జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు ఆయుష్మాన్ భారత్ పేరిట రూ.5 లక్షల బీమాతో కూడిన ఉచిత ఆరోగ్య కార్డులు అందజేయాలని భాజపా కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం గాజువాక పీహెచ్‌సీ, జీవీఎంసీ హెల్త్ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. హెల్త్‌కార్డుల జారీలో జరుగుతున్న జాప్యంపై ఆరా తీశారు. పథకానికి అర్హులైన వారి వివరాలు నమోదు చేయాలని సూచించారు. డాక్టర్లు కిరణ్‌కుమార్, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## వేతన ఒప్పందం అమలుకు డిమాండ్

సింధియా, న్యూస్‌టుడే : ఒప్పంద కార్మికులకు వేతన పెంపు ఒప్పందం జరిగి ఏడేళ్లయినా ఇప్పటికీ యాజమాన్యం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం అన్యాయమని ఏఐటీయూసీ నాయకుడు జేవీ సత్యనారాయణ మూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం కోరమాండల్ గేటు వద్ద కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో ఆయన మాట్లాడారు. వేతనాల పెంపు లేకపోవడంతో కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. సంస్థ క్యాంటీన్‌లో నాణ్యమైన భోజనం అందుబాటులోకి తీసుకురావాలని, సీనియార్టీతో కూడిన పదోన్నతి విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక నాయకులు కె.సత్యనారాయణ, జి.రాంబాబు, సత్యనారాయణరెడ్డి, కె.శంకరరావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు సత్యనారాయణమూర్తి

## సినీ నటికి సత్కారం

అగనంపూడి, న్యూస్‌టుడే : ఈనెల 25న విడుదలవుతున్న 'ఎంత పని చేశావ్ చంటి' సినిమాలో నటించిన అగనంపూడి ప్రాంతానికి చెందిన నటి సూర్యను బుధవారం స్థానిక అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. సీడబ్ల్యూసీలో ఏర్పాటైన కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బి.సత్యనారాయణ మాట్లాడుతూ... సినిమాలో సూర్యకాంతం పాత్రలో నటించిన సూర్య ప్రతిభకు మంచి గుర్తింపు దక్కాలని, భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు రావాలని ఆకాంక్షించారు. ఉక్కు విశ్రాంత అధికారులు దువ్వాడ రామ్‌ప్రసాద్, గుదే సుశీలగజేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



సూర్యను అభినందిస్తున్న సత్యనారాయణ, తదితరులు

## కనీస వేతనాలకు విన్నపం

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : ఫార్మసిస్టులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఏపీ ఫార్మసీ సంఘం ప్రతినిధులు పప్పల వేణు, కిరణ్‌ప్రసాద్, ఎల్ఎన్.రాజు, నరేష్ మోహన్‌రావు కోరారు. ఈ మేరకు వారు బుధవారం బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షులు మళ్ల జగదీశ్వరరావును కూర్మన్నపాలెంలో కలిసి వినతిపత్రం అందజేశారు. లేబర్ యాక్టు ప్రకారం రూ.23 వేలు చెల్లించాల్సి ఉన్నా, రూ.10 వేలు మాత్రమే ఇస్తున్నారని వివరించారు. ఈ అంశాన్ని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.



జగదీశ్వరరావుకు వినతి అందజేస్తున్న ప్రతినిధులు





## నృత్యంలో కళాకారుల ప్రతిభ



గాజువాక, న్యూస్‌టుడే : కేరళ తిరువనంతపురంలోని అనంత పద్మనాభస్వామి సన్నిధిలో గాజువాకకు చెందిన నాట్యారాధన మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీ చిన్నారులు సాంస్కృతిక వేడుకతో అలరించారు. ఈనెల 20 నుంచి జరుగుతున్న వేడుకల్లో భాగంగా దేవస్థాన కమిటీ ఆదేశాలతో నాట్యగురువు నంబాల జ్యోతి నేతృత్వంలో 13 మంది చిన్నారులు నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. బుధవారం నాట్య బృందానికి దేవస్థానం ప్రతినిధులు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అకాడమీ డైరెక్టర్ కొవిరి కనకరాజు తదితరులు చిన్నారులను అభినందించారు.

## బాలిక అప్పగింత

గోపాలపట్నం, న్యూస్‌టుడే : తల్లిదండ్రులు మందలించారన్న కోపంతో ఇంటి నుంచి వచ్చేసిన బాలికను పోలీసులు తిరిగి అప్పగించారు. ఆ వివరాలు.... సింహాచలం ప్రాంతానికి చెందిన బాలిక(17) తరచూ చరవాణిలో రీల్స్ చూస్తుందని తల్లిదండ్రులు మందలించారు. దాంతో ఈనెల 20న బాలిక ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఆందోళన చెందిన తల్లిదండ్రులు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. సీఐ సురేశ్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. చరవాణి సిగ్నల్స్ ఆధారంగా బాలిక నగరంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సిలింగ్ ఇచ్చి, తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్సైలు రామకృష్ణ, అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైళ్లు లేక.. దిక్కు తోచక..!

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: దానా తుపాను కారణంగా హావ్‌డా, షాలిమార్, భువనేశ్వర్ వైపు వెళ్లే రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. దీంతో పాటు పలు రైళ్ల రాకపోకల్లో తీవ్ర అంతరాయం ఏర్పడి ఆలస్యంగా నడుస్తున్నాయి. బుధవారం నుంచి రైళ్లు రద్దయినప్పటికీ అంతకు ముందు బయలుదేరినవి ఒక్కొక్కటిగా విశాఖ చేరుకుంటున్నాయి. అయితే కనెక్టింగ్ రైళ్లు లేకపోవడంతో పెద్దఎత్తున ప్రయాణికులు రైలు నిలయంలో పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గమ్యస్థానానికి చేరే దారి తెలియక ఆందోళన చెందుతున్నారు. నిరీక్షిస్తున్న వారితో స్టేషన్ పరిసరాలు రద్దీగా మారాయి. మరో పక్క అరకొరగా నడుస్తున్న రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి.



స్టేషన్‌లోనే నిరీక్షిస్తున్న ప్రయాణికులు



ఎక్కడ చూసినా రద్దీయే..

## కాలువలు, రహదారుల నిర్వహణపై ఆరా



మైసూర్ నగర మున్సిపల్ కమిషనర్‌తో విశాఖ కార్పొరేటర్లు

అక్కిరెడ్డిపాలెం, గోపాలపట్నం, న్యూస్‌టుడే : విశాఖ నగర అభివృద్ధికి అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని కార్పొరేటర్లు కోరారు. అధ్యయన యాత్రకు వెళ్లిన నగర కార్పొరేటర్లు బుధవారం మైసూర్ నగర మున్సిపల్ కమిషనర్ అషాద్ ఉర్ రెహమాన్ షరీఫ్‌ను కలిశారు. రహదారులు, కాలువలు, పరిశుభ్రత.. ఇతర అంశాలపై అనుసరిస్తున్న విధివిధానాలపై అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్లు జియ్యాని శ్రీధర్, దాడి వెంకటరమేశ్, కాకి గోవింద రెడ్డి, బొండా జగన్, స్టాలిన్, తిప్పల వంశీరెడ్డి, గల్లా చిన్న, బొమ్మిడి రమణ, రౌతు శ్రీనివాసరావు, జీవీఎంసీ కార్యదర్శి బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

## పోస్టర్ ఆవిష్కరణ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఏబీవీపీ యూనివర్సిటీ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను భాజపా జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర లాసన్స్‌బేకాలనీ భాజపా కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. 27, 28 తేదీల్లో రెండు రోజుల పాటు గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో ఈ విద్యార్థుల సమ్మేళనం జరగనుందన్నారు.

## వసతి గృహం పరిశీలన

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్ర విశ్వవిద్యాలయం విదేశీ విద్యార్థుల వసతి గృహాన్ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు బుధవారం మధ్యాహ్నం సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో కల్పిస్తున్న సదుపాయాలను ఆయన స్వయంగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి అక్కడే భోజనం చేశారు. విద్యార్థులకు ఎటువంటి సహాయం అవసరమైన వెంటనే తమను సంప్రదించాలని సూచించారు. అంతకుముందు రిజిస్ట్రార్‌కు పూల బొకే అందించి సిబ్బంది స్వాగతం పలికారు.